


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 02-09-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 276 | SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal | Follow us on




## నీట్ కేసుల కొట్టివేత..
## బాధిత కుటుంబాలకు పరిహారం!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ఎఎంఎస్) :**

దేశవ్యాప్తంగా సాగిన నీట్ (NEET) నిరసనలకు సంబంధించి విద్యార్థులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 అందించిన విస్తృత అధికారాలను ఉపయోగించి ఈ కేసులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, నిరసనల పేరుతో తీవ్ర నేరాలకు ఒడిగట్టిన 2,873 మందిపై మాత్రం కొత్తగా కేసులు నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు న్యాయస్థానం అనుమతినిచ్చింది.

**3 నెలల్లోగా పరిహారం పంపిణీ**

నీట్ రద్దు తదనంతర పరిణామాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకునేందుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. బాధితులకు మూడు నెలల వ్యవధిలోగా పరిహారం చెల్లించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ధర్మాసనం ఇచ్చిన ఈ సానుకూల తీర్పు నేపథ్యంలో, సెప్టెంబర్ 5న చేపట్టతలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (CJP) సర్వోన్నత న్యాయస్థానానికి స్పష్టం చేసింది.

కేంద్రం అభ్యర్థనపై స్పందించిన సుప్రీం ధర్మాసనం భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. జులై 20 నుంచి 25 మధ్య కాలంలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు ప్రత్యేక అధికారాలను ఉపయోగించాలని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు.



సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులుగా

## డి.ఎస్. జగన్ బాధ్యతల స్వీకరణ!

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వుదయం)**

తెలంగాణ రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకుడిగా డి.ఎస్. జగన్ పదోన్నతి పొందారు. ప్రభుత్వం ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన కొత్త బాధ్యతలను స్వీకరించారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో మర్యాదపూర్వక భేటీ**

బాధ్యతలు స్వీకరించిన అనంతరం డి.ఎస్. జగన్ డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పదోన్నతి పొందిన జగన్‌ను ఈ సందర్భంగా మంత్రి శుభాకాంక్షలతో అభినందించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా విధానాల సమాచారాన్ని ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా చేరవేయడంలో ఐ అండ్ పిఆర్ శాఖ కీలకపాత్ర పోషించాలని సూచించారు. ప్రభుత్వం, మీడియా, ప్రజల మధ్య నిరంతరం మెరుగైన సమన్వయాన్ని నెలకొల్పే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు.



**స్పెషల్ కమిషనర్ శుభాకాంక్షలు**

మంత్రి భేటీ అనంతరం, సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డా. జి. ముకుంద రెడ్డిని డి.ఎస్. జగన్ కలిశారు.

# హైదరాబాద్‌లో ప్రపంచ ప్రసిద్ధ విశ్వవిద్యాలయాలు



### బ్రిటన్, అమెరికా దిగ్గజ వర్సిటీల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు!
### హైదరాబాద్ కు హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ భాగస్వామ్యాలు!

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వుదయం)**

తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో చారిత్రాత్మక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్రిటన్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికా (బోస్టన్)లోని 'నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా (X) వేదికగా మంగళవారం వెల్లడించారు. ఇటీవల ఆయన నేతృత్వంలోని ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం బ్రిటన్, అమెరికా దేశాల్లో జరిపిన విదేశీ పర్యటనలు అత్యంత ఫలప్రదమయ్యాయని, ఈ క్రమంలోనే పలు ఒప్పందాలు కొలిక్కి వచ్చాయని తెలిపారు. మన దార్శనికతకు అంతర్జాతీయ గుర్తింపు: సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌ను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దాలనే తమ దూరదృష్టిని ప్రపంచ ప్రసిద్ధ విద్యాసంస్థలు ఏకీభవించి, భాగస్వామ్యానికి ముందుకు రావడం తెలంగాణ ప్రజలకు, ముఖ్యంగా యువతకు ఎంతో గర్వకారణమని సీఎం హర్షం వ్యక్తం చేశారు. "యువతకు నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, నాణ్యమైన విద్యనందించడమే నా ముఖ్యమైన లక్ష్యం. ప్రపంచస్థాయి సవాళ్లను ఎదుర్కొనేలా మన యువతను తీర్చిదిద్దడమే నా ప్రాధాన్యం" అని ఆయన పేర్కొన్నారు.హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీలతో కీలక భాగస్వామ్యాలుయూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ వర్సిటీల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లతో పాటు, ప్రపంచ ప్రసిద్ధ హార్వర్డ్ యూనివర్సిటీ కూడా తెలంగాణలో ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు, స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమాలను అందించేందుకు సుముఖత వ్యక్తం చేసిందని సీఎం తెలిపారు. తమ పర్యటనలో భాగంగా ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, ఇంపీరియల్ కాలేజీ, లండన్ బిజినెస్ స్కూల్ , లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ , ఎస్ఓఏఎస్ తో పాటు అమెరికాకు చెందిన ఐవీ లీగ్ సంస్థలు, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రతినిధులతో జరిపిన చర్చలు సానుకూల ఫలితాలను ఇచ్చాయని వివరించారు. విద్యా వ్యవస్థలో సరికొత్త విప్లవం ప్రపంచ స్థాయి ప్రమాణాలు కలిగిన విద్యా కోర్సులు, సర్టిఫికేషన్ ప్రోగ్రామ్‌లు, ఉమ్మడి పరిశోధనా కేంద్రాలు , ప్రాధాన్యతా కేంద్రాల ఏర్పాటు ద్వారా హైదరాబాద్ అంతర్జాతీయ విద్యా వ్యవస్థలోనే అత్యంత శక్తివంతమైన కేంద్రంగా మారుతుందని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఇకపై మన విద్యార్థులు విదేశాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇక్కడే ఉండి అంతర్జాతీయ స్థాయి విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుందని స్పష్టం చేశారు.

# భారత ఆర్థిక వ్యవస్థ ధీమా

- ప్రపంచ సంక్షోభంలోనూ దూసుకెళ్తున్న భారత్
- ఆర్‌బీఐ అంచనాలను మించిన జీడీపీ
- తొలి త్రైమాసికంలో 7.8% జీడీపీ వృద్ధి
- స్వదేశీ మంత్రం.. వికసిత్ భారత్ మార్గం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ఎఎంఎస్) :**

అంతర్జాతీయంగా ఎటుచూసినా అనిశ్చితులు, ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత ఆర్థిక వ్యవస్థ సరికొత్త రికార్డు నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం (ఏప్రిల్‌జూన్) లో దేశ జీడీపీ వృద్ధి రేటు ఏకంగా 7.8 శాతంగా నమోదు కావడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతోషం వ్యక్తం చేశారు. ఈ అద్భుత ఘనత సాధించిన దేశ ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ప్రధాని, అక్కడి నుంచే ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ స్వదేశీ వినియోగాన్ని పెంచాలని మరోసారి పిలుపునిచ్చారు.

**అంతర్జాతీయ సంక్షోభంలోనూ భారత ప్రగతి ప్రస్థానం**

ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం, ఇంధన కొరత, సరఫరా వ్యవస్థల ఆటంకాలు కొనసాగుతున్నప్పటికీ భారత్ ఈ స్థాయి వృద్ధిని సాధించడం విశేషమని ప్రధాని కొనియాడారు. "2020 కొవిడ్ మహమ్మారి తదనంతరం ప్రపంచవ్యాప్తంగా స్థిరత్వం లోపించింది. కానీ, 140 కోట్ల మంది భారతీయుల సంకల్ప బలం, నిరంతర కృషి వల్ల మన దేశం వేగంగా పురోగమిస్తోంది. ఆర్‌బీఐ అంచనా వేసిన 7 శాతం కంటే ఎక్కువ వృద్ధి రేటు నమోదు కావడం భారత్‌కు దక్కిన అసాధారణ ఘనత" అని మోదీ స్పష్టం చేశారు.



**స్వదేశీ మంత్రాన్ని పాటిద్దాం: ప్రధాని పిలుపు**

దేశాన్ని స్వావలంబన దిశగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ స్థానిక ఉత్పత్తులకే ప్రాధాన్యమివ్వాలని ప్రధాని కోరారు. తన సందేశంలో పలు కీలక అంశాలను ఆయన ప్రజల ముందుకు తెచ్చారు: విదేశీ టూర్లకు స్వస్తి: విహారయాత్రల కోసం విదేశాలకు వెళ్లడం తగ్గించుకోవాలని సూచించారు. 'వెడ్ ఇన్ ఇండియా': విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌ల సంస్కృతికి దూరంగా ఉండి, 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్ని పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనవసర బంగారం వద్దు: అవసరం లేకపోయినా బంగారంపై పెట్టుబడులు పెట్టే అలవాటును మానుకోవాలన్నారుస్వదేశీ వస్తువులు సేవలు: స్థానికంగా తయారైన వస్తువులు, సేవలను ఎంత ఎక్కువగా ఎంచుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థ అంతగా బలపడుతుందని చెప్పారు. మనం వికసిత్ భారత్ లక్ష్యానికి కట్టుబడి ఉంటే, స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్ల నాటికి (2047) భారతదేశం పూర్తిస్థాయి అభివృద్ధి చెందిన దేశంగా రూపుదిద్దుకుంటుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ కాంగ్రెస్‌లో ముమ్మర రాజకీయ చట్రం



### అధిష్ఠానం వద్దకు చేరిన పంచాయితీ!

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1 (ఎఎంఎస్) :**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి హస్తిన పర్యటనలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి కొండా సురేఖ హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. పర్యటనలో భాగంగా ఆమె ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలను ఉద్దేశించి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ (డీఏసీ) మంత్రికి షోకాజ్ నోటీసులు జారీ చేయగా, ఆమె కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ ఇచ్చారు. దీనితో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సంబంధించిన నివేదికను కూడా టీపీసీసీ అధిష్ఠానానికి పంపించింది. ఈ పరిణామాల నేపథ్యంలో సురేఖ ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ హైకమాండ్ ఆమె విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. మరోవైపు తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, మార్పులు చేర్పులపై ఢిల్లీ వేదికగా ప్రచారం తీవ్రమైంది. త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీతో పాటు కేబినెట్ పునర్వ్యవస్థీకరణపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలంతా ఢిల్లీకి చేరుకుంటున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హస్తినకు చేరుకున్నారు. అయితే బుధవారం జరగనున్న 'స్వామినాథన్ ఫౌండేషన్ వైఎస్ అవార్డు' ప్రదానోత్సవ కార్యక్రమానికి హాజరయ్యేందుకే తాము ఢిల్లీకి వచ్చినట్లు పలువురు నేతలు వెల్లడిస్తున్నారు.

## హైకోర్టులో రంగనాథ్‌కు ఉపశమనం

**సింగిల్ జడ్జి తీర్పును సవాల్**

### కమిషనర్ బదిలీ ఆదేశాల తాత్కాలిక సస్పెన్షన్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వుదయం)**

హైదరాబాద్ విపత్తు ప్రతిస్పందన, ఆస్తుల పర్యవేక్షణ, సంరక్షణ సంస్థ (హైడ్రా) కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో భారీ ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్స్ట్రక్షన్‌కు సంబంధించిన వ్యవహారంలో ఆయనపై సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన తీర్పు ఆదేశాలను ధర్మాసనం (డివిజన్ బెంచ్) తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ కేసు విచారణ సందర్భంగా రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ బాధ్యతల నుంచి తప్పించి, ఆయన స్థానంలో మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ పిటిషన్ దాఖలు చేశారు.




ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం రంగనాథ్ తరఫున ప్రసిద్ధ న్యాయకోవిదుడు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ శక్దర్ సమర్పించిన బలమైన వాదనలను ఆలకించింది. వాదనలు పూర్తయిన అనంతరం సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును తాత్కాలికంగా నిలిపివేస్తూ ధర్మాసనం స్టే విధించింది.

**స్టాక్ మార్కెట్ అప్‌డేట్**

**76,944 వద్ద సెన్సెక్స్ క్లోజ్..**
**27 పైసలు బలపడిన రూపాయి!**
**స్వల్ప నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ!**

## ఇంతే కదా...!




# రేవంత్ వర్సెస్ హరీష్‌రావు

### కేసీఆర్‌పై రేవంత్ ఘాటు వ్యాఖ్యలు.. క్షమాపణలకు హరీష్‌రావు డిమాండ్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వుదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలన పూర్తి కావస్తున్న వేళ తెలంగాణ రాజకీయాలు అత్యంత వేడిగా మారాయి. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావును ఉద్దేశించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు తీవ్ర కలకలానికి దారితీశాయి. రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, సీనియర్ నేత తానీరు హరీష్‌రావు ముఖ్యమంత్రి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**కేసీఆర్‌పై రేవంత్ తీవ్ర విమర్శలు – 6 రోజుల ధర్నాలకు పిలుపు**

సోమవారం హైదరాబాద్‌లో మూసారాంబాగ్‌అంబర్‌పేట వంతెనను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకున్న 1,000 రోజుల పాలనపై విమర్శలు గుప్పిస్తున్న బీఆర్ఎస్‌పై ఆయన విరుచుకుపడ్డారు. కేసీఆర్‌పై తీవ్ర పదజాలంతో విమర్శలు గుప్పించడమే కాకుండా, అసెంబ్లీకి రాకుండా 1,000 రోజులుగా ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఆరోపిస్తూ కేసీఆర్ రాజీనామా డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో తమ 1,000 రోజుల పాలనకు, గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనకు మధ్య బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు.

వ్యక్తిగత దూషణలతో కప్పిపుచ్చుకోలేరు: హరీష్‌రావు తిరుగుబాణం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై అదే రోజు బీఆర్ఎస్ సీనియర్ నేత హరీష్‌రావు ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ 1,000 రోజుల పాలన చూస్తేనే ఎవరు ఏమిటో ప్రజలకు అర్థమైందని వ్యాఖ్యానించారు. వ్యక్తిగత దూషణలకు దిగినంత మాత్రాన రేవంత్‌రెడ్డి స్థాయి పెరిగిపోదని, ప్రభుత్వ విఫల పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పట్టుబట్టింది.

**పాలనా పురోగతి వర్సెస్ నెరవేరని హామీలు**

మంగళవారంతో కాంగ్రెస్ ప్రభుత్వం 1,000 రోజుల మైలురాయిని చేరుకుంటున్న తరుణంలో.. ఈ కాలంలో 72,000 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, రైతు సంక్షేమం కోసం ₹ 1.70 లక్షల కోట్లు వెచ్చించడం, రైతు రుణాలుఅప్పులపై నీతి ఆయోగ్ సాధించిన ప్రగతిని తమ సాధనలుగా రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబానికే పరిమితమయ్యాయని విమర్శించారు. కాగా, 1,000 రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయిందని బీఆర్ఎస్ తమ నిరసన ప్రచారాన్ని వేగవంతం చేసింది.



## దాడులపై విచారణ, అండగా ఉంటామని హామీ!

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (వుదయం)**

తెలంగాణలో భాజపా నేతలు, కార్యాలయాలపై జరుగుతున్న వరుస దాడులపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావుకు ఆయన ఫోన్ చేసి తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీశారు. సోమవారం నాడు రాష్ట్ర పార్టీ కార్యాలయం గేట్లకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నల్ల రంగు పూయడం, ఆపై భాజపా ముఖ్య నాయకులను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసిన ఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల వైఫల్యాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకై భాజపా చేపడుతున్న పోరాటాలను తట్టుకోలేకే కాంగ్రెస్ ఈ దాడులకు తెగబడుతోందని నితిన్ నబీన్‌కు వివరించారు. నల్గొండ జిల్లా భాజపా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడి ఉదంతాన్ని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై వెనక్కి తగ్గకుండా పోరాటాన్ని కొనసాగించాలని, భాజపా జాతీయ నాయకత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని రామచందర్‌రావుకు నితిన్ నబీన్ హామీ ఇచ్చారు. నల్గొండ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డితో కూడా స్వయంగా మాట్లాడతానని తెలిపారు. కాంగ్రెస్ నియంతృత్వ పాలనపై 'ఎక్స్' వేదికగా ఆగ్రహం మరోవైపు ఈ పరిణామాలపై నితిన్ నబీన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.





# వెల్టూర్ ఉపసర్పంచ్ పవిత్ర మృతి

- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సదాశివపేట వుదయం:**

వెల్టూర్ గ్రామ ఉపసర్పంచ్ నాయికోటి పవిత్ర అనారోగ్యంతో గుండెపోటుకు గురై మృతి చెందిన విషయం తెలుసుకున్న సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ వెల్టూర్ గ్రామానికి వెళ్లి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవిత్ర కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పవిత్ర ఆకస్మిక మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్టూర్ గ్రామ సర్పంచ్ తొంట కిష్టయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, సీనియర్ నాయకులు గడీల సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచులు గడ్డమీద సత్యనారాయణ, పబ్బతి లక్ష్మారెడ్డి, యాదయ్య, మధు, పాపయ్య, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మైనారిటీ బాలికల గురుకులంలో ఖాళీ సీట్లు




- 5, 6, 7వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం.
- సెప్టెంబర్ 5 సాయంత్రం 4 గంటల వరకు అవకాశం.

**రాజన్న సిరిసిల్ల/తంగళ్లపల్లి సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి):**

తంగళ్లపల్లిలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి 5, 6, 7వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ ఉరూస ఫాతిమా తెలిపారు. ఇందుకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 5వ తరగతిలో ఎస్సీ కేటగిరీలో 3, బీసీ కేటగిరీలో 1, క్రిస్టియన్ మైనారిటీ కేటగిరీలో 2 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 6వ తరగతిలో బీసీ కేటగిరీలో 1, క్రిస్టియన్ మైనారిటీ కేటగిరీలో 3, 7వ తరగతిలో క్రిస్టియన్ మైనారిటీ కేటగిరీలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు ఖాళీ సీట్లకు అర్హత ఉన్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు సెప్టెంబర్ 5 సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సూచించారు,గడువు అనంతరం దరఖాస్తులు స్వీకరించే అవకాశం ఉండదని స్పష్టం చేశారు,అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు, ఎంపిక ప్రక్రియ తదితర వివరాల కోసం తంగళ్లపల్లిలోని తెలంగాణ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను సంప్రదించాలని కోరారు. అర్హులైన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు జిల్లా స్థాయి ఎంపికలు

- ఈ నెల 3న గద్వాల్ ఇండోర్ స్టేడియంలో ఎంపికలు
- ప్రభుత్వ ఉద్యోగులు క్రీడా ప్రతిభను చాటుకునేందుకు అవకాశం

**గద్వాల్, సెప్టెంబర్ 01 (వుదయం కరస్పాండెంట్)**

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలకు తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొనే క్రీడాకారుల ఎంపికలో భాగంగా జిల్లా స్థాయి ఎంపికలను ఈ నెల 3వ తేదీన గద్వాల్ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి రామలింగేశ్వర గౌడ్ తెలిపారు. జిల్లాలోని ఆసక్తి, అర్హత కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 3న ఉదయం 10:30 గంటలకు ఎంప్లాయి ఐడీ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయంలో హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. క్రీడలపై ఆసక్తి, ప్రతిభ కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా స్థాయి ఎంపికల్లో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించాలని కోరారు. జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్ర స్థాయి ఎంపికల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు.

**క్రీడా స్ఫూర్తికి ప్రోత్సాహం**

ప్రభుత్వ ఉద్యోగుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం తో పాటు ఆరోగ్యకరమైన పోటీ వాతావరణాన్ని ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ప్రోత్సహించడమే ఈ ఎంపికల ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా యువజన క్రీడల అధికారి రామలింగేశ్వర గౌడ్ పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు నిర్ణీత సమయానికి హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

# నిశ్చితార్థంలో పాల్గొన్న వీరశైవ లింగాయత్ సమాజ సభ్యుల

**సంగారెడ్డి వుదయం**

సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జగ్గారెడ్డి తనయుడు భరత్ సాయి రెడ్డి నిశ్చితార్థ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి వీరశైవ లింగాయత్ సమాజం సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఇప్పపల్లి నర్సింలు ఆధ్వర్యంలో సమాజ సభ్యులు హాజరై భరత్ సాయి రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎమ్మార్వో యావాపురం శివప్రసాద్, ఐటీఐ ప్రిన్సిపల్ పేట వీర మల్లేశం, యువజన ఉపాధ్యక్షులు ప్రభుగారి నాగరాజ్, నాయికోటి రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చూడాలి

- అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- బాధితులకు సకాలంలో పరిహారం అందించాలి.
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.

**రాజన్నసిరిసిల్ల, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి):**





జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. వారికి ప్రభుత్వ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని, ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు రాంబాబు నాయక్ లకు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, ఎస్పీ మహేశ్ బి. గితే ఐడీఓసీలో స్వాగతం పలికారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, విద్య, ఉపాధి తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను కమిషన్ చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తును త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. అర్హులైన బాధితులకు నష్టపరిహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతినెల చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఎవరికైనా ఖాతాలు తెరిపించాలని సూచించారు. దీనివల్ల వారికి బ్యాంకు ఆధారిత బీమా సౌకర్యాలు అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

**కలెక్టర్ సేవలకు అభినందన..**

జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సేవలను బక్కి వెంకటయ్య అభినందించారు. అందరికీ సమాన న్యాయం చేస్తూ విద్యార్థులు, ప్రజలకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారుల పనితీరును కూడా ప్రశంసించారు. ప్రభుత్వ పథకాలను ఎస్సీ, ఎస్టీలకు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ గరిమ అగర్వాల్ తెలిపారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో కామన్ మెనూ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేక అధికారులను నియమించి విద్యాసంస్థలను తనిఖీ చేయిస్తున్నామని, విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చూస్తున్నామని వివరించారు. సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సాయం, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది నమోదైన 32 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను వివరించారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎస్డీఎఫ్ కింద ఎస్సీలకు 169 పనులకు రూ.4.29 కోట్లు, ఎస్టీలకు 38 పనులకు రూ.89 లక్షలు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని తొమ్మిది ఎస్సీ ప్రీమెట్రిక్ వసతి గృహాల్లో 337 మంది బాలురు, 80 మంది బాలికలు, మూడు పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 106 మంది బాలురు, 179 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సుల్లో 97 మంది అభ్యర్థులు ఉన్నారు. 3 నుంచి 7వ తరగతి వరకు డైట్ చార్జీలను రూ.1,330, 8 నుంచి 10వ తరగతి వరకు రూ.1,540, ఇంటర్ నుంచి పీజీ వరకు రూ.2,100కు పెంచినట్లు అధికారులు తెలిపారు. కాస్మొటిక్ చార్జీలను కూడా దాదాపు మూడు రెట్లు పెంచినట్లు వివరించారు. ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాల్లో 85 మంది బాలురు, 63 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో కలిపి 3,527 మంది ఎస్సీ, 245 మంది ఎస్టీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు వెల్లడించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో 89 ఈవీ ద్విచక్ర వాహనాలు, 70 శాతం సబ్సిడీతో 46 త్రిచక్ర వాహనాలు, 100 శాతం సబ్సిడీతో 10 సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు, 80 శాతం సబ్సిడీతో 49 యూనిట్ల చొప్పున రెండు గేదెలు అందించే ప్రక్రియ కొనసాగుతున్నట్లు ఈడీ స్వప్న తెలిపారు. ఎస్టీ ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 61 మందికి రూ.17.82 లక్షలు, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 871 మందికి రూ.2 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద జిల్లాలో 2,315 మంది ఎస్సీలకు, 436 మంది ఎస్టీలకు ఇళ్లు మంజూరైనట్లు వెల్లడించారు. టీప్రైడ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 233 యూనిట్లకు రూ.6.90 కోట్లు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ.2.66 కోట్లు మంజూరైనట్లు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కులాంతర వివాహాలు చేసుకున్న 44 జంటలకు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున మొత్తం రూ.1.10 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ఐదు పనులు చేపట్టి, రూ.2.25 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేశ్, డీఆర్వో జయశ్రీ, వేములవాడ ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, సీపీవో శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమశాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, వివిధ శాఖల అధికారులు, సంక్షేమశాఖ అధికారులు, సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్ల దరఖాస్తు గడువు సెప్టెంబర్ 15 వరకు పొడిగింపు

**కోహీర్ సెప్టెంబర్ 1 (వుదయం ప్రతినిధి)**

తెలంగాణలోని అర్హులైన పేదలకు ప్రతిష్ఠాత్మక చేయూత సోషల్ సెక్యూరిటీ పెన్షన్ల దరఖాస్తు గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని సెర్ప్ (సెర్ప్) సంస్థ ఈ మేరకు అధికారిక సర్క్యులర్‌ను విడుదల చేసింది. మొదటి విడతలో భాగంగా కొత్తగా పెన్షన్లు పొందేందుకు అర్హులైన వ్యక్తుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు 31 వరకు చివరి తేదీగా నిర్ణయించారు. అయితే క్షేత్రస్థాయి పరిశీలన, సివిల్ సొసైటీ సంస్థలతో జరిపిన సమావేశం వివరాల ఆధారంగా ఈ గడువును పెంచారు. అర్హులైన మరియు వెనుకబడిన వర్గాల ప్రజలందరికీ న్యాయం జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తు చేసుకునేందుకు తుది గడువును ఈ నెల 15 092026 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. దరఖాస్తు చేసుకోలేకపోయిన పేదలు, వృద్ధులు, వికలాంగులు, ఇతర అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సిఈఓ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే జిహెచ్ఎంసి, మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లకు ఈ మార్గదర్శకాలు అందజేశారు. డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు భాగస్వామ్య వర్గాలకు సమాచారం ఇవ్వనున్నారు. మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు కూడా దీనిపై దృష్టి పెట్టనున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీఓ) గ్రామాల్లో తగిన ఏర్పాట్లు చేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోగా దరఖాస్తులు సమర్పించి చేయూత పెన్షన్ పొందే అవకాశం ఉంది.





# అరబ్ గడ్డపై తెలుగు కీర్తి పతాకం

- రాజోలి నుంచి దుబాయ్ వరకు.. 25 ఏళ్ల విజయ ప్రస్థానం
- పట్టుదలతో ఉన్నత శిఖరాలకు.. రాజోలి బిడ్డకు ఘన సత్కారం

**రాజోలి సెప్టెంబర్ 01 (వుదయం కరస్పాండెంట్)**





జిల్లా, రాష్ట్ర సరిహద్దులను దాటి అరబ్ దేశాల్లో తెలుగు వారి కీర్తి ప్రతిష్ఠలను చాటుతున్న రాజోలి వాసి షేక్ చాంద్ పాషా (సిల్లా అబ్దుల్ ఖాదర్ కుమారుడు)కు గ్రామస్తులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు. విదేశాల్లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ తన వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావంతో ప్రత్యేక గుర్తింపు పొందడం రాజోలి గ్రామానికే కాకుండా తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని వారు పేర్కొన్నారు.

**రాజోలిలో విద్యాభ్యాసం.. దుబాయ్‌లో ఉద్యోగ ప్రస్థానం**

షేక్ చాంద్ పాషా తన ప్రాథమిక విద్యాభ్యాసాన్ని రాజోలి గ్రామంలోనే కొనసాగించి పదో తరగతి వరకు విద్యను అభ్యసించారు. అనంతరం అరబ్ దేశాల్లో పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా (PRO) తన వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. 1999 సెప్టెంబర్ 1న బిట్స్ పిలానీ దుబాయ్ క్యాంపస్‌లో ఉద్యోగంలో చేరిన ఆయన, నేటికీ అదే సంస్థలో అంకితభావంతో సేవలందిస్తున్నారు. ప్రజలకు, సంస్థకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ తన వృత్తి నైపుణ్యంతో అధికారుల మన్ననలు పొందారు.

**25 ఏళ్ల సేవకు ఘన సత్కారం**

ఉద్యోగ జీవితంలో ఎదురైన సవాళ్లను అధిగమిస్తూ నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించిన షేక్ చాంద్ పాషా సేవలను బిట్స్ పిలానీ దుబాయ్ క్యాంపస్ యాజమాన్యం గుర్తించింది. 25 సంవత్సరాల విశిష్ట సేవలను పురస్కరించుకుని నిర్వహించిన 'అకోలేడ్స్ - 25 సంవత్సరాల ఎక్సలెన్స్' కార్యక్రమంలో ఆయనను ఘనంగా సత్కరించింది. 25 ఏళ్ల పాటు ఒకే సంస్థలో విశిష్ట సేవలందించి గౌరవం పొందడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణమని కుటుంబ సభ్యులు తెలిపారు.

**కుటుంబ సహకారం మరువలేనిది**

తన విజయవంతమైన ప్రయాణంలో ప్రతి అడుగులోనూ అండగా నిలిచిన తన భార్యకు షేక్ చాంద్ పాషా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ప్రేమ, సహకారం, ప్రోత్సాహం తన విజయానికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. అలాగే తన విద్యాభ్యాసానికి, జీవితానికి బలమైన పునాది వేసిన రాజోలి గ్రామంలోని తన తల్లి, సోదరుడికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆశీర్వాదాలు, ప్రోత్సాహం తన జీవితంలో ఎప్పటికీ మరువలేనివని అన్నారు.

**పట్టుదలే విజయానికి బాట**

చిన్ననాటి నుంచే జీవితంలో ఏదైనా సాధించాలనే తపన, పట్టుదల, కష్టపడే స్వభావం షేక్ చాంద్ పాషాలో ఉండేవని బంధుమిత్రులు తెలిపారు. లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం శ్రమించే ఆయన స్వభావమే నేడు ఉన్నత స్థాయికి తీసుకెళ్లిందని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యం, క్రమశిక్షణ, అంకితభావంతో విదేశాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న షేక్ చాంద్ పాషా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి, తెలుగు వారి కీర్తిని నలుదిశZలా వ్యాపింపజేయాలని బంధుమిత్రులు, గ్రామస్తులు ఆకాంక్షించారు.

# సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ (ICC) లో ఘనంగా సీపీఎస్ విద్రోహ దినం

**సంగారెడ్డి, సెప్టెంబర్ 1:(వుదయం):**




సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న సంగారెడ్డి సమీకృత కలెక్టరేట్ కాంప్లెక్స్ (ICC) లో టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో సీపీఎస్ విద్రోహ దినం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. టీజీఈజేఏసీ చైర్మన్ మొహమ్మద్ జావేద్ అలీ, సెక్రటరీ జనరల్ డా. వైద్యనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతపై తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు తమ వేతనాల నుంచి సంవత్సరాల తరబడి చెల్లించిన మొత్తానికి భద్రత కల్పించడంతో పాటు, పదవీ విరమణ అనంతరం గౌరవప్రదమైన జీవితం గడిపే విధంగా పెన్షన్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు కోరారు. సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ లో ఉన్న డీఏలు, పీఆర్సీ అమలు కోసం ఉద్యోగ సంఘాలు చేస్తున్న పోరాటానికి అన్ని వర్గాల ఉద్యోగులు ఐక్యంగా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవోస్ సెక్రెటరీ వేల్పూరు రవి, అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, టీఎన్జీఎస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు నిర్మల రాజకుమారి, హెచ్.డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్, రాష్ట్ర పంచాయితీ కార్యదర్శుల అధ్యక్షులు బలరాం, టీజీవో సెక్రెటరీ సంతోష్, తాలూకా అధ్యక్షులు ప్రమోద్ కుమార్, యాదవ్ రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సాయిలు, సోమశేఖర్, 4వ తరగతి ఉద్యోగ సంఘం అధ్యక్షులు మహమ్మద్ షరీఫ్, వివిధ సంఘాల నాయకులు మరియు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 01(వుదయం):**

మండల పరిధిలోని గాజులపల్లి గ్రామంలో మంగళవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధులు, ఇళ్ల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇళ్ల చుట్టూ మురుగు నీరు, వర్షపు నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతాయని అధికారులు సూచించారు. ముఖ్యంగా నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది జ్వరాలు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుందని తెలిపారు. మురుగు నీటి వల్ల దుర్వాసన రావడంతో పాటు ఈగలు, దోమలు, ఇతర కీటకాలు పెరిగి ఆహారం, తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు.

ప్రతి కుటుంబం వారానికి ఒకరోజు ఇంటి పరిసరాలను పూర్తిగా పరిశుభ్రం చేసుకోవాలని సూచించారు. కొబ్బరి బొండాలు, పాత టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, పగిలిన పాత్రలు, ఖాళీ సీసాలు తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఇంట్లోని నీటి తొట్టెలు, డ్రమ్ములు, సంపులు, ఇతర నీటి నిల్వలను మూతలతో భద్రంగా ఉంచాలని తెలిపారు. మురుగు కాలువల్లో చెత్త వేయకుండా, నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ఒక్క ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ ఇల్లు, వీధి, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. దోమల నివారణకు తీసుకునే చిన్నచిన్న జాగ్రత్తలే కుటుంబ ఆరోగ్యాన్ని కాపాడుతాయని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పంజ స్వామి, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, అంగన్వాడీ టీచర్ సరోజన తదితరులు పాల్గొన్నారు.



# డ్రై రన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**కొల్లాపూర్, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి):**

అంజనగిరి రిజర్వాయర్‌లో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రత్యామ్నాయ పంప్‌హౌస్ పనులను వేగవంతం చేసి డ్రై రన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గం నార్లాపూర్ గ్రామ శివారులోని అంజనగిరి రిజర్వాయర్‌లో నిర్మిస్తున్న పంప్‌హౌస్ పనులను కలెక్టర్ రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంప్‌హౌస్ నిర్మాణం, పంపుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, మోటార్లు, నీటిని ఎత్తిపోసే వ్యవస్థ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంజనగిరి రిజర్వాయర్ నుంచి నీటిని ఎత్తిపోసేందుకు మొత్తం ఆరు పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో నాలుగు పంపుల పనులు తుది దశకు చేరుకున్నాయని, ఈ నెల 7వ తేదీన డ్రై రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. డ్రై రన్ విజయవంతం అయిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేయగానే వెట్ రన్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఒక్కో పంపు 1.7 మెగావాట్ల సామర్థ్యంతో 9,000 క్యూబిక్ మీటర్ల నీటిని ఎత్తిపోసే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంప్‌హౌస్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, డ్రై రన్ కు ముందే అన్ని సాంకేతిక, విద్యుత్ పనులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని 3,912 గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి, సీఈ లలిత, ఎస్ఈ జగన్ మోహన్ రెడ్డి, ఈఈ సుధాకర్ సింగ్, నీటిపారుదల శాఖ ఈఈ అమర్ సింగ్, ఏఈలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

# స్కాలర్ షిప్ లు ఫీజురియంబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలి

- ఎమ్మెల్యే కార్యాలయం ముందు ఏబీవీపీ నాయకుల బైఠాయింపు

**నారాయణపేట సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల విద్యాభవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కార్యాలయము ముందు మంగళవారం బైఠాయించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ నారాయణపేట నియోజకవర్గంలోని వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి తమ విద్యను కొనసాగిస్తున్నారని తెలిపారు. అయితే నిధులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండటంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫీజు బకాయిల కారణంగా కళాశాలల నుంచి విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందని, పరీక్షలకు హాజరు కావడం, హాల్‌టికెట్లు పొందడం, సర్టిఫికెట్లు తీసుకోవడం, తదుపరి విద్యను కొనసాగించడం వంటి అంశాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అర్హులైన విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఫీజు బకాయిల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయకుండా కళాశాలలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి పరిషత్ నాయకులు జిల్లా కన్వీనర్ నరేష్, నగర కార్యదర్శి సతీష్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ శివ, ఇంతియాజ్, వినయ్, గణేష్, కళాశాల కార్యకర్తలు తరుణ్, అభీ , అక్షర, సందీప్, భరత్ తో పాటు కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.





# గ్రేటర్ హైదరాబాద్



## సౌండ్ రెగ్యులేషన్ కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేయాలి

- **వినాయక చవితి ఉత్సవాల్లో ప్యాడ్ బ్యాండ్ వాహనాలకు అనుమతులు ఇవ్వాలి: మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు**

**ముషీరాబాద్,సెప్టెంబర్ 01(వుదయం)**
వినాయక చవితి ఉత్సవాల్లో ప్యాడ్ బ్యాండ్ వాహనాలకు అనుమతులు కల్పించడంతో పాటు, బ్యాండ్ కళాకారుల ఉపాధికి భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. సౌండ్ వినియోగంపై స్పష్టమైన నిబంధనలు రూపొందించేందుకు సౌండ్ రెగ్యులేషన్ కంట్రోల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.
వినాయక చవితి ఉత్సవాల్లో ప్యాడ్ బ్యాండ్ వాహనాలకు అనుమతి కల్పించాలని కోరుతూ తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ సుందరయ్య భవన్‌లోని సోయబ్ హాల్‌లో రౌండ్ టేబుల్
సమావేశం నిర్వహించారు. సమావేశానికి అశ్వాల హనుమంత్ అధ్యక్షత వహించగా, సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.



ఈ సందర్భంగా చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. బ్యాండ్ కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి మరోసారి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఇప్పటికే డీజీపీతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లామని, అందువల్ల బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకారం లభించిందన్నారు.
సౌండ్ విషయంలో బ్యాండ్ కళాకారులు కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా పరిమిత స్థాయిలోనే శబ్దాన్ని వినియోగించాలని, అదే సమయంలో పండుగల సందర్భంగా వారి సంప్రదాయ వృత్తిని కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని కోరారు. ఏడాదిలో ప్రత్యేక పండుగల సందర్భంగా సుమారు 30 రోజుల పాటు నిర్దిష్ట నిబంధనలతో అనుమతులు ఇచ్చేలా చట్టపరమైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.
సౌండ్ రెగ్యులేషన్ కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేస్తే శబ్ద తీవ్రత, సమయ పరిమితులు, అనుమతులు తదితర అంశాలపై స్పష్టమైన నిబంధనలు రూపొందించవచ్చని, తద్వారా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, కళాకారుల ఉపాధికి నష్టం వాటిల్లకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సీతారాములు అన్నారు.
భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల్లో బ్యాండ్ కళాకారులపై నిర్బంధం విధించడం సరికాదన్నారు. పండుగల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నప్పుడు, అదే పండుగను నమ్ముకుని జీవించే బ్యాండ్ కళాకారులకు ఉపాధి ఎందుకు దక్కకూడదని ప్రశ్నించారు.
గణేష్ ఉత్సవాల సందర్భంగా మండపాల నిర్మాణం నుంచి శోభాయాత్ర వరకు అనేక సామాజిక వర్గాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. వేలాది కుటుంబాలు ఈ పండుగలపై ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. సౌండ్ పొల్యూషన్ పేరుతో పేద బ్యాండ్ కళాకారుల ఉపాధిని దెబ్బతీయడం అన్యాయమని అన్నారు.
డీజే సౌండ్‌ను ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తాము వ్యతిరేకిస్తున్నామని, అయితే సంప్రదాయ ప్యాడ్ బ్యాండ్ కళాకారులను వేధించడం, వారి వాహనాలను సీజ్ చేయడం, కేసులు నమోదు చేయడం మాత్రం సహించబోమని శశిధర్ స్పష్టం చేశారు. బ్యాండ్ కళాకారుల హక్కుల కోసం జరిగే ప్రత్యక్ష ఆందోళనల్లో భాగ్యనగర్ ఉత్సవ సమితి అండగా నిలుస్తుందని తెలిపారు.
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో సంగీతం, వాయిద్యాలకు ప్రత్యేక స్థానం ఉందని, వినాయక చవితి వంటి పండుగల ముగింపు వేడుకల్లో ప్యాడ్ బ్యాండ్ వంటి సంప్రదాయ వాయిద్యాలను వినియోగించుకునే అవకాశం కల్పించాలని కోరారు.
సౌండ్ నియంత్రణకు స్పష్టమైన ప్రమాణాలు నిర్ణయించి, ప్యాడ్ బ్యాండ్ కళాకారుల ఉపాధిని రక్షించే విధంగా సౌండ్ రెగ్యులేషన్ కంట్రోల్ కమిషన్ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం వెంటనే దీనిపై నిర్ణయం ప్రకటించాలని సమావేశం డిమాండ్ చేసింది.
ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచర్ల శేఖర్, హైదరాబాద్ సంఘం గౌరవ అధ్యక్షులు సురేందర్ శెట్టి, నాయకులు దేవేందర్, ప్రవీణ్, హుస్సేన్, మురళి తదితరులు పాల్గొన్నారు.




## పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించవల్సిందే

- **జేఏసీ చైర్మన్ యశ్వంత్, కన్వీనర్ డా . రామారావు**

**రంగారెడ్డి జిల్లా సెప్టెంబర్ 01(వుదయం)**
తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (TGEJAC), రంగారెడ్డి జిల్లా తరపున, 01/09/2026 మధ్యాహ్నం భోజన విరామ సమయంలో IDOC, కొంగరకలాన్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించడము జరిగింది.
ఈ నిరసన కార్యక్రమంలో ఉద్యోగులు ,ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలతో IDOC కొంగరకలాన్ లో CPS ను రద్దు చేసి OPS ను పునరుద్దరించాలని ఉద్యోగ నాయకులు మాట్లాడారు. ఈ సందర్భంగా TGEJAC రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ CPS అనేది ఉద్యోగస్తుల పట్ల శాపంగా మారిందని CPS ను వెంటనే రద్దుచేయాలని. రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ నిరసన కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా TGEJAC కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ CPS అనేది చాలా ప్రమాధకరమైనదని ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో CPS రద్దు చేస్తామని చెప్పి ఇప్పుడు దాటవేసే ధోరణి కరెక్ట్ కాదని వెంటనే OPS ను పునరుద్ధరణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు మరియు పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ సంపూర్ణ మద్దతును తెలియజేసారు. OPS పునరుద్ధరణ కోసం మనమంతా ఐక్యంగా నిలబడి, మన గొంతును బలంగా వినిపిద్దాం అందరు కోరారు..
ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వినర్ శ్రీనేష్ కుమార్ నోరి, కో చైర్మన్లు గోపాల్, ప్రవీణ్, శాంతి శ్రీ, సుధాకర్, రాజేష్, బల్వంత్ రెడ్డి,వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, సెక్రెటరీలు , మాధవ్ , ఆనంద్, మహేష్, ప్రమీల,వెంకటప్ప,పాండు రంగారెడ్డి, కల్పన, జగన్నాథ్ శర్మ,అరుణ,గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ కు నో చెప్పండి మంచి జీవితానికి ఎస్ చెప్పండి

- **ఎవరైనా మత్తు పదార్థాలు వాడితే 1908 కి కాల్ కానీ 8712671111 నెంబర్ వాట్సాప్ చేయండి.**
- **ప్రతి వ్యక్తి వ్యక్తిగత జీవితంతో పాటు సమాజానికి కూడా ఏదో ఒక విధంగా సహాయపడాలి.**
- **అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి.**

**షాద్‌నగర్, సెప్టెంబర్ 01 (వుదయం):**
డిగ్రీ వయసులోనే జాగ్రత్తగా ఉంటే జీవితంలో స్థిర పడవచ్చు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ భవాని శంకర్
ఈరోజు షాద్‌నగర్, పట్టణంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో పాలమూరు విశ్వవిద్యాలయ కార్యక్రమంలో భాగంగా డ్రగ్ అవేర్నెస్ ప్రోగ్రాం జరిగింది.
ఈరోజుషాద్‌నగర్, లోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్ రెడ్డి. ఈ అవేర్నెస్ కార్యక్రమంలో డ్రగ్స్ ఆధునిక కాలంలో ఎలా రూపుదిద్దుకున్నాయి అని, డ్రగ్స్ కు ఎలా దూరంగా ఉండాలి అనే విషయాలు విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలు ఎవరైనా తీసుకోమ న్న ప్పుడు నో చెప్పడం నేర్చుకోవాలి మొహమాటం వల్ల , ఒకసారి తీసుకుంటే ఏం కాదులే అని ఎంతోమంది విద్యార్థులు, యువత డ్రగ్స్ కు బానిసలు అయిపోతున్నారని దానివల్ల ఆర్థిక నష్టం, సామాజిక నష్టం, కుటుంబ నష్టం, విద్యా జీవితం



నష్టం, వ్యక్తిగత జీవితం నష్టం జరుగుతాయని ఉదాహరణలతో వివరించాడు.మత్తు పదార్థాలు ఇటీవల కాలంలో చాక్లెట్ రూపంలో లభించడం చిన్నపిల్లలకు మరియు మహిళలకు అలవాటు కావడం ఎంతో ఆందోళన కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు . తెలంగాణను తద్వారా భారతదేశాన్ని డ్రగ్ ఫ్రీ గా చేయడం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను తీసుకోవాలని డ్రగ్స్ ఎవరు వాడినా వెంబడే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయాలని కోరారు.కొన్ని రకాల మత్తు పదార్థాలు గంట నుంచి వంద గంటల వరకు మత్తులో ఉంచుతాయి అని తెలియని వారు ఎవ్వరు ఏమిచ్చినా తీసుకోవద్దని కళాశాల విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ నిర్మూలనలో తెలంగాణ ప్రభుత్వం, ఈగల్(EAGLE



)టీం అత్యంత పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని కొనియాడారు. డ్రగ్స్ వల్ల ప్రపంచంలో ఎంతోమంది సెలబ్రిటీలు వారి జీవితాన్ని అర్ధాంతరంగా కోల్పోయారని చిత్ర పటం ప్రదర్శన ద్వారా వివరించారు.డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం తన వంతు పూర్తి సహాయం రాష్ట్ర ప్రభుత్వానికి అందిస్తాను అని చెప్పారు..
కళాశాల ప్రిన్సిపల్ శ్రీ భవాని శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ స్థాయిలోనే జాగ్రత్తగా ఉంటే అనుకున్న విధంగా జీవితంలో స్థిరపడవచ్చు , అందుకే విద్యాబోధనతో పాటు ఇలాంటి అవగాహన కార్యక్రమాలకు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ముందుంటుందని అని చెప్పారు.
ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీ కరుణాకర్, ఇతర అధ్యాపకులు దాదాపు 300 మంది కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ-ప్రైమరీ కేంద్రాల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (LB) డాక్టర్ కే. కిరణ్మయి**

**రంగారెడ్డి జిల్లా , సెప్టెంబర్ 01 (వుదయం):**
చౌదరిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, ప్రీప్రైమరీ కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ (LB) డాక్టర్ కే. కిరణ్మయి మంగళవారం సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన, విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిలు, మౌలిక వసతులు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని నిరంతరం పర్యవేక్షించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధనా పద్ధతులను అవలంబించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం ప్రీప్రైమరీ కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్ చిన్నారులకు అందిస్తున్న బోధన, ఆటలు, అభ్యసన కార్యకలాపాలు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారుల వయస్సుకు అనుగుణంగా ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో అభ్యసనకు అనుకూలమైన కార్యకలాపాలను నిర్వహిస్తూ నాణ్యమైన ప్రీప్రైమరీ విద్యను అందించాలని సూచించారు.ఇంద్రా నగర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా అదనపు కలెక్టర్ (LB) డాక్టర్ కే. కిరణ్మయి పాల్గొన్నారు. గ్రామ సభలో చర్చించిన గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలను ఆమె సమీక్షించారు.

**IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT:: HYDERABAD**
**O.S. NO. 102 OF 2026**
**Between :**
STATE BANK OF INDIA
Plaintiff
**AND**
Kondakalla Sravan Kumar
..Defendant
To,
Kondakalla Sravan Kumar, S/o Kondakalla Jangaiah Aged about 45 years, Occ: Employee in Telangana Home Department, R/o. H.No.18-1-297/133/A, Shivaji Nagar, Uppuguda, Hyderabad - 500053.
Whereas the above named Plaintiff bank has filed the above suit for Recovery of Money against you being the sole Defendant in the above suit. As per the orders of the Hon'ble Court, issuing this notice by informing the date of hearing and the matter is posted on 18.09.2026 for your appearance before the above said Hon'ble Court. Therefore, you are hereby informing to make it convenient yourself to attend the above said Hon'ble Court on 18.09.2026 at 10-30 a.m. by person or through advocate, failing which the matter will be decided exparte.
**(BY ORDER OF THE HON'BLE COURT)**
**Sd/-**
**M/s. GURRAM VENKAT RAMANA, PRASAD JOSHI ADVOCATES, Plot No. 245, Nagarjuna Colony, Hasthinapuram, Hyderabad -70**
**Mobile No. 9912563725**
**Counsel for the Plaintiff**

**IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT:: HYDERABAD**
**O.S. NO. 100 OF 2026**
**Between :**
STATE BANK OF INDIA ...Plaintiff
**AND**
Ramdass Lawrance ...Defendant
To,
Ramdass Lawrance, S/o Late Ramdass Aged about 45 years, Occ: Employee in Railway, R/o. H.No.43-225, Hanuman Nagar, Moula-Ali, Hyderabad – 500040
Whereas the above named Plaintiff bank has filed the above suit for Recovery of Money against you being the sole Defendant in the above suit. As per the orders of the Hon'ble Court, issuing this notice by informing the date of hearing and the matter is posted on 18.09.2026 for your appearance before the above said Hon'ble Court. Therefore, you are hereby informing to make it convenient yourself to attend the above said Hon'ble Court on 18.09.2026 at 10-30 a.m. by person or through advocate, failing which the matter will be decided exparte.
**(BY ORDER OF THE HON'BLE COURT)**
**Sd/-**
**M/s. GURRAM VENKAT RAMANA, PRASAD JOSHI ADVOCATES, Plot No. 245, Nagarjuna Colony, Hasthinapuram, Hyderabad -70**
**Mobile No. 9912563725**
**Counsel for the Plaintiff**

## పేదల వైద్యానికి సీఎం సహాయనిధి అండ

- **28 మంది లబ్ధిదారులకు రూ.11.48 లక్షల చెక్కుల పంపిణీ**
- **అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి: ఎమ్మెల్యే కాలే యాదయ్య**

**చేవెళ్ల,సెప్టెంబర్01 (వుదయం)**
చేవెళ్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరైన చెక్కులను స్థానిక శాసనసభ్యులు కాలే యాదయ్య లబ్ధిదారులకు పంపిణీ చేశారు.చేవెళ్ల మండల పరిధితో పాటు చేవెళ్ల మున్సిపాలిటీకి చెందిన 28 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.11 లక్షల 48 వేల విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మా



ట్లాడుతూ..అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు.వైద్య ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు CMRF ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం కొంతైనా భరోసా కల్పిస్తుందని తెలిపారు.
పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాధ్యమైనంత త్వరగా ఆర్థిక సహాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.చేవెళ్ల నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు.ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న 28 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కాలే యాదయ్య హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని వైద్య చికిత్సకు సద్వినియోగం చేసుకుని త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు
.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధి,ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఒంటరి మహిళ ఇంట్లో చోరీ



**శంకర్ పల్లి: సెప్టెంబర్ 01 (వుదయం)**
తాళం వేసిన ఒంటరి మహిళ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆగస్టు 30న రాత్రి జరిగింది. శంకర్ పల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప రెడ్డిగూడెం కాలనీలో పక్కింటి సరస్వతి నివసిస్తున్నారు. కాగా ఆమె ఆగస్టు 30న రాఖీ పండుగ సందర్భంగా మోమిన్ పెట్ లోని దుర్గం చెరువు గ్రామంలో ఉన్న కూతురు వద్దకు అల్లుడుతో కలిసి వెళ్లిందని తెలిపారు. అదే రోజు రాత్రి ఆమె ఇంట్లో దొంగలు పడి మూడు తులాల బంగారం, సుమారు 30 తులాల వెండి కొంత నగదు పోయినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. పక్కింటి వారు సెప్టెంబర్ 1న ఫోన్ చేసి ఆమెకు దొంగతనం జరిగిన సంగతి తెలిపారు అన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE CCC AT: SECUNDERABAD**
**OS.NO. 492 OF 2026**
**Between :**
Smt. Racherla Meghamla
...Plaintiff
**AND**
The Thasildhar Secunderabad Mandal and All Concerned
...Defendants
To All Concerned, Whereas the Plaintiff herein has filed the above Suit for Declaration of legal heir of Late Racherla Sadanand who died on 29.05.2004 and Late Racherla Karthik who died on 25.10.2025, Anyone having any objection has to appear either in person or through pleader with defence if any on 17/09/2026 at 10:30 am before the Hon'ble court, failing which the Suit will be heard and determined ex-parte and Orders will be passed accordingly.
Dated: 1/09/2026
**(BY ORDER OF THE HON'BLE COURT)**
**Sd/-**
**SV LAW FIRM**
**J. SATYA PRASAD**
M.COM., LL.M., PGDCL., PDDIPR
**ADVOCATE**

**IN THE COURT OF THE HONOURABLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT AT: - LB NAGAR**
**O.S. No. 599 of 2026**
**Between :**
1. Shaik mahaboob S/o. Late Bade Sab Aged 40 years, Occ.Labour, R/o.H.No.10-42/3/A/1, Sunrise Nagar, Balapur village & Mandal, Ranga Reddy District 2. Mohammad Rehena W/o.Mohammad Mahaboob D/o.Late Bade Sab, Aged 46 years, Occ.House-wife, R/o.H.No.363, Indiramma Colony, Patha Rajampet, Kamareddy, Kamareddy District
...Plaintiffs
**AND**
1. The Thasildar-cum-Jt Sub-registrar, Mandal Revenue Office, Balapur Mandal, Ranga Reddy District. 2. All concerned.
...Defendants
**NOTICE**
Whereas the above Original Suit has been filed by the plaintiffs hence it is prayed that this Hon'ble Court may be pleased to pass a judgement and decree in favour of plaintiffs off:- (a) Declaration, to declare the plaintiffs as legal heirs of late Bade sab. (b) Pass such other and further relief as this Hon'ble court deems fit and proper in circumstance of case and in the interest of justice All concerned or persons, defendant No.2, having any objection or claim in respect of the said Suit shall file their objections before this Hon'ble Court on or before 07.09.2026, failing which the petition will be heard and decided ex-parte and the matter will be decide on merits.
**// BY ORDER OF THE COURT//**
**Sd/-**
**MOHAMMED AMER (ADVOCATE)**
**R/ o # 8-28 Shaheen Nagar, Hyderabad TG. Cell No:- 7989555068,9347644583**

**IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE:: CITY CIVIL COURT :: AT HYDERABAD**
**O.S.No. 3031 of 2024**
**Between :**
State Bank of India ...Plaintiff
**AND**
Syamala Enterprises & another
...Defendants
To
1.Syamala Enterprises, Its Proprietor N.Syamala Durga, Aged about 28 years, Occ: Business, H.No.7-8-203/2, Gopal Nivas, Gowtham Nagar, Ferozguda, Hyderabad-500011, Ph: 7416625965
2. N.Syamala Durga, W/o N.Venkateswarulu, Aged about 28 years, Occ: Business, H.No.7-8-203/2, Gopal Nivas, Gowtham Nagar, Ferozguda, Hyderabad-500011, Ph: 7416625965
...Defendants
**NOTICE**
That the above named plaintiff herein filed the above suit against you for recovery of money and the case is posted to 29-10-2026. Therefore you are hereby called upon to appear before the Hon'ble court above mentioned on 29-10-2026 at 10.30 AM either in person or through counsel, otherwise the above matter will be heard and decided as per law.
**( By order of the Hon'ble Court )**
**Sd/-**
**M.A.Krishna Rao**
**Advocate**
**Shop No.18, Sri Dattasai Complex, RTC X Roads, Hyderabad.**

**IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE:: CITY CIVIL COURT :: AT HYDERABAD**
**O.S.No. 3034 of 2024**
**Between :**
State Bank of India ....Plaintiff
**AND**
SOG Industries Pvt.Ltd & others
... Defendants
To
1. SOG Industries Pvt.Ltd., Its Directors Duggi Ratnaraju & Duggi Bhulakshmi, 6/8, Gandhi Nagar, Industrial Area, IDPL, Balanagar, Hyderabad-500037, Ph: 9533814186
2. Duggi Ratnaraju, S/o.D.John, aged about 32 years, 48-318, Ganesh Nagar, Quthbullapur, Chintal, Hyderabad-500054, Ph: 9533814186 3. Duggi Bhulakshmi, W/o.D.John, aged about 40 years, 48-318, Ganesh Nagar, Quthbullapur, Chintal, Hyderabad-500054, Ph: 9533814186
. . . Defendants
**NOTICE**
That the above named plaintiff herein filed the above suit against you for recovery of money and the case is posted to 29-10-2026. Therefore you are hereby called upon to appear before the Hon'ble court above mentioned on 29-10-2026 at 10.30 AM either in person or through counsel, otherwise the above matter will be heard and decided as per law.
**( By order of the Hon'ble Court)**
**Sd/-**
**M.A.Krishna Rao**
**Advocate**
**Shop No.18, Sri Dattasai Complex, RTC X Roads, Hyderabad.**

**IN THE COURT OF THE IX JUNIOR CIVIL JUDGE:: CITY CIVIL COURT :: AT HYDERABAD**
**O.S.No. 3033 of 2024**
**Between :**
State Bank of India ...Plaintiff
**AND**
Lakshmi Engg.Techno Services & another
...Defendants
To
1.Lakshmi Engg.Techno Services, Its Proprietor A.Lakshmi, Aged about 43 Years,Occ : Business, H.No.7-4-118, Madhavi Nagar, Ferozguda, Secunderabad-500011 Ph: 9440512113
2. A.Lakshmi, aged about 43 Years, Occ : Business, H.No.7-4-118, Madhavi Nagar, Ferozguda, Secunderabad-500011,
Ph: 9440512113 ...Defendants
**NOTICE**
That the above named plaintiff herein filed the above suit against you for recovery of money and the case is posted to 29-10-2026. Therefore you are hereby called upon to appear before the Hon'ble court above mentioned on 29-10-2026 at 10.30 AM either in person or through counsel, otherwise the above matter will be heard and decided as per law.
**( By order of the Hon'ble Court )**
**Sd/-**
**M.A.Krishna Rao**
**Advocate**
**Shop No.18, Sri Dattasai Complex, RTC X Roads, Hyderabad.**




భిన్నత్వంలో ఏకత్వమే మా ప్రత్యేకత

వివేకానందుడు ప్రవచించినట్లు ప్రతి దేశానికి పూర్తిచేయాల్సిన మిషన్, చేరుకోవాల్సిన గమ్యం ఉంటాయి. భారత్ వరకు చూస్తే భిన్నత్వంలో ఏకత్వమే మా ప్రత్యేకత. ప్రపంచం నుంచి ఎంతోకొంత తీసుకుంటున్నట్లే సమాజానికి, ప్రపంచానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉంది. మనం ఎంత సంపాదిస్తున్నాం అనేదానికంటే ఎంత పంచుతున్నామనేది ముఖ్యం. ప్రవాస భారతీయులంతా తమ కర్మభూమికీ విధేయులై ఉండాలి. అమెరికాలో జీవిస్తూ, ఇక్కడ సంపాదిస్తున్నవారంతా ఈ దేశం విషయంలో నిజాయతీగా ఉండాలి. జన్మభూమితో పాటు కర్మభూమిలోనూ విద్యుక్త ధర్మం నెరవేర్చాలి.

- మోహన్ భగవత్, ఆరెస్సెస్ చీఫ్

## వే'మన' పద్యం

నిక్క మైన మంచినీల మొక్కటి చాల
తళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల?
చాటుపద్యములను చాలదా ఒక్కటి
విశ్వదాభిరామ! వినుర వేమ



# సంపాదకీయం

## ఆ సెక్షన్ పేదల పాలిట గుదిబండ

తెలంగాణ తాజా రాజకీయాలు 1908 నాటి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22పై నడుస్తున్నాయి. ఆ సెక్షన్ ప్రజల పాలిట గుదిబండగా మారి రాష్ట్రాన్ని కుదిపేస్తున్నది. ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. తమవైన కోట్ల రూపాయల ఆస్తులను ఒక సెక్షన్ పేర ప్రభుత్వం తన ఆధీనంలో పెట్టుకునే పరిస్థితిని సృష్టించింది. 'మా ఆస్తులపై సర్కారు పెత్తనమేంటి?' అంటూ ప్రజలే ప్రశ్నించే స్థాయికి తీసుకొచ్చింది. ప్రభుత్వ, మతపరమైన, సీలింగ్, మిగులు భూములు లేదా చట్టపరమైన వివాదాలకు సంబంధించిన ఆస్తుల రిజిస్ట్రేషన్, అమ్మకం, లేదా బదిలీని నిషేధించిన ప్లాట్లు ఈ సెక్షన్ పరిధిలోకి వస్తాయి. అలాగే వక్ఫ్ ఆస్తులు, కోర్టు జప్తుచేసిన ఆస్తులు కూడా ఇందులోనే ఉంటాయి. ఇటీవల ప్రభుత్వం డేటా బేస్ అప్‌డేట్‌లు, రికార్డుల అనుసంధాన ప్రక్రియలో వేలాది ఎకరాలు ప్రయివేటు పట్టా భూమి, చట్టబద్ధమైన నివాస కాలనీలు అక్రమంగా నిషేధిత జాబితాలో నెట్టబడ్డాయి.

హైదరాబాద్‌లాంటి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో గృహ యజమానులు పరిపాలనా లోపాల కారణంగా ఆస్తి లావాదేవీల్లో తీవ్రజాప్యంతోపాటు అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. పొరపాట్లను సరిచూసి ప్రజలకు నష్టం జరగకుండా చూడటంలో సర్కారీ రిజిస్ట్రేషన్ల శాఖ వెనుకబడింది. ఈ నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన రోజురోజుకూ పెరుగుతుండటం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రత అధికంగా ఉంది.

ఈ తరహా సమస్యలున్న ఆస్తులు రాష్ట్రంలో తొంభై లక్షలకుపైగా ఉండగా, ఇందులో హైదరాబాద్, దాని చుట్టూ ఉన్న జిల్లాల్లో 54 శాతం కావడం దారుణం. గత ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ డేటాను ధరణి పోర్టల్ నుంచి భూభారతికి అనుసంధానం చేసింది. సాంకేతిక పొరపాట్ల కారణంగా వేలాది ఎకరాల ప్రయివేటు ప్లాట్లు, ఫ్లాట్లు 22 ఏ జాబితాలోకి వెళ్లాయి. కొన్ని పొరపాటని చెబుతున్నా, కావాలని చేసినవి కూడా ఉన్నాయి. 22ఏ పరిధిలోని జాబితాను ప్రకటించాలని హైకోర్టు ఆదేశాలిస్తూ సర్కారుకు మొట్టికాయలు సైతం వేసి నిల దీసింది. 2023లో ఇది చట్టబద్ధమేనని తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. 'ప్రభుత్వం తన ఆస్తులను రక్షించు కోవచ్చు.

కేవలం రిజిస్ట్రేషన్‌ను నిరాకరించిన మాత్రాన ఆస్తిహక్కును కోల్పోరు. మీరు కోర్టును ఆశ్రయించ వచ్చు. దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్నప్ప టికీ, కేవలం దుర్వినియోగం కారణంగా ఏకంగా చట్టాన్ని రద్దుచేయలేమని' హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పలు చర్యలకు పూనుకున్నది. గతంలో కేవలం సర్వే నెంబర్లు మాత్రమే ఉండేవి. తాజాగా సంస్కరణల్లో భాగంగా సర్వేనెంబర్లతో పాటు స్కాన్ కాపీ, సంతకం చేసిన ఆధారాలతో కూడిన 12 కాలాల ప్రొఫార్మా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నది. అలాగే కోర్టుకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే 22బీ కింద మోసపూరిత రిజిస్ట్రేషన్ పత్రాలను రద్దుచేసేలా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీకి అధికారాలు కట్టబెట్టేందుకు ఆలోచిస్తున్నది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తరహాలో కొత్త చట్టాన్ని తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నది. గత పదేండ్లుగా 22ఏను అడ్డంపెట్టుకుని ప్రభుత్వంలోని పెద్దలు అక్రమ రియాల్టీ వ్యాపారాలను చేస్తున్నారనే తీవ్ర విమర్శలు ఇప్పటికే ఉన్నాయి. ప్రయి వేటుతోపాటు ప్రభుత్వ భూములను ఈ సెక్షన్ నుంచి విముక్తి కల్పించడానికి కమీషన్ల బేరం నీకింత నాకింత తరహాలో క్విడ్‌ప్రోకో నడుస్తున్నది.

ఇందులో ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులతోపాటు అధికారులూ మిలాఖతై ఉన్నారనేది నగ్నసత్యం. ఈ భూమాఫియాను ప్రోత్సహిస్తున్నది గత, ప్రస్తుత పాలకులే కావడం మరీ ఆందోళన కలిగించే అంశం. రాష్ట్ర రాజధాని చుట్టుపక్కలే ఈ అక్రమాలు ఎక్కువ. ఈ విషయంలో పాలకులు మారుతున్నారే తప్ప విధానం ఒకేలా ఉంది. తిమ్మిని బమ్మి, బమ్మిని తిమ్మి చేయడం వారికి వెన్నతో పెట్టిన విద్య. ఒకవైపు ప్రభుత్వ భూములను కాపాడటానికే 22ఏ అంటూ, మరోవైపు అందుకు విరుద్ధమైన పనులు చేసి సొంత ఆస్తులు పెంచేసుకుం టున్నారు. మధ్య తరగతి ప్రజలేమో డేటా ఎంట్రీ సరిగ్గా చేయని కారణంగా సొంత ఆస్తులు, ప్లాట్లు, ఫ్లాట్లను పొందలేని దారుణ దుస్థితిలోకి నెట్టబడ్డారు. పొరపాట్లు జరిగాయని రెవెన్యూ శాఖ మంత్రి క్షమాపణ చెప్పినా, ప్రజలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం సఫలం కాలేదు. ఇప్పటికైనా సీఎం చెప్పినట్టుగా గందర గోళాన్ని సరిచేసేందుకు యుద్ధ ప్రాతిపదికన పటిష్టమైన చర్యలు చేపట్టాలి. లేదంటే 22 ఏ రాష్ట్రంలో 'భూ' ప్రకంపనలనే సృష్టిస్తుంది.

రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.
voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ప్రైవేట్ కంపెనీల లాభాలకే పంటల భీమా పథకం!

యెడుగూరి సందింటి రాజశేఖర రెడ్డి (జూలై 8, 1949 సెప్టెంబర్ 2, 2009) ఆంధ్ర ప్రదేశ్ 16వ ముఖ్యమంత్రిగా, కాంగ్రెస్ పార్టీ నాయకునిగా, ప్రత్యేక గుర్తింపు పొందిన జన హృదయ నేత. తల పండిన నేతలను తలదన్నిన వ్యూహ రచనా దురంధరుడు ఆయన. మునిగి పోతున్న కాంగ్రెస్ నావను ఒంటి చేత్తో దరికి చేర్చిన రథ సారథి ఆయన. రాజకీయాలకు సరి కొత్త అర్థం చెప్పిన చాణక్యుడు వై.యస్...రాజశేఖర్ రెడ్డి 1949 జూలై 8న జమ్మల మడుగు లోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ మిషన్ ఆసుపత్రిలో జన్మించా డు. ఆయన తల్లి దండ్రులు జయమ్మ, రాజారెడ్డి. ఆయన తండ్రి బళ్ళారిలో కాంట్రాక్టరుగా పనిచేస్తుండటం వల్ల ఆయన పాఠశాల చదువంతా బళ్ళారి లోని సెయింట్ జాన్స్ పాఠశాలలో సాగింది. ఆ తర్వాత విజయవాడ లయోలా కళాశాలలో చేరారు. 1972లో గుల్బర్గా విశ్వ విద్యాలయం నుంచి వైద్య విద్యలో పట్టా పుచ్చు కున్నారు. గుల్బర్గాలోని మహాదేవప్ప రాంపూరే వైద్య కళాశాలలో వైద్యవృత్తిని అభ్యసిస్తుండగానే కళాశాల విద్యార్థి సంఘానికి అధ్యక్షు డిగా వ్యవహరించారు. శ్రీ వెంకటేశ్వర వైద్యకళాశాల (యెస్.వి.ఆర్.ఆర్), తిరుపతి నుంచి హౌస్ సర్జన్ పట్టా పొందారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల వైపు ఆకర్షితుడైన రాజశేఖరరెడ్డి యెస్.వి.ఆర్.ఆర్ కళాశాలలో పని చేస్తుండగానే అక్కడ హౌస్‌సర్జన్ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తరువాత కొద్ది రోజుల పాటు జమ్మల మడుగులోని సి.ఎస్.ఐ. కాంప్‌బెల్ ఆసుపత్రిలో వైద్య అధికారిగా పని చేశారు. ఆ తరువాత 1973లో పులివెందులలో తండ్రి వై.ఎస్.రాజారెడ్డి పేరుతో కట్టించిన 70 పడకల ఆసుపత్రిలో వైద్యుడిగా పని చేశారు. ఆ ఆసుపత్రి ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. వాళ్ళ కుటుంబం పులివెందులలో ఒక పాలిటెక్నిక్ కళాశాల, డిగ్రీ కళాశాలను కూడా నెల కొల్పారు. తరువాత వాటిని లయోలా సంస్థలకు అప్పగిం చారు.



పులివెందుల దగ్గరిలో ఉన్న సింహాద్రి పురంలో ఉన్న కళాశాలను మాత్రం ఇప్పటికీ వీరి కుటుంబమే నిర్వహిస్తోంది. కళాశాల దశ నుంచే రాజకీ యాలపై ఆసక్తి చూపిన రాజశేఖరరెడ్డి 198083 కాలంలో రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించారు. తెలుగు దేశం నేత నారా చంద్రబాబు నాయుడు మొదటగా కాంగ్రెస్‌లో ఉన్నపుడు ఇరువురూ మంచి మిత్రులు. 1985 నుంచి 1998 వరకు పార్టీలో వై.ఎస్. నిత్య అసమ్మతి వాదిగా పేరు పడ్డారు. కాంగ్రెస్ ముఖ్య మంత్రులు అందరితో ఆయన పోరాటం చేయాల్సి వచ్చింది. 1989 94 మధ్య కాలంలో ముఖ్యమంత్రి కావాలని ప్రయత్నించినా సాధ్య పడలేదు. మర్రి చెన్నారెడ్డి, నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్ రెడ్డి వంటి నేతలతో ఆయన రాజకీయ యుద్ధమే చేశారు. వారికి వ్యతిరేకంగా క్యాంపులు నడిపారు. మర్రి చెన్నారెడ్డిని, నేదురుమిల్లి జనార్ధన్‌రెడ్డిని పదవినుండి తొలగించడానికి ప్రధాన కారణమైన హైదరా బాదు నగరంలో జరిగిన అల్లర్లలో రాజశేఖర్ రెడ్డి వర్గపు పాత్ర ఉందన్న ఆరోపణలు వచ్చాయి తొలిసారి 1983 నుంచి 1985 వరకు, రెండో పర్యాయం 1998 నుంచి 2000 వరకు ఆ పదవిలో ఉన్నారు. 1999 నుంచి 2004 వరకు 11వ శాసన సభలో ప్రతిపక్ష నేత గానూ వ్యవహరించారు. 2003 వేసవి కాలంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో పాద యాత్ర చేపట్టి 1,467 కిలోమీటర్లు పర్యటించారు. పాదయాత్ర వలన వ్యక్తిగతంగా వైఎస్.కు మంచి జనాదరణ లభించడమే కాకుండా ఆ తదుపరి ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి దోహద పడింది. 2004 మేలో జరిగిన 12వ శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు సాధించడంతో అది వరకే పార్టీలో పేరు సంపాదిం చిన వై.ఎస్. ఆర్. ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించారు. పాద యాత్ర వలన జనాదరణ పొందడమే కాకుండా ఎన్నికల ప్రచారంలో వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, పెండింగులో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేయటం, జలయజ్ఞంలకు ప్రాధాన్యం ఇవ్వడంతో ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన పిదప తొలి సంతకం ఉచిత విద్యుత్తు ఫైలు పైనే చేశారు. 2009 ఏప్రిల్లో జరిగిన 13వ శాసనసభ ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలలో విజయం సాధించడానికి కృషిచేసి వరుసగా రెండో పర్యాయం ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. 2009 ఏప్రిల్‌లో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ముందుండి నడిపించడమే కాకుండా శాసన సభలో 156 స్థానాలతో పూర్తి మెజారిటీని సంపాదించి పెట్టారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలలో 33 స్థానాలలో విజయం సాధించడానికి కృషి చేశారు. వై.యస్.రాజశేఖర రెడ్డి చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సి.ఎస్.ఐ) అనే చర్చికి చెందిన ప్రొటెస్టెంటు క్రైస్తవుడు. ఆయన తొలిసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2004లోనూ, మరలా 2009లోనూ కుటుంబ సమేతంగా బెత్లహేము యాత్రకు వెళ్ళి వచ్చారు. క్రైస్తవులైనా పారంపరికంగా వచ్చిన హిందూ సంప్రదా యాలని వీడలేదు. రాజశేఖరరె డ్డి తిరుమలను అనేకమార్లు సందర్శించి వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకొని పూజలు చేశారు. సెప్టెంబర్ 2, 2009 న చిత్తూరు జిల్లా పర్యటనకు అననుకూల వాతావరణంలో బయలు దేరగా ఉదయం గం.9.35 ని మిషాలకు హెలి కాప్టరుతో సంబంధాలు తెగి పోయాయి. ముఖ్యమంత్రి ఆచూకీ కోసం గాలించగా 25 గంటల తరువాత ప్రమాదానికి గురైన హెలికాప్టర్ ఆనవాళ్ళు లభించాయి. వై.ఎస్.తో సహా మొత్తం ఐదుగురు హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు. తమ అభిమాన నాయకుని మరణాన్ని జీర్ణించు కోలేక రాష్ట్ర మంతా దాదాపు 67 మంది మరణించారు. వీరిలో చాలా మంది గుండె ఆగి మరణించగా కొద్ది మంది ఆత్మహత్య చేసుకున్నారు. రాజ శేఖర్ రెడ్డి ఎన్నో పదవులు అనుభవించారు. 1975లో యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా; 1980లో తొలి సారిగా రాష్ట్ర మంత్రి వర్గంలో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా; 1982లో రాష్ట్ర మంత్రివర్గంలో ఎక్సైజ్ శాఖా మంత్రిగా; 1982లో రాష్ట్ర మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా; 1983లో పిసిసి అధ్యక్షుడిగా నియమించ బడ్డాడు (1985 వరకు).1998లో రెండోసారి పిసిసి అధ్యక్షుడిగా నియామకం (2000 వరకు); 1999లో శాసనసభ ప్రతిపక్ష నేతగా; 2004లో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు. 2009లో రెండో పర్యాయం ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యారు.ఇక 1978లో పులివెందుల నుంచి తొలిసారి శాసన సభ్యుడిగా; 1983లో పులివెందుల నుంచి రెండోసారి; 1985లో వరుసగా మూడవ సారి శాసనసభ్యుడిగా హ్యాట్రిక్ విజయం సాధించారు.1989లో కడప నియోజకవర్గం నుంచి తొలిసారి లోకసభ సభ్యుడిగా; 1991లో కడప నియోజకవర్గం నుంచి రెండో సారి; 1996లో వరుసగా మూడవసారి గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. అలాగే 1998లో కడప నుంచి వరుసగా నాలుగవసారి ఎంపీగా; 1999లో పులివెందుల నుంచి నాలుగవ సారి ఎమ్మెల్యేగా; 2004లో పులివెందుల నుంచి ఐదవసారి శాసనసభ్యుడిగా విజయం సాధించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

ఎర్రకోటపై జాతీయ జెండాను ఎగరవేసిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ చేసిన ఉపన్యాసంలో మేడిన్ ఇండియా (భారత తయారీ) వస్తువులు ప్రపంచంలో ప్రతి మూలకూ చేర్చటం లక్ష్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. "ఉన్న మాట అన్నావు ఎవ్వరు నేర్పిన మాటరా వేదంలా విలువైన మాట" అనే సినిమా పాటను గుర్తుచేశారు. పాడిందే పాడరా అన్నట్లుగా ఇలాంటి మాటలు ఎన్నిసార్లు చెబుతారు, దేశాన్ని ఎటువైపు తీసుకుపోతు న్నారన్నదే అసలైన సమస్య. ప్రధానిగా తొలి ఆగస్టు పదిహేను అంటే 2014 ప్రసంగంలో మేకిన్ ఇండియా (భారత్‌లో తయారీ) పిలుపునిచ్చారు. "రండి, భారత్‌లో తయారు చేయండి, ప్రపంచంలో వాటిని ఏ దేశంలోనైనా విక్రయిం చండి, కానీ వాటిని



## చైనా ముందు మనం నిలబడగలమా?

భారత్‌లోనే ఉత్పత్తి చేయాలి" అని విదేశీ పారిశ్రామిక, వాణిజ్యవేత్తలకు పిలుపునిచ్చారు. అదే ఏడాది సెప్టెంబరు 25న న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి ఏడాదీ ఏదో ఒక సందర్భంగా ఇలాంటి పిలుపులిస్తూనే ఉన్నారు. కనుచూపు మేరలో కూడా ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపిం చటం లేదు, అయినా పదే పదే చెబుతున్నారంటే దాన్నే మనాలి? భారత తయారీ సప్తధారల్లో జరగాలని మోడీ చెప్పారు.

చెప్పిన మాట చెప్పకుండా తన కార్యాలయం రాసిచ్చిన ఉపన్యాసాలను కొత్త కొత్త పదజాలంతో కాశీ మజిలీ కథల మాదిరి ఊకదంపుడుతో కొత్తవాటిని చెప్పటం తప్ప అడుగు ముందుకు పడటం లేదు. డ్రోన్ వ్యవస్థలను మనం అభివద్ధి చేయాలని, హైపర్‌సోనిక్ రక్షణ సాంకేతిక రంగంలో ప్రపంచ నాయకత్వాన్ని చేపట్టాలని కూడా చెప్పారు. పన్నెండేండ్లుగా ఎవరు వద్దన్నారు. ఇప్పటికే మనకంటే ఎంతో ముందున్న దేశాలు ఈ రంగాల్లో ఇంకా ముందుకు పోతాయి. అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్నట్లు దేశాన్ని తయారు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు.పోటీతత్వం లేకపోతే వర్తమానంలో ఏ దేశమూ పరుగులో నిలవ లేదు. అందుకు అవసరమైనట్లుగా పని చేశామా లేదా అన్నదే ముఖ్యం. స్విడ్జర్లాండ్‌లోని లాసానే నగరంలో 1990లో ఐఎండి బిజినెస్ స్కూలు ఉంది. దాన్నొక ప్రతిష్టాత్మక సంస్థగా పరిగణిస్తున్నారు. ప్రతి ఏటా దేశాలను ఎంచుకొని పోటీతత్వ సూచికలను ప్రకటిస్తుంటుంది. తాజా 2026 నివేదిక ప్రకారం మన దేశం 44వ ర్యాంకులో ఉంటే చైనా పన్నెండవది గా ఉంది. ప్రధాని చెబుతున్నట్లుగా 2047 నాటికి లేదా అంతకు ముందే మనదేశం చైనాను వెనక్కు నెట్టి ప్రపంచ ఫ్యాక్టరీగా మారుతుందా? మోడీ చెప్పినట్లు మన వస్తువులన్నీ ప్రపంచంలో అన్ని మూలలకు ఎగుమతి అవుతాయా? మాటలు కోటలు దాటటం తప్ప చేతలు గడపదాటటం లేదనే లోకోక్తి తెలిసిందే. ఇతర దేశాలతో పోటీ పడకపోవటానికి కాంగ్రెస్, నెహ్రూ, గాంధీ కారణమని కాషాయ దళాలు చెబుతుంటాయి.2014 నుంచి అధికారం లో ఉన్న మోడీ ఏం చేశారన్నదే ప్రశ్న. తొలిసారిగా ఎర్రకోటపై మోడీ జాతీయ జెండా ఎగురవేసినపుడు ఐఎండి నివేదిక ప్రకారం భారత్ 2013లో 40వదిగా, చైనా 21వ స్థానంలో ఉంది.

# కాలచక్రంలో జీవితం

వసంతం...
చిగురుల వేళ్లతో
చెట్లను పలకరించి,
పూల పరిమళాలతో
ప్రకృతి పెదవులపై
చిరునవ్వులు
పూయిస్తుంది.
అది...
చిన్న కలలతో
లోకాన్ని కొత్తగా చూసే
బాల్యంలాంటిది.

గ్రీష్మం...
సూర్యుడి నిప్పు
కణాలను
నేలపై చల్లినా,
ఆ తాపానికే తలవంచని
కొమ్మల ఒడిలో
తీయని ఫలాలను
పండిస్తుంది.
అది...
ఎండల్ని తట్టుకుంటూ
తనను తాను
మలుచుకునే
యవ్వనంలాంటిది.

శరదృతువు...
వర్షాల జ్ఞాపకాలను
తుడిచేసిన
నిర్మలాకాశంలా,
పండిన పంటల
పరిమళంతో
భూమి ఒడిని
నింపుతుంది.
అది...
అనుభవాల వెలుగులో
జీవితాన్ని అర్థం
చేసుకున్న
పరిపక్వత.
శిశిరం...
చెట్లను నిశ్శబ్దంలోకి
నెట్టి,
ఆకులను ఒక్కొక్కటిగా
కాలం చేతుల్లో
వదిలేస్తుంది.
అది...
జ్ఞాపకాల నీడలో
గతాన్ని నెమరువేసుకునే
వృద్ధాప్యం.

కానీ...
రాలిన ఆకు
చెట్టుకు ముగింపు
కాదు.
శిశిరం
వసంతానికి శాశ్వత
విరామం కాదు.
అలాగే...
జీవితంలో ఏ దశా
శాశ్వతం కాదు.
ప్రతి దశా
తనదైన సౌందర్యాన్ని
మోస్తుంది.
చివరికి...
కాలం తన చక్రాన్ని
తిప్పుతూనే
ఉంటుంది...
ఋతువులు తమ
రంగులను
మార్చుకుంటూనే
ఉంటాయి...
మనిషి మాత్రం
ఒక ఋతువులా వచ్చి,
మరో ఋతువులా
మారి,
చివరికి జ్ఞాపకమై
మిగులుతాడు..

రామిశెట్టి కావ్య
9390721569

# ప్రశ్నే అసలైన ఆయుధం

ప్రశ్నజ్ఞాన సముపార్జనకు మూలం. తరగతి గదిలో విద్యార్థి వేసే ప్రశ్న నుంచి ప్రజాస్వామ్య సౌధాన్ని నిలబెట్టే ప్రశ్న వరకు దాని ప్రాధాన్యం ఎంతో ఉంది. ప్రశ్నించడం ద్వారా తప్పులను గుర్తించగలం, కొత్త ఆలోచనలకు అవకాశం కలుగుతుంది. కానీ ప్రశ్నించేవాడిని శత్రువుగా చూసే ధోరణి పెరిగితే అది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. చట్టసభల్లో ప్రశ్నోత్తరాల సమయం అందుకే ఎంతో ముఖ్యమైనది.

ప్రజల తరఫున సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, సమస్యలపై సమాధానాలు రాబట్టడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా నిలబెట్టడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగం. ప్రశ్నించే అవకాశం లేకపోతే అధికారపక్షం తన సంఖ్యాబలంతో నిర్ణయాలను బుల్డోజ్ చేసే పరిస్థితి ఏర్పడుతుంది. అందుకే ప్రజాస్వామ్యానికి బలమైన ప్రతిపక్షం అవసరం. ప్రశ్న పాలకులను ఇబ్బంది పెడుతున్నప్పుడు వారు సభలకు, సమావేశాలకు, విలేకరుల సమావేశాలకు దూరంగా ఉండే పరిస్థితి ఏర్పడుతుంది. దేశ ప్రధానమంత్రి కొన్నేళ్లుగా విలేకరుల సమావేశాలకు దూరంగా ఉంటున్నారనే విమర్శ ఉంది. నార్వే పర్యటనలో విలేకరి ప్రశ్నలు అడగబోతున్న సమయంలో ప్రధాని అక్కడి నుంచి వెళ్లిపోయారనే విమర్శలు కూడా వచ్చాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో మొదటి రోజు హాజరై తరువాత సమావేశాలకు దూరంగా ఉండటం కూడా ప్రశ్నలకు భయపడుతున్నారనే విమర్శలకు కారణమైంది.

జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనల సందర్భంగా జరిగిన పోలీసు చర్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. విద్యార్థులపై పెల్లెట్ గన్స్, మేకులతో కూడిన లాఠీలతో దాడి చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఎవరి ఆదేశాలతో ఈ చర్యలు జరిగాయనే ప్రశ్న పార్లమెంటులో కూడా చర్చకు వచ్చింది. ప్రధాని, హోంమంత్రి సభకు హాజరు కాకపోవడంతో ఈ ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి కిరణ్ రిజిజు సభ్యులను సమాధానపరచడానికి ప్రయత్నించడం కూడా గమనార్హంగా మారింది. ముఖ్యమైన బిల్లులు సభలో ఆమోదం పొందాల్సి ఉన్న సమయంలో కీలక మంత్రులు సభకు దూరంగా ఉండటం వల్ల ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురయ్యాయి. కొన్ని బిల్లులపై సమగ్ర చర్చ జరగలేదనే విమర్శలు వచ్చాయి. విదేశీ నిధుల నియంత్రణ బిల్లును పార్లమెంటరీ కమిటీకి అప్పగించడం కూడా జరిగింది. సాధారణంగా సంఖ్యా బలంతో బిల్లులను ఆమోదించుకునే అధికారపక్షం, బయట జరుగుతున్న ప్రజా నిరసనల కారణంగా కొంత వెనక్కి తగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి సమస్యలపై యువత దేశ రాజధానిలో నిరసనలు వ్యక్తం చేయడం కూడా ప్రశ్నించే స్వభావానికి ప్రతీక. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,



పరీక్షా వ్యవస్థలో పారదర్శకత ఉండాలని యువత కోరుతోంది. ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యుడైన మంత్రి ముందే రాజీనామా చేసినా, సమస్యపై యువత ప్రశ్నలు కొనసాగాయి.

వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా వారిపై ముద్రలు వేయడం సమస్యను పరిష్కరించదు. ఇదే సందర్భంలో ప్రధాని మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'దిమాగీ నక్సల్స్' అనే పదాన్ని ప్రస్తావించడం చర్చకు దారితీసింది. సమాజంలో జరిగే అన్యా యాన్ని, అవినీతిని, అక్రమాలను ప్రశ్నించే వారిని ఉద్దేశించేలా ఈ పదాన్ని ఉపయోగించడంపై విమర్శలు వచ్చాయి. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే ప్రతి ఆలోచనాపరుడినీ ఇలాంటి ముద్రతో చూడటం ప్రజాస్వామ్యానికి ఎంతవరకు అనుకూలమనే ప్రశ్న తలెత్తింది. గతంలో 'అర్బన్ నక్సల్స్' అనే పదాన్ని ఉపయో గించినట్లే ఇప్పుడు ప్రశ్నించే ప్రతి ఆలోచనాపరుడినీ 'దిమాగీ నక్సల్'గా ముద్ర వేయడం ప్రమాదకరమైన ధోరణి. ప్రభుత్వ విధానాలను విమర్శించడం, ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో నేరం కాదు. కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత తమ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారి సమస్యలను వినాలి.

ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ అనుమానంతో చూడటం ప్రారంభిస్తే చివరకు ప్రశ్నించే హక్కే ప్రమాదంలో పడుతుంది. నేటి యువత సోషల్ మీడియాలో చాలా చురుకుగా ఉంది. తమ అసంతృప్తిని కొత్త రకాలుగా వ్యక్తం చేస్తోంది. 'దిమాగీ నక్సలైట్' అనే పదానికి నిరసనగా ఆన్‌లైన్‌లో కొత్త రాజకీయ వేదిక ఏర్పడటం, దానికి పెద్ద సంఖ్యలో అనుచరులు రావడం కూడా యువతలోని స్పందనకు ఒక ఉదాహరణ. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మాట్లాడే ప్రతి మాటను ప్రజలు గమనిస్తున్నారని ఈ పరిణామాలు గుర్తుచేస్తున్నాయి. ఇంత పెద్ద దేశంలో భావ సంఘర్షణ సహజం. తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, ప్రభుత్వాలను ప్రశ్నించడం, విధానాలను విమర్శించడం ప్రజాస్వామ్యంలో భాగమే. ప్రజలు న్యాయం, పారదర్శకత, జవాబుదారీతనం కోరుతున్నప్పుడు వారి డిమాండ్లను పరిశీలించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నిరసనలకు కారణమైన సమస్యలను పరిష్కరించకుండా నిరసనకారులపైనే ముద్రలు వేయడం వల్ల అసంతృప్తి మరింత పెరిగే అవ కాశం ఉంది. ప్రశ్నే ప్రజాస్వామ్య సౌధానికి పునాది. ప్రశ్నించే హక్కును కాపాడటం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడటమే.

# జాతీయం-అంతర్జాతీయం

# అమెరికా చేతిలోనే నియంత్రణ

- సమాధానాల కంటే ప్రశ్నలే అధికం
- ఆధునిక సామర్థ్యాల కోసం ప్రయత్నాలు
- భారత్‌కు సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి అమెరికా నో
- శుభం కార్డు పడని 16 సంవత్సరాల జావెలిన్ ఒప్పందం కథ



**చండీఘర్, సెప్టెంబరు 01 (ఏ.ఎం.ఎస్) :** సైనిక అవసరాల కోసం అమెరికాలో తయారైన ఎఫ్‌జీఎం 148 జావెలిన్ యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులను (ఏటీజీఎం) దిగుమతి చేసుకోవడానికి భారత్ ఎట్టకేలకు అంగీకరించింది. ఈ ఆయుధ వ్యవస్థ కోసం 16 సంవత్సరాల క్రితమే అమెరికాను భారత్ సంప్రదించింది. సుదీర్ఘ కాలం తర్వాత ఇప్పుడు ఒప్పందం కుదిరింది. ఆయుధ వ్యవస్థకు కేవలం కొనుగోలుదారుగానే ఉండకుండా సాంకేతిక బదిలీ ద్వారా దానిని స్థానికంగా తయారు చేయాలని అప్పుడు భారత్ భావించింది. రెండు దేశాల మధ్య బలపడుతున్న రక్షణ సంబంధాలలో ఇది ఓ మైలురాయి అంటూ ప్రభుత్వ అనుకూల మీడియా కథనాలను వండివారుస్తోంది. అయితే ఈ ఒప్పందం వెనుక ఆశాజనకంగా లేని ఓ వాస్తవం దాగి ఉంది.

జావెలిన్ క్షిపణుల కోసం 16 సంవత్సరాల పాటు చర్చలు జరిపిన తర్వాత కూడా భారత్ సాధించింది ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది. దేశీయంగా క్షిపణుల తయారీకి చేసిన ప్రయత్నాలు విఫలమైనప్పుడు జావెలిన్ సహఉత్పత్తిపై అమెరికా ఇచ్చిన తాజా హామీని ఎలా విశ్వసించాలన్న సందేహం కలుగుతోంది. జావెలిన్ సాంకేతికతపై అమెరికా తన నియంత్రణను నిలుపుకొని, భారత్ కేవలం ఆ క్షిపణి కొనుగోలుదారుగా మాత్రమే మిగిలిపోతే 'సహఉత్పత్తి' అనే మాటకు అర్థం ఏముంటుంది? పైగా ఏటీజీఎం కొనుగోలుకు సంబంధించిన పరిస్థితులు కూడా పెద్దగా భరోసా ఇవ్వడం లేదు. ఒప్పందం విలువ, దాని వివరాలు బహిర్గతం కాలేదు. భారత త్రివిధ దళాలు ఒకేసారి రూ.300 కోట్ల విలువైన 'కీలక కార్యాచరణ సామర్థ్యాల'ను నేరుగా సమకూర్చుకోవడానికి ఈ ఒప్పందం వీలు కల్పిస్తుందని కొన్ని వర్గాలు చెబుతున్నాయి. జావెలిన్ కోసం సుదీర్ఘ కాలం జరిగిన చర్చలు చివరికి ఓ ఫాస్ట్‌ట్రాక్ రెడీమెడ్ కొనుగోలుతో ఎలా ముగిశాయి? ఒక్క మాటలో చెప్పాలంటే జావెలిన్ ఒప్పందం సమాధానాలు ఇవ్వడం కంటే ఎక్కువ ప్రశ్నలను లేవనెత్తుతోంది. అందుబాటులో ఉన్న ఒప్పందం వివరాలు కూడా చాలా అస్పష్టంగా ఉన్నాయి.

జావెలిన్‌లో రెండు సామర్థ్యాలు ఉన్నాయి. ఒకటి 'ఫైర్ అండ్ ఫర్‌గెట్' సామర్థ్యం. అంటే కాల్పులు జరిపిన వెంటనే దాని ఆపరేటర్లు అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు వీలు కలుగుతుంది. రెండోది టాప్‌అటాక్ సామర్థ్యం. ట్యాంకుల రక్షణ కవచం బలహీనంగా ఉన్నప్పుడు పై నుంచి వాటిపై దాడి చేయడానికి వీలు కల్పిస్తుంది. భారత సైన్యం ఆధునిక మూడో తరం ఏటీజీఎం కోసం 1990వ దశకం చివర, 2000వ దశకం ప్రారంభం నుంచే అన్వేషించడం ప్రారంభించింది. అయితే ఆ సమయంలో అందుబాటులో ఉన్న వ్యవస్థలలో ఈ ఆధునిక సామర్థ్యాలు లేవు. జావెలిన్‌లో ఈ వ్యవస్థలు ఉండడంతో మన దేశం వాటి కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ సంవత్సరం మేలో సింగపూర్‌లో జరిగిన చర్చల సందర్భంగా అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సేథ్ జావెలిన్ వ్యవస్థ అమ్మకాన్ని ప్రస్తావించారు. ఏదేమైనా ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఇరు పక్షాలకు భిన్నమైన ప్రాధాన్యతలు ఉన్నాయి.

న్యూఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం గత నెల 28న ఒప్పందం వివరాలను ప్రకటించింది. దీని ప్రకారం సాంకేతిక పరిజ్ఞానంపై యాజమాన్యం, ఏటీజీఎం సరఫరాపై నియంత్రణ అమెరికా చేతిలోనే ఉంటుంది. ఏటీజీఎం ఉత్పత్తిదారుగా మారాలన్న భారత్ ఆకాంక్ష నెరవేరలేదు. చివరికి కొనుగోలుదారు పాత్రకే అది పరిమితం కావాల్సి వచ్చింది. పరస్పర ప్రయోజనకరంగా జావెలిన్ క్షిపణులను రెండు దేశాలు ఉత్పత్తి చేసే అంశం పైన, తయారీ సాంకేతిక పరిజ్ఞానం విస్తరణ అవకాశాల పైన తాజాగా కుదిరిన ఒప్పంద పత్రం (ఎల్ఓఏ) చర్చలకు వీలు కల్పిస్తుందని అమెరికా రాయబార కార్యాలయం చెప్పినప్పటికీ మరింత వివరణ ఇచ్చేందుకు నిరాకరించింది.

గత సంవత్సరం నవంబరులో అమెరికా విదేశాంగ శాఖ 45.7 మిలియన్ డాలర్ల విలువైన ఎఫ్ఎంఎస్ ప్యాకేజీకి ఆమోదం తెలిపింది. ఇందులో 100 జావెలిన్ క్షిపణులు, పాతిక తేలికపాటి కమాండ్ లాంచ్ యూనిట్లు, ఓ అదనపు క్షిపణి ఉన్నాయి. ఆయుధ వ్యవస్థను కొనుగోలు చేయడానికి ముందు వినియోగదారుడు ఈ అదనపు క్షిపణిని ప్రయోగించాల్సి ఉంటుంది. పదహారు సంవత్సరాల చర్చల తర్వాత కూడా వ్యవస్థ కొనుగోలుకు ముందు క్షిపణిని భారత్ ప్రయోగించాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. ఇంతకాలం తర్వాత భారత సైన్యానికి జావెలిన్‌ను పరీక్షించడం ఇంకా అవసరమా అని ఓ నిపుణుడు వ్యంగ్యంగా ప్రశ్నించారు. దీనిని ఓ విచిత్రమైన చిక్కుముడిగా పలువురు సైనిక విశ్లేషకులు చూస్తున్నారు.

# ఇమ్రాన్ దంపతులకు భారీ ఉపశమనం

- వారికి ఏకాంత నిర్బంధం విధించొద్దు
- ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశం
- తుది తీర్పు వెలువరించిన జస్టిస్ ఖాదిమ్ హుస్సేన్



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 01:** జైల్లో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ , ఆయన భార్య బుష్రా బీబీకి భారీ ఉపశమనం లభించింది. వారికి ఇకపై ఏకాంత నిర్బంధం విధించవద్దని ఇస్లామాబాద్ హైకోర్టు ఆదేశించింది. చట్టం ప్రకారం ఖాన్, ఆయన భార్య సమావేశమయ్యేందుకు వీలు కల్పించాలని అడియాలా జైలు అధికారులకు స్పష్టం చేసింది. జీ ప్రధాని 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య ప్రస్తుతం రావల్పిండిలోని అడియాలా జైలులో అవినీతి, సంబంధిత కేసుల్లో సుదీర్ఘ జైలు శిక్ష అనుభవిస్తున్నారు. పాకిస్థాన్ తెహ్రీక్‌ఎఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ వ్యవస్థాపకుడైన ఇమ్రాన్ ఖాన్‌ను ఏకాంత నిర్బంధంలో ఉంచారని ఆరోపిస్తూ ఆయన సోదరి అలీమా ఖాన్ కోర్టును ఆశ్రయించగా.. బుష్రా బీబీ కుమార్తె ముబషరా ఖవార్ మనేకా ఆమెకు సంబంధించి పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై జస్టిస్ ఖాదిమ్ హుస్సేన్ సూమ్రో విచారణ చేపట్టి ఈ తీర్పు వెలువరించారు.

జైలు నిబంధనల ప్రకారం ఖాన్‌ను కలవడానికి ఆయన కుటుంబ సభ్యులను అనుమతించాలని, అలాగే ఆయన తన కుమారులతో టెలిఫోన్ సంభాషణలు జరిపేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. ప్రతిరోజూ వార్తాపత్రికలు, పుస్తకాలు అందించాలని, జైలు నిబంధనలకు అనుగుణంగా ఆయనకు వైద్య సౌకర్యాలు అందేలా చూడాలని సూచించారు. కోర్టు ఆదేశాలను అమలుచేసి, 15 రోజుల్లోగా నివేదికను సమర్పించాలని జైలు సూపరింటెండెంట్‌కు జస్టిస్ ఖాదిమ్ స్పష్టం చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఆగస్టు 2023 నుంచి జైలులోనే ఉన్నారు. కుటుంబ సభ్యులను కలవకుండా అధికారులు అడ్డుకుంటున్నారని, సరైన వైద్య సంరక్షణ కూడా అందజేయడం లేదని ఆయన మద్దతుదారులు, బంధువులు ఆరోపిస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను ప్రభుత్వం ఖండించింది. అవినీతికి సంబంధించిన కేసులో దోషిగా తేలడంతో బీబీని 2024 జనవరి 31న జైలుకు పంపారు. దాదాపు తొమ్మిది నెలల తర్వాత అదే ఏడాది అక్టోబర్ 24న ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు. మరో అవినీతి కేసులో దోషిగా తేలడంతో ఆమెను 2025 జనవరి 17న తిరిగి అరెస్టు చేశారు. అప్పటి నుంచి అవినీతి సంబంధిత కేసులలో అదనపు శిక్షలు కూడా పడటంతో అడియాలా జైలులోనే నిర్బంధంలో ఉన్నారు. గత నెలలో ఖాన్ ఆరోగ్యం ముఖ్యంగా కంటి సమస్యపై ఆయన కుటుంబ సభ్యులు, మద్దతుదారులు ఆందోళనల నేపథ్యంలో ఆయనను ప్రైవేటు యాజమాన్యంలోని షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు తరలించాలని ప్రభుత్వాన్ని పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆదేశించింది. కానీ, ఆగస్టు 2021 తేదీల్లో ఖాన్‌ను షిఫా హాస్పిటల్‌కు బదులుగా రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రభుత్వ ఆధీనంలోని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో చేర్పించారు. ఆ తర్వాత ఆయనను తిరిగి అడియాలా జైలుకు తీసుకువెళ్లారు.

# పీఎన్‌బీలో నకిలీ నోట్లు

- ఉత్తరప్రదేశ్‌లో వెలుగులోకి స్కాం
- దేశవ్యాప్తంగా సంచలనం



**లక్నో, సెప్టెంబరు 01 (ఏ.ఎం.ఎస్) :** ఉత్తరప్రదేశ్‌లోని సహారన్‌పూర్‌లో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్ లో నకిలీ నోట్ల స్కాం వెలుగులోకి వచ్చింది. బ్యాంకులోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన అసలు కరెన్సీ నోట్లను మాయం చేసి..

వాటి స్థానంలో అచ్చం అలాగే ఉండే నకిలీ నోట్లను చేర్చినట్లు బయటపడింది. ఏకంగా రూ.7కోట్ల 40 లక్షల మేర రియల్ కరెన్సీని నకిలీ నోట్లతో మాయం చేసిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ అరుణ్ కుమార్ చౌబే ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సదర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో సీనియర్ డివిజనల్ మేనేజర్ రవి కుమార్, కరెన్సీ చెస్ట్ మేనేజర్లు సుశీల్ శర్మ, అమిత్ కుమార్‌లను ప్రధాన నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం నోట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతుండటంతో.. మొత్తం ఎంత మోసం జరిగిందనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. నకిలీ నోట్లను బ్యాంకులోకి ఎలా స్మగ్లింగ్ చేశారు.. దీని వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ సాగుతోంది.

# పరిస్థితి మళ్లీ మొదటికి...

- ఇరాన్ రాకెట్ లాంఛర్లపై అమెరికా దాడి
- విరుచుకుపడిన టెహ్రాన్
- మందుపాతరలు అమర్చేందుకు ఇరాన్ ప్రయత్నం : అమెరికా
- దురాక్రమణను చూస్తూ ఊరుకోం : పెజెష్కియాన్



**వాషింగ్టన్/టెహ్రాన్, సెప్టెంబరు 01 :** నెల రోజులకు పైగా కొనసాగిన ప్రశాంతతకు భంగం కలిగిస్తూ మధ్యప్రాచ్యం మరోసారి దాడులు, ప్రతిదాడులతో దద్దరిల్లింది. తన రాకెట్ లాంచర్లపై ఆదివారం జరిగిన దాడికి ప్రతిగా జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించింది. హార్ముజ్ జలసంధిలో సముద్ర మందుపాతరలను అమర్చడానికి ఇరాన్ రాకెట్ లాంచర్లు ప్రయత్నిస్తున్నాయని ఆరోపిస్తూ వాటిపై అమెరికా దాడులు జరిపింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్‌లోని అమెరికా సైనిక లక్ష్యాలపై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. తమ గగనతలంలో ప్రవేశించిన ఎనిమిది ఇరాన్ క్షిపణులను ధ్వంసం చేశామని జోర్డాన్ సాయుధ దళాలు తెలిపాయి. పౌరులకు, ఆస్తులకు హాని జరగక ముందే వాటిని తటస్థం చేశామని చెప్పాయి. కాగా ఇరాన్ నుంచి సోమవారం ఉదయం తన ప్రాదేశిక జలాల వైపు వస్తున్న డ్రోన్‌ను అడ్డుకున్నానని యూఏఈ తెలియజేసింది. తాజా పరిణామాల కారణంగా పశ్చిమాసియాలో సంఘర్షణలు తిరిగి మొదలయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

మందుపాతరలతో కూడిన రాకెట్లను హార్ముజ్‌లోకి ప్రయోగించడానికి ఇరాన్ సేనలు లారక్ ద్వీపంలో సిద్ధంగా ఉన్నాయని గమనించామని, అందుకే ఆ రెండు రాకెట్ లాంఛర్లపై దాడి చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ చెప్పారు. కీలక జలమార్గంలో ప్రమాదకారిగా మారే మందుపాతరలను అమర్చే ఇరాన్ దళాలపై పరిమితమైన, కచ్చితమైన చర్య తీసుకున్నామని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో సెంట్‌కామ్ వివరించింది. 'ఇరాన్ మందుపాతరల ముప్పును సృష్టించింది. నావికులను, వాణిజ్య నౌకల రవాణాను, ప్రపంచ వాణిజ్యాన్ని రక్షించడానికి మా సైన్యం ఆ ప్రమాదాన్ని తొలగించింది' అని తెలిపింది.

తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదని, అయితే దురాక్రమణ జరుగుతుంటే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తెలిపారు. నిర్ణయాత్మక ప్రతిస్పందన తెలిపే సామర్థ్యం తమకు ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా దాడి 'వ్యూహాత్మక, ప్రాణాంతక తప్పిదమ'ని ఐఆర్‌జీసీ వ్యాఖ్యానించింది. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. జోర్డాన్, యూఏఈలలో అమెరికా సైన్యం ఉపయోగిస్తున్న స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేశామని ఇరాన్ తెలియజేసింది.

మందుపాతరల నుంచి హార్ముజ్ జలసంధికి విముక్తి లభించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్ది రోజులకే మధ్యప్రాచ్యంలో తిరిగి ఉద్రిక్తతలు తలెత్తాయి. సైనిక చర్యకు బదులుగా ఇరాన్‌పై ఆర్థిక యుద్ధాన్ని మొదలు పెడతానని చెప్పిన అమెరికా దానికి భిన్నంగా దాడులకు తెగబడింది. హార్ముజ్‌పై పట్టు కోసం అమెరికా, ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. జలసంధిలో రాకపోకలు సాగిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ తరచుగా దాడులు చేస్తూ జలమార్గాన్ని నిర్వహించే హక్కు తనకే ఉన్నదని చెబుతోంది. మరోవైపు అమెరికా సేనలు ఇరాన్ ఓడరేవులను దిగ్బంధించి హార్ముజ్‌లో నౌకాయానం సాఫీగా జరిగేందుకు ప్రయత్నిస్తున్నాయి.

# 5న నిరసనలు రద్దు



- కేసుల ఉపసంహరణకు కేంద్రం ఓకే అన్నందుకే

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 01 (ఏ.ఎం.ఎస్) :** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఢిల్లీలో సెప్టెంబర్ 5న తలపెట్టిన నిరసనను రద్దు చేసుకుంది. ఈ మేరకు సీజేపీకి చెందిన సౌరవ్ దాస్ సుప్రీంకోర్టు ముందు హాజరై, నిరసనకారులపై ఉన్న కేసులను ఉపసంహరించుకోవడానికి కేంద్రం తీసుకున్న చర్యల దృష్ట్యా, సెప్టెంబర్ 5న జరగాల్సిన మార్చ్ పిలుపును సీజేపీ ఉపసంహరించుకుంటోందని తెలియజేశారు.

ఢిల్లీ తో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలలో నీట్ పేపర్ లీకేజ్‌ను వ్యతిరేక నిరసనలో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్‌లను సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసిన విషయం తెలిసిందే. విద్యార్థుల నిరసన తర్వాత సీజేపీ నాయకులకు ఇచ్చిన మూడు హామీలకు కేంద్రం కట్టుబడి ఉందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ గత నెల జూలై 20నజంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విషయం తెలిసిందే. యువత ఆందోళనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు.



ఇండిగో విమానంలో

## సాంకేతిక లోపం

- సురక్షితంగా ల్యాండింగ్

**పనాజీ, సెప్టెంబరు 01 (ఏ.ఎం.ఎస్) :** గోవా నుంచి ఢిల్లీకి వెళ్తున్న ఇండిగో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలోని విమానం ఓ ఇంజిన్ లో టెక్నికల్ సమస్య ఏర్పడంతో పైలట్లు అత్యవసరంగా గోవా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులో సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం 9.15 గంటలకు గోవా ఎయిర్ పోర్టు నుంచి ఇండిగో విమానం (6E 2102) ఢిల్లీకి బయల్దేరింది. గాల్లో ఉండగానే విమానం రెండు ఇంజన్లలో ఒకటి ఫెయిల్ అయినట్లు గుర్తించిన పైలట్లు ఏ.టీ.సీ.కి సమాచారం ఇచ్చారు. ఏటీసీ అధికారుల ఆదేశాలతో గోవా ఎయిర్ పోర్టులో విమానాన్ని సురక్షితంగా ల్యాండింగ్ చేశారు.

# నేపాల్ మృతుల సంఖ్య 962

- నాలుగు వేల మంది గల్లంతు

**ఖాట్మండు, సెప్టెంబరు 01 :** నేపాల్‌లో భారీ వరదలు, కొండ చరియల విరిగిపడటంతో మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. మంగళవారం నాటికి నేపాల్‌లో 962 మంది మృతి చెందగా, 4,000 మందికిపైగా గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. నువాకోట్ జిల్లాలోని ఓ ఇంట్లో ఏకంగా 23 మృతదేహాలు లభించడం విషాదాన్ని మరింత తీవ్రం చేసింది.

వరదల కారణంగా ఇళ్లు, రోడ్లు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయి. పలు సొరంగాల్లో వందలాది మంది కార్మికులు చిక్కుకున్నట్లు అనుమానిస్తుండటంతో నేపాల్ సైన్యం రెస్క్యూ చర్యలు కొనసాగిస్తోంది.



# దీదీ కుటుంబంలో తీవ్ర విషాదం



- ఆమె మేనకోడలు బ్రిస్టీ ఆత్మహత్య

**కలకత్తా, సెప్టెంబరు 01 (ఏ.ఎం.ఎస్):** పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మంగళవారం ఆమె మేనకోడలు బ్రిస్టీ ముఖర్జీ ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. రాంపూర్‌హాట్ ప్రాంతంలోని కుసుంబా గ్రామంలో ఉన్న తన ఇంటి రెండో అంతస్తులోని ఓ గదిలో బ్రిస్టీ ముఖర్జీ ఉరివేసుకున్న స్థితిలో కనిపించారు. దీంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఆమె మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం పరీక్ష కోసం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# భగ్గుమన్న గ్యాస్ ధరలు

- హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులపై తీవ్ర భారం
- అదనపు ఖర్చుతో తిప్పలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 01 (ఏ.ఎం.ఎస్) :** ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ల ధరలను మరోసారి పెంచాయి. తాజా వివరాల ప్రకారం.. 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ల ధరలను సవరించాయి. పలు నగరాల్లో ధరలు పెరగడంతో హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, క్యాంటీన్లు, ఇతర వాణిజ్య సంస్థలకు అదనపు ఖర్చు తప్పడం లేదు. ఇది సాధారణ వినియోగదారులకు కొంత ఊరట కలిగించే అంశంగా చెప్పవచ్చు. ఇండియన్ ఆయిల్ విడుదల చేసిన తాజా ధరల ప్రకారం హైదరాబాద్‌లో 19 కిలోల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.11 పెరిగి రూ.2,996కు చేరుకుంది. ఢిల్లీలో రూ.9.50 పెరిగి రూ.2,747.50కు చేరగా, ముంబైలో రూ.2,691.50 నుంచి రూ.2,701కు పెరిగింది. చెన్నైలో కూడా ధర రూ.2,906 నుంచి రూ.2,916.50కు పెరిగింది. అయితే గృహ అవసరాలకు ఉపయోగించే 14.2 కిలోల డొమెస్టిక్ ఎల్‌పీజీ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదు.

# అమెరికాలో ఇద్దరు మలయాళీ మహిళల దారుణ హత్య!

- ఓనం వేడుకల వేళ విషాదం
- ఘటనకు కచ్చితమైన కారణాలు లేని వైనం



**అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్‌లో కేరళకు చెందిన ఇద్దరు మహిళలు వేర్వేరు ఉదంతాల్లో దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ రెండు ఘటనలూ ఆగస్టు 28వ తేదీనే చోటుచేసుకున్నాయి.**

**కాలిఫోర్నియా, సెప్టెంబరు 01:** అమెరికాలోని కాలిఫోర్నియా స్టేట్‌లో కేరళకు చెందిన ఇద్దరు మహిళలు వేర్వేరు ఉదంతాల్లో దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ రెండు ఘటనలూ ఆగస్టు 28వ తేదీనే చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా మృతులతో కలిసి ఇంట్లో నివసిస్తున్న ఓ మహిళే వీరిని హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే హత్యకు కొన్ని రోజుల ముందే ఈ ముగ్గురు మహిళలు కలిసి ఎంతో సంతోషంగా ఓనం పండుగను జరుపుకోవడం, వాటిని కుటుంబ సభ్యులకు కూడా పంపించడం చేశారు. కానీ ఇలా జరిగిన కొంతకాలానికే ఇద్దరి హత్య జరగడం.. కేరళలోని వారి కుటుంబ సభ్యులు, బంధువులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తోంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతులను త్రిస్సూర్ జిల్లా ముడిక్కోడ్‌కు చెందిన అంజన హరి (35), తిరువనంతపురం జిల్లా కేసవదాసపురానికి చెందిన అన్ మేరీ మాథ్యూ (40)లుగా గుర్తించారు. మిల్పిటాస్‌లోని మిల్ క్రీక్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలో ఉన్న పార్కింగ్ ప్రాంతానికి అంజనను పిలిపించి, ఆమెపైకి కారును వేగంగా దూకించి దారుణంగా కొట్టి చంపినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ఒక బ్లూ కలర్ ఎస్‌యూవీ వాహనం అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోయిందని ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు తెలిపారు. ఇక అన్ మేరీ మాథ్యూను.. అపార్ట్‌మెంట్‌లోని గదిలోనే కత్తితో పొడిచి చంపేశారు.

రోడ్డుపై మహిళ మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం రావడంతో.. మిల్పిటాస్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ముఖ్యంగా పార్కింగ్ ఏరియాలో తీవ్ర గాయాలతో పడి ఉన్న అంజనను గుర్తించారు. సాక్షుల ఆధారంగా పరిసరాల్లో గాలించి, ఆ బ్లూ ఎస్‌యూవీ వాహనాన్ని గుర్తించి దానికి డ్రైవర్‌గా ఉన్న 32 ఏళ్ల అనిలా బేబీని అరెస్ట్ చేశారు. అనిలా బేబీ కొట్టాయం జిల్లా ఈరట్టుపేటకు చెందిన మహిళగా గుర్తించారు. అయితే ఆమె మృతులు ఇద్దరితో కలిసి ఒకే ఇంట్లో నివాసం ఉండేదని.. అయితే పక్కా పథకం ప్రకారమే ఆమె రెండు హత్యలకు పాల్పడిందని మృతుల బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఘోరానికి గల ఖచ్చితమైన కారణాలు ఏంటనేది పోలీసులు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## భూ సేకరణ కై చేపట్టిన సర్వేను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**హనుమకొండ, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి) :**
హసన్‌పర్తి మండలం కోమిటిపల్లి లో రైల్వే వారికి సబ్ స్టేషన్ ఏర్పాటుకు కావలసిన భూమి కోసం అలాగే జయిగిరి లోని రైల్వే ట్రాక్ దగ్గర నిర్మించ తలపెట్టిన ఆర్వోబి, ఆర్యుబి కి కావాలిసిన భూమి కోసం జరుగుతున్న సర్వే పనులను సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు. అనంతరం భీమారం శివారు లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి రెవిన్యూ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఆ తరవాత కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో కుడా, రెవిన్యూ, రైల్వే అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యి రైల్వే శాఖ కి సంబందించిన భూ సేకరణ అంశాల మీద చర్చించి తగు సూచనలను తెలిపారు. ఈ సమావేశం లో ఆర్డీవో వెంకటేశ్వర్లు, కుడా పిఓ అజిత్ రెడ్డి, ఐఆర్ఎస్ఇ సైలేష్, డివైఎస్ఓ ప్రశాంత్, జిల్లా మత్స్య శాఖ అధికారి పిల్లి శ్రీపతి, ఆర్ అండ్ బి ఈ ఈ చరణ్, ఎన్పీడీసీఎల్ ఎస్ఇ సామ్య నాయక్, ,రైల్వే అసిస్టెంట్ ఎక్సక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 2బి హెచ్ కె లబ్ధిదారుల తుది జాబితా , నవంబర్ 30లోగా భూ సర్వే పూర్తి

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశం**
**పూర్తి పారదర్శకతతో ఇళ్ల కేటాయింపు.. లక్కీ డ్రా విధానం అమల్లోకి**



**జనగామ, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి) :**
జిల్లాలో రెండు పడక గదుల (2BHK) ఇళ్ల కేటాయింపును అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ఈ నెల 5వ తేదీ నాటికి లబ్ధిదారుల తుది జాబితాను విడుదల చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. అలాగే, జిల్లాలో సాగుతున్న భూ సర్వే ప్రక్రియను నాణ్యతతో వేగవంతం చేసి నవంబర్ 30 నాటికి నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్‌తో కలిసి గృహ నిర్మాణం, భూ సర్వే అధికారులతో కలెక్టర్ వేర్వేరు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. 2BHK తుది జాబితా సమగ్ర పరిశీలనతో జిల్లాకు కేటాయించిన 1,137 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి ఎల్3, ఎల్2 ప్రాధాన్యత క్రమంలో అభ్యంతరాలను (గ్రీవెన్స్) క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారుల పేరిట ఎక్కడా స్వంత భూమి ఉండకూడదని, రెవెన్యూ రికార్డుల ద్వారా దీనిని పక్కాగా ధృవీకరించాలని ఆదేశించారు. అర్హుల ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ప్రజాప్రతినిధుల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా ఇళ్లను కేటాయించి, తుది జాబితాను మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే భూ సర్వే నిర్వహణలో జనగామ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని కలెక్టర్ అభినందించారు. సర్వే పనులను మరింత వేగవంతం చేసేందుకు అదనంగా 5 రోవర్ పరికరాల కొనుగోలుకు టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు.ప్రతిరోజూ 20 నుంచి 25 ఎకరాల చొప్పున సర్వే సాగేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. 12 బృందాలు, ప్రత్యేక శిక్షణ, పనుల సమన్వయం కోసం 12 బృందాలను ఏర్పాటు చేసి, గ్రామస్థాయిలో ఇద్దరు లైసెన్స్డ్ సర్వేయర్లను కేటాయించాలని ఆదేశించారు. విధులకు హాజరుకాని సర్వేయర్లకు నోటీసులు ఇవ్వాలని హెచ్చరించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన 6 మండలాల్లోని 123 ఎకరాల భూమికి మ్యాప్ సిద్ధం చేసి, 72 చదరపు గజాల ప్లాట్లుగా విభజించే ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశాల్లో గృహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలు, సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ మన్యం కొండ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంప్ కార్యాలయం పై దాడిని
## ఖండించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

**ఇక్కడ బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే**
**నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిల్లర నాయకుడు**
**ఎమ్మెల్సీ శంకర్ నాయక్**
**మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి**



**నల్గొండ జిల్లా వుదయం ప్రతినిధి సెప్టెంబర్ 1**
నల్గొండ పట్టణ కేంద్రంలో మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన విలేకర్ల సమావేశం లో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడారు ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది బిజెపి నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిల్లర నాయకుడని బిజెపిలో విలువలు కలిగిన నాయకులు ఎంతో మంది ఉన్నారు ఇలాంటి చిల్లర కాని వలన ఆ పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండదు నల్గొందలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇంటికి వచ్చి దాడి చేస్తే మేము ఊరుకుంటామా

తన బుద్ధి చెప్తాం

ఇక్కడ బీజేపీ-బీఆర్ఎస్ ఒక్కటే సంస్కారహీనంగా , విలువలు మర్చిపోయి ప్రవర్తిస్తున్నారు. తమ్ముని కార్పోరేటర్ కూడా గెలిపించుకోలేని చిల్లర గాళ్లు కూడా సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి పిచ్చి లేసినట్లుగా ప్రవర్తిస్తున్నారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.. దాడికి ప్రతిదాడి ఎప్పుడైనా ఉంటుందని నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి బిజెపి శ్రేణులను తీవ్రంగా హెచ్చరించారు

మంత్రి ఇంటిపై దాడి చేసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి కార్యాలయంలో దాక్కుంటున్నాడు. దమ్ముంటే బయటికి రావాలని సవాల్ చేశారు మంత్రి ఇంటిపై దాడి చేసే ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకుంటూ మా ప్రతిదాడి తీవ్రంగా ఉంటుందన్నారు. మేము ఎప్పుడైనా విలువలకు కట్టుబడి నిరసనలు తెలిపామునిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది..కానీ ఈ విధంగా కాదు

బిజెపి జిల్లా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డి చిల్లర గాడు

అతనికి తగిన బుద్ధి చెప్పే వరకు వదిలి పెట్టం

ఆనాడు తల్లిని దాడి చేసినట్లు అబద్ధపు ప్రచారం చేస్తున్నారు.చిల్లర పనులు చేస్తూ ఎప్పుడు సోషల్ మీడియాలో, ప్రతికలలో రావాలని చూస్తున్నాడు

ఆదేవిధంగా విలువలు మర్చి టిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ప్రవర్తిస్తున్నారు

మమ్మల్ని ఎవరైనా రెచ్చగొడితే ఊరుకునే ప్రసక్తే లేదు. నల్గొండ మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రెడ్డి పరామర్శ పేరుతో నల్లగొండకు వస్తే నల్లగొండ పోలిమేర నుంచి అడ్డుకొని తరిమి కొడతాం ప్రశాంతంగా ఉన్న నల్లగొండను రాజకీయ లబ్ధి కోసం కోసం రెచ్చగొడుతున్నారు మా సహనాన్ని చేతగానితనంగా భావిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి

వారిని ఎక్కడ తిరగకుండా చేస్తాం

విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ అమేర్, మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కార్పొరేటర్లు బొజ్జ శంకర్, అల్లి సుభాష్ యాదవ్, సమద్, ఇబ్రహీం, ఏదుళ్ళ శ్రీధర్ రెడ్డి, మామిడి కార్తిక్, ఇటికాల శ్రీనివాస్, నల్లగొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ , యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు

## రాహుల్‌గాంధీపై పెట్టిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలి
### డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య



**సూర్యాపేట సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**
లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై దురుద్దేశపూర్వకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసయ్య మాట్లాడుతూ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించేలే విధంగా వ్యాఖ్యలు చేసిన ఘటనపై రాహుల్‌గాంధీ ఉత్తరాఖండ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారని తెలిపారు. దళిత నేతగా, పలుమార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన ఖర్గేను అవమానించడాన్ని ప్రశ్నించినందుకు రాహుల్‌గాంధీపై బీజేపీ పాలిత రాష్ట్రంలో అక్రమంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అమానుషమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించే గొంతుకలను అణచివేసే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ తొలగించకపోతే సూర్యాపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**70 గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా సర్వే పనులను వేగవంతం చేయాలి**
**– జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి) :**
ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా భూ రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు బాధ్యతాయుతంగా నిర్దేశిత పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, తో కలిసి అన్ని జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ సర్వే, భూభారతి, తదితర రెవెన్యూ అంశాలపై ఐ డి ఓ సి సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో భూ రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల వారీగా కార్యాచరణ రూపొందించు కొని, దాని ప్రకారం పనులు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రామచంద్రపురం గ్రామంలో రీ సర్వే ప్రక్రియను పూర్తి చేసి, రైతులకు శాశ్వత భూ హక్కులు కల్పించేందుకు రూపొందించిన పట్టా పాస్‌పుస్తకాల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత రికార్డులు, రైతుల వివరాలను పక్కాగా పరిశీలించి పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. భూభారతి, సాదా బైనామాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తూ, భూ సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా చూడాలన్నారు. అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులకు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించుకొని, నిర్దేశించిన గడువుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీవో కృష్ణవేణి , డిప్యూటీ ట్రైనింగ్ కలెక్టర్ , అన్ని మండలాల తహసిల్దార్ లు, డిప్యూటీ తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ

**కుళ్లిన నిల్వ సామగ్రిపై ఆగ్రహం.. సిబ్బందికి హెచ్చరిక**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్-పాల్వంచను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవనాలు, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్, ఆర్.ఓ. ప్లాంట్‌తో పాటు విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, భోజన సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు.15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ పాఠశాలలో ప్రస్తుతం ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరుపై జిల్లా కలెక్టర్ పాఠశాల ఇన్‌చార్జి ప్రశంజీత్ భూసాల్‌ను అడిగి తెలుసుకున్నారు. టీచింగ్ విభాగంలో 23 మంది రెగ్యులర్ సిబ్బంది, 12 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, నాన్‌టీచింగ్ విభాగంలో ఐదుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా వార్డెన్లు ఉన్నారని, పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. విజయ గత ఆగస్టు 17వ తేదీ నుంచి సెలవులో ఉన్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ వంటగదిని పరిశీలించి విద్యార్థులకు సిద్ధం చేసిన అన్నం, పప్పు, సాంబార్, రసం, పెరుగు, కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. రాత్రి భోజనానికి సిద్ధం చేసిన కూరగాయలను కూడా తనిఖీ చేసి వంట సిబ్బందితో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు వంటశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.డైనింగ్ హాల్‌కు ఆనుకుని ఉన్న స్టోర్‌రూమ్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ నిల్వ ఉంచిన కాయగూరలు, ఉల్లిగడ్డలు, పప్పుదినుసులు, బియ్యం, సబ్బులు, షాంపూలు తదితర వస్తువుల కొనుగోలు, నిల్వ వివరాలను క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిల్వలో ఉన్న బెల్లం కుళ్లిపోవడాన్ని గుర్తించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలో వాచ్‌వుమన్‌గా పనిచేస్తున్న సుజాత తన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సెక్యూరిటీ రూమ్ లేక విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పాఠశాలకు వచ్చే అంతర్గత రహదారులు దయనీయ స్థితిలో ఉన్నాయని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నందున రహదారుల అభివృద్ధితో పాటు సెక్యూరిటీ గది నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించడంతో పాటు పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ తనిఖీలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానాలో వైద్య సేవలు, ఎస్ఐఆర్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్ అనురాగ్ జయంతి...



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**
మంగళవారం పోచంపల్లి మండలం లోని పిల్లాయిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పల్లె దవాఖానా, ఎస్ఐఆర్ ప్రక్రియ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్....రోజువారీగా ఎంత మంది ఓపీకి వస్తున్నారు, ఓపీకి వచ్చిన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా, వారికి అందిస్తున్న మందుల వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య మందిరంలో నిర్వహిస్తున్న వివిధ వైద్య పరీక్షల వివరాలను కూడా తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల ప్రసవమైన బంధారపు తేజస్విని ఇంటిని కలెక్టర్ గారు సందర్శించి, తల్లి మరియు శిశువు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శిశువు బరువు ఎంత ఉందని, అవసరమైన టీకాలు వేయించారా లేదా అని ఆరా తీశారు. ఆశా కార్యకర్తలు క్రమం తప్పకుండా ఇంటికి వచ్చి తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గుడ్లు, పాలు అందుతున్నాయా లేదా అని కూడా తెలుసుకున్నారు. శిశువుకు ప్రతి నెలా నిర్ణీత టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల సంఖ్య, వాటిలో పూర్తయిన ఇళ్లు, నిర్మాణంలో ఉన్నవి, ఇంకా నిర్మాణం ప్రారంభించని ఇళ్ల వివరాలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ పరిశీలించి, పనులు నిదానంగా సాగడానికి గల కారణాలను, ఇప్పటివరకు పూర్తయిన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు అందాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం ప్రారంభించని ఇంటిని కూడా సందర్శించి, పనులు ప్రారంభించకపోవడానికి గల కారణాలను లబ్ధిదారునితో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని, మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారు వెంటనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తానని తెలిపారు. గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ఎంతవరకు పూర్తయిందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ఫారాలు తిరిగి అందించని వారికి నోటీసులు జారీ చేశారా లేదా అని ఆరా తీశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, ఫారాలు అందించని వారిని గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యాధికారి మనోహర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పోషకాహార వారోత్సవాలు



హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి) : స్థానిక పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల (స్వయంప్రతిపత్తి)లో సెప్టెంబర్ 1 నుండి 6 వరకు జాతీయ పోషకాహార వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థినుల్లో సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి తెలిపారు. పోషకాహార ప్రాధాన్యం, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సరైన పోషకాహారమే పునాది అని, యువతులు రోజువారీ ఆహారంలో పోషక విలువలు ఉండేలా చూసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ, సరైన ఆహారపు అలవాట్లతో అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, అప్లైడ్ న్యూట్రిషన్ విభాగాధిపతి డా. జె. లకన్ సింగ్ స్పష్టం చేశారు. వారోత్సవాల ప్రాధాన్యతను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. అరుణ, అధ్యాపకులు డా. రేణుక, డా. సునీత, డా. కల్పన, డా. సుభాషిణి, సంతోషి కుమారి సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు, డ్రిప్ పరికరాల పంపిణీపై కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సమీక్ష




**హనుమకొండ, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి) :**
ఉద్యాన శాఖ ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులతో కలెక్టరెట్ లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు తోటల సంరక్షణపై అధికారులు, కంపెనీ ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఆయిల్ పామ్ పర్యవేక్షణ: ఆయిల్ పామ్ రైతులకు అవసరమైన అనుమతులను సకాలంలో మంజూరు చేయాలి. గత నాలుగు ఏళ్లలో సాగైన తోటలను టీజీ ఆయిల్‌ఫెడ్, రామ్‌చరణ్ కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో సందర్శించి, తోటల పురోగతిని పర్యవేక్షించాలి. డ్రిప్ మెటీరియల్ సరఫరా: సూక్ష్మ సేద్య పథకం కింద అనుమతి పొందిన రైతులకు డ్రిప్ మెటీరియల్‌ను సకాలంలో అందించాలి. కంపెనీలు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు. ఆధునిక పరిజ్ఞానం: పండ్ల తోటలు, కూరగాయల సాగు చేసే రైతులకు నూతన యాజమాన్య పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించాలి.రాయితీల అందజేత: శాశ్వత పందిర్ల ద్వారా కూరగాయలు సాగుచేసే రైతులకు అందుబాటులో ఉన్న పథకాల ద్వారా రాయితీలు అందించాలి.
ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. కమలాకర్ రెడ్డి, అధికారుల బృందం మరియు ఆయిల్ పామ్, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సి.పి. ఎస్. విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



**భూపాలపల్లి: సెప్టెంబర్ 01(వుదయం విలేకరి)**
సెప్టెంబర్ 1వ తేదీని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ టీజీజేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఐడిసిఒ భూపాలపల్లి వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన, మహాధర్నా నిర్వహించారు.టీజీజేఈఏసీ జిల్లా చైర్మన్ బూరుగు రవికుమార్, సెక్రటరీ జనరల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ బూరుగు రవికుమార్ మాట్లాడుతూ, 2004 సెప్టెంబర్ 1 నుంచి నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్ విధానం తీవ్ర అన్యాయం చేస్తోందని అన్నారు.దానివల్ల ఉద్యోగుల భవిష్యత్ ఆర్థిక భద్రత దెబ్బతింటోందని పేర్కొంటూ, ప్రభుత్వం వెంటనే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం వెంటనే సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లపై తక్షణమే స్పందించి చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. లేనిపక్షంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీజీఓ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, టి ఎన్ జి ఓ జిల్లా కార్యదర్శి ఏ. దశరథ రామారావు, షఫీ అహ్మద్, రాజ్‌కుమార్, తిరుపతి, అజహర్, శ్రీనివాస్, శ్రీదేవి, ప్రవీణ్, సాంబశివరావు, కిరణ్‌కుమార్, నక్క తిరుపతి, సురేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, అన్వార్ బైగ్, మందల రవీందర్‌రెడ్డి, లక్ష్మణబాబు, అశోక్, తిరుపతిరెడ్డి, సేవానాయక్, మధుసూదన్, ప్రవీణ్‌కుమార్, రమేశ్‌నాయక్, స్వాతి, దిల్షాద్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీకి త్వరలో అన్ని జిల్లాల్లో ఎన్నికలు: ఇన్‌చార్జ్ చైర్మన్ ఎం. దాన కిషోర్



**హనుమకొండ, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి) :**
తెలంగాణ రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్షిప్ డ్రైవ్ విజయవంతంగా పూర్తి కావడంతో, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎన్నికల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రెడ్ క్రాస్ సొసైటీ ఇన్‌చార్జ్ చైర్మన్, గవర్నర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం. దాన కిషోర్ సూచించారు. హైదరాబాద్ సచివాలయంలో పలు జిల్లాల రెడ్ క్రాస్ చైర్మన్లు, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తలసేమియా, సికిల్ సెల్ బాధితులకు పెన్షన్ మంజూరు చేయడంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా అందించిన సహకారానికి గాను దాన కిషోర్‌ను రెడ్ క్రాస్ ప్రతినిధులు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా దాన కిషోర్ మాట్లాడుతూ.. ప్రత్యేక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 70 వేల మంది కొత్త సభ్యులను చేర్చడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఆరోగ్యం, విపత్తు నిర్వహణ, రక్తదానం, పోషణ వంటి సేవా కార్యక్రమాల్లో రెడ్ క్రాస్ పాత్రను మరింత బలోపేతం చేయడానికి తనవంతు పూర్తి సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, పలు జిల్లాల చైర్మన్లు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఆత్మ పథకం ద్వారా రైతులకు శిక్షణ కార్యక్రమం

**మహాదేవపూర్: సెప్టెంబర్ 01(వుదయం ప్రతినిధి)**



మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామంలో రైతు వేదికలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ విస్తరణ సబ్‌మిషన్, కింద రాష్ట్ర విస్తరణ కార్యక్రమాలకు మద్దతుగా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ పథకంలో భాగంగా పూర్వ జ్ఞాన గుర్తింపు తోపాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి బాపు రావు,రసాయనాలు లేని ప్రకృతి సేద్యం ప్రోత్సాహం, వాతావరణ మార్పులను తట్టుకునే పంటల సాంకేతికతలపై లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటల సాగుపై చీడపీడల యాజమాన్యం, సమతుల్య ఎరువుల వినియోగం సాగులో డిజిటల్ సాంకేతికతలు, యాప్‌ల వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు అదేక్రమంలో పంటలను క్షేత్ర స్తాయిలో సందర్శన నిర్వహించి ప్రస్తుతం ప్రత్తిలో ఆకుమచ్చ, రసం పీల్చే పురుగుల బెడదకు మరియు వరి పంటలో ఆశించే చీడపీడలకు నివారణ చర్యలపై అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీపాల్, మండల వ్యవసాయ అధికారిణి శ్రీజ, ఉద్యానవన అధికారిణి మణి, స్థానిక సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి, కన్నెపల్లి సర్పంచ్ సంజీవ్ రెడ్డి,వ్యవసాయ విస్తరణ అధికారి రామ్ బాబు,తోపాటు రైతులు పాల్గొన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# మత్తు పదార్థాల నియంత్రణకు ముమ్మర తనిఖీలు !

**పెద్దపల్లి సెప్టెంబరు 01 (వుదయం ప్రతినిధి)**



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలో మత్తు పదార్థాల నియంత్రణకు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ప్రధానంగా రద్దీగా ఉండే టీ దుకాణాలు, నూతనంగా నిర్మిస్తున్న దుకాణ సముదాయాల ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రధాన చౌరస్తాలోని దుకాణ సముదాయాల ప్రాంతాలను నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందం సహాయంతో పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచుతూ మత్తు పదార్థాల ఆనవాళ్ల కోసం తనిఖీలు చేపట్టారు. పట్టణంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ నగరంలో మత్తు పదార్థాల వినియోగం, రవాణాను అరికట్టేందుకే ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణకు పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

# గణేష్ ఉత్సవాల్లో అప్రమత్తతే ముఖ్యం

**- మండపాల వద్ద సీసీ కెమెరాలు.. డీజేలకు అనుమతి లేదు**

**- ఉత్సవాలకు అందరూ సహకరించాలి: - ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 1 (వుదయం ప్రతినిధి):**



గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ కోరారు. ఉత్సవాల పేరుతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పెద్ద శబ్దాలతో డీజేలు ఏర్పాటు చేయడానికి అనుమతులు లేవని స్పష్టం చేశారు.గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం మంగళవారం దస్నాపూర్‌లోని తానిషా గార్డెన్‌లో మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమన్వయ సమావేశం నిర్వహించింది. వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి స్తోత్రంతో సమావేశం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ అఖిల్ మహాజన్ ఉత్సవాల నిర్వహణ, భద్రతా చర్యలపై నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు.

**ప్రతి మండపం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి**

ప్రతి గణపతి మండపాన్ని పోలీసు శాఖ అందుబాటులోకి తీసుకురానున్న ఆన్‌లైన్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. మండపాల వివరాలు ముందుగానే పోలీసుల వద్ద నమోదు కావడం ద్వారా బందోబస్తు, నిమజ్జన ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ తదితర చర్యలను సమర్థవంతంగా చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.గ్రామాల్లో సాధ్యమైనంత వరకు ఒకే గణపతి మండపాన్ని ఏర్పాటు చేసుకుని ప్రజలంతా ఐక్యంగా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. గతంలో ఏర్పాటు చేసిన మండపాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, కొత్తగా ఏర్పాటు చేసే మండపాలకు అనుమతులు ఉండవని స్పష్టం చేశారు.

**భద్రత విషయంలో రాజీ వద్దు**

మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. విగ్రహాల భద్రతతో పాటు జంతువులు, కోతులు మండపాల్లోకి ప్రవేశించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని తెలిపారు.మండపాల నిర్మాణంలో నాణ్యమైన, మన్నికైన వస్తువులను మాత్రమే వినియోగించాలని, శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదని సూచించారు. వర్షం, గాలులు, ప్రజల రద్దీ వంటి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మండపాలు ప్రమాదాలకు గురికాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. మండపాలపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

**విద్యుత్, అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత**

విద్యుత్ శాఖ అధికారుల సూచనలు తీసుకుని విద్యుత్ కనెక్షన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలిపారు. నాణ్యమైన వైర్లు, విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించాలని, షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు నీరు, ఇసుక వంటి వాటిని సిద్ధంగా ఉంచాలని సూచించారు.ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా రహదారుల్లో మండపాలు ఏర్పాటు చేయరాదన్నారు. ప్రైవేట్ స్థలాల్లో మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా స్థల యజమాని అనుమతి తీసుకోవాలని సూచించారు.

**డీజేలు, జూదానికి తావులేదు**

రాత్రి 10 గంటల తర్వాత మైక్, సౌండ్ సిస్టమ్ వినియోగించి ఇతరులకు ఇబ్బంది కలిగించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. అధిక శబ్దం వచ్చే డీజేలకు అనుమతులు లేవన్నారు. మండపాల వద్ద టపాసులు కాల్చడం, జూదం నిర్వహించడం, లక్కీ డ్రాలు ఏర్పాటు చేయడం నిషేధమని తెలిపారు. బలవంతపు చందాలు వసూలు చేయరాదని, మద్యం సేవించి మండపాల వద్దకు వచ్చే వారిని నిర్వాహకులు నియంత్రించాలని సూచించారు.

**వదంతులను నమ్మొద్దు**

సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. అనుమానాస్పద సమాచారం లేదా అవాంఛనీయ ప్రచారం కనిపిస్తే వెంటనే పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలు జిల్లా ప్రతిష్టకు, ప్రజల ఐక్యతకు ప్రతీకగా నిలిచేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

**వెయ్యి మందికి పైగా హాజరు**

సమన్వయ సమావేశానికి ఆదిలాబాద్ పట్టణంతో పాటు జిల్లాలోని వివిధ మండలాల నుంచి గణపతి మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు, నాయకులు, స్థానిక కౌన్సిలర్లు కలిపి దాదాపు వెయ్యి మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు పాటించాల్సిన భద్రతా సూచనలతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు.
కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, సీఐలు బి.సునీల్ కుమార్, కె.నాగరాజు, బీడీ ప్రేమ్ కుమార్, జి.శ్రావణ్, సీహెచ్.రమేష్, కె.నరేష్, ఎం.ప్రసాద్, డి.గురుస్వామి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళి, ఎన్.చంద్రశేఖర్, ఎస్సైలు, పోలీసు సిబ్బంది, హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు బొంపల్లి హనుమన్లు, నూతన అధ్యక్షుడు, సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులు, దివ్యాంగులకు మరింత మెరుగైన వసతులు కల్పించాలి

**వసతిగృహాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్ సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి):**



వృద్ధులకు ఆప్యాయత దివ్యాంగులకు భరోసా బాగోగులే లక్ష్యంగా కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ వృద్ధులు, దివ్యాంగుల వసతిగృహాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. వసతిగృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి వృద్ధులు, దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి. ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇప్పటికే చేపట్టిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. గతంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు ఇప్పటివరకు ఎలాంటి పనులు నిర్వహించారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెయింటింగ్ పనులను కూడా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతిగృహంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని అన్నారు. వసతిగృహాన్ని అత్యద్భుతంగా ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, వారి అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు మెరుగుపర్చాలని ఆదేశించారు.మౌలిక వసతుల కల్పనతో పాటు అవసరమైన మరమ్మతు పనులకు ఫేజ్-2 కింద మరిన్ని నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు, అంచనాలను సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతిని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సంక్షేమ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.వసతిగృహం కేవలం నివాస ప్రదేశంగా కాకుండా వృద్ధులు, దివ్యాంగులకు ఆత్మీయత, భద్రత, సౌకర్యం కలిగించే మంచి వాతావరణంగా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, వార్డెన్ రాధిక, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలకు సంక్షేమ పథకాలను సకాలంలో అమలు చేయాలి...

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

**జగిత్యాల సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**

ఎస్సీ ఎస్టీల అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి ఎస్ లత తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఎస్సీ ఎస్టీల అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు అంతర్ కుల వివాహ ప్రోత్సాహకాలు పీఎం అజయ్ పథకం అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు మున్సిపల్ కార్మికులకు బీమా 2బీహెచ్‌కే ఇళ్లు పీఎం విశ్వకర్మ అంగన్వాడీ కేంద్రాలు పీహెచ్‌సీలు ఎస్సీ ఎస్టీ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కులాంతర వివాహ ప్రోత్సాహక పథకాలకు సంబంధించిన పెండింగ్ నిధులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఎంత పరిహారం అందించారు ఎంత మందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో సమగ్ర నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ ఎస్టీ లబ్ధిదారుల వివరాలు సమర్పించాలని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సమర్పించాలని కమిషన్ చైర్మన్ సూచించారు ఎస్‌డీఎఫ్ సీడీపీ ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేసే సమయంలో ఎస్సీ ఎస్టీ కాలనీలు గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు ఎస్సీ ప్రాంతాల అభివృద్ధికి 15 శాతం ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని తెలిపారు కేటాయించిన నిధులతో పనులు సక్రమంగా చేపట్టకపోతే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**2,500 కోట్ల రూపాయలతో సబ్‌ప్లాన్ నిధులను సద్వినియోగం చేయాలి**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు 2,500 కోట్ల రూపాయలతో సబ్ ప్లాన్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు ఎస్సీ ఎస్టీ కాలనీల్లో మంచి రహదారులు డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు ఎస్సీ ఎస్టీ నిధులతో చేపట్టాల్సిన పనులకు అవసరమైన అంచనాలను ఆర్‌అండ్‌బీ పంచాయతీ రాజ్ ఈఈలు సిద్ధం చేసి సమర్పించాలని నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించారు.

**నియామకాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్లు తప్పనిసరి**

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల సమయంలో కూడా రిజర్వేషన్ రోస్టర్‌ను తప్పనిసరిగా పాటించాలని కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు పదోన్నతుల్లో కూడా రోస్టర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు జిల్లాలోని మూడు పట్టణ మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో పెద్ద సంఖ్యలో ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నందున వారికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో 30 లక్షల రూపాయల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు కూడా ఎస్ బి ఐ బ్యాంక్ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలన్నారు.

**అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలే లక్ష్యం**

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పంపించాలని సూచించారు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు అంగన్వాడీ భవనాల అనంతరం మహిళా భవనాలు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలను విబిజిఆర్‌ఏఎంజి కింద పట్టణ ప్రాంతాల్లో సీడీపీ కింద ప్రతిపాదించాలని తెలిపారు ప్రతి అంగన్వాడీ కేంద్రం సొంత భవనంలో నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని ఆదేశించారు.



**అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం పెంచాలి**

ఎస్సీ ఎస్టీలపై అట్రాసిటీకి పాల్పడే వారికి చట్టంపై భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అన్నారు అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు విచారణను సమర్థవంతంగా నిర్వహించి శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు మండల కేంద్రాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని తహసీల్దార్లు ఎస్‌ఐలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కేంద్ర ప్రదేశాల్లో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ శాఖ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.

**అట్రాసిటీ బాధితులకు 2బీహెచ్‌కే ఇళ్లు**

ఎస్సీ ఎస్టీ హత్య అత్యాచార కేసుల్లో బాధిత కుటుంబాలకు 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ సూచించారు హైదరాబాద్ లో ఇప్పటికే ఈ విధానం అమలు చేస్తున్నామని దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ తరహా చర్యలు చేపడుతున్నామని తెలిపారు అనంతరం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లత మాట్లాడుతూ జిల్లాలో 85 కులాంతర వివాహ ప్రోత్సాహక దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి సుమారు 2.42 కోట్ల రూపాయలు బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని వివరించారు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితుల్లో ఐదుగురికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు వారం రోజుల క్రితం 185 మంది బాధితులకు 1.06 కోట్ల రూపాయలకు పైగా పరిహారం విడుదలైందని ఆ మొత్తం వెంటనే వారి ఖాతాల్లో జమ కానుందని తెలిపారు మరో 91 మంది బాధితులకు 69.45 లక్షల రూపాయల పరిహారం పెండింగ్ లో ఉందని ఉన్నతాధికారుల సమాచారం మేరకు వారంలోగా విడుదల కానుందని వివరించారు.

# నవంబర్ 17న సీపీఎస్ ఉద్యోగుల సామూహిక సెలవు

**కాంగ్రెస్ మేనిఫెస్టో హామీని వెంటనే అమలు చేయాలి**

**టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవన్ కుమార్**

**ధర్మపురి సెప్టెంబర్01 (వుదయం ప్రతినిధి):**



సీపీఎస్ విధానం అమలై 22 ఏళ్లు గడిచినా పాత పెన్షన్‌ను పునరుద్ధరించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన గళం వినిపించారు.ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరైన ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆందోళనలు నిర్వహించి తమ నిరసనను బలంగా చాటారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యానపవన్ కుమార్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1న సీపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగుల సామాజిక భద్రతను ప్రశ్నార్థకం చేశారని మండిపడ్డారు. గత ఆగస్టు 23న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభ ద్వారానే ఉద్యోగుల ఆకాంక్ష ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా అర్థం చేసుకుందన్నారు.మేనిఫెస్టో హామీని నిలబెట్టుకోవాలి.అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఇచ్చిన 'సీపీఎస్ రద్దు పాత పెన్షన్ పునరుద్ధరణ' హామీని ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.నవంబర్ 17న మాస్ క్యాజువ్ లీవ్ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ప్రకటించిన నవంబర్ 17వ తేదీని మేనిఫెస్టో డేగా పాటించాలని యూనియన్ నిర్ణయించింది. ఆరోజున రాష్ట్రవ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులంతా సామూహిక సెలవు పాటించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాత పెన్షన్ సాధన కోసం జరిగే ఈ చారిత్రాత్మక పోరాటంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వానికి ఉద్యోగుల ఐక్యతను చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు మెరుగు రమేష్, ఎదుల మహేష్,సంద వెంకటేష్, నూనావత్ రాజేష్, బొమ్మెల ప్రీతి, తిరుపతి, సూర్య తేజ, సంజన తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు : కలెక్టర్

**పెద్దపల్లి, సెప్టెంబర్-01 (వుదయం ప్రతినిధి)**



ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష హెచ్చరించారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని వివిధవిభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.చిన్నపిల్లల వార్డు, గర్భిణీల వార్డు, ఎక్స్‌రే గది, ఔట్‌పేషెంట్ విభాగం, చికిత్స విభాగం, డెంటల్ విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్స్ తదితర అన్ని విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, వారి సహాయకుల నుంచి కలెక్టర్ నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వైద్యం, మందుల లభ్యత, పారిశుధ్యం, సిబ్బంది వ్యవహారశైలిపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ఎన్టీపీసీ, చెన్నూరు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వైద్యం కోసం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతిఒక్కరికి నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నారనే ఫిర్యాదులు తరచుగా వస్తున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రోగుల నుంచి స్వీకరించిన ఫీడ్‌బ్యాక్‌ను పరిశీలించి, ఫిర్యాదులు నిజమని తేలితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి ఎలాంటి రూపంలోనూ డబ్బులు ఆశించరాదని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు. రోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం, ఆశించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు.పారిశుధ్య సిబ్బంది తమ పనితీరును మార్చుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై కూడా రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిని విధుల నుంచి వెంటనే తొలగించేలా చర్యలుతీసుకుంటామనిస్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవల నాణ్యత, రోగుల సంతృప్తిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిజిహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాంకిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ నితికా పంత్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

కొమురం భీ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతి తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, కేసు డైరీలు, స్టేషన్ పరిసరాలు, సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేసిన వివరాలు తదితరాలను ఎస్పీ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును వేగవంతం చేసి నిర్ణీత సమయంలో కేసులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను చట్టపరంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పోలీస్ శాఖ అందుబాటులో ఉండేలా పనిచేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. అలాగే మహిళలు, చిన్నారుల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా భద్రతకు ప్రాధాన్యతనిస్తూ విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్, అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

# కేసీఆర్ నామస్మరణ మాని ఇచ్చిన హామీలు అమలు చేయండి

**ప్రతిపక్ష నేతగా కేసీఆర్ దిశానిర్దేశంలోనే ప్రజా పోరాటాలు**

**ఆర్ఎస్ కట్టిన బ్రిడ్జిలకు రిబ్బన్ కటింగ్ తప్ప రేవంత్ చేసిందేమీ లేదు**

**మూసి పై కట్టిన బ్రిడ్జి ప్రారంభం చేసి మూసి కంటే కంపుగా రేవంత్ రెడ్డి బాష ఉంది**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి..**

**నిజామాబాద్:**



ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నిత్యం కేసీఆర్ నామస్మరణ, ఆయనపై విమర్శలు చేయడం మాని, ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి సారించాలని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీ వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో హితవు పలికారు. కేసీఆర్ గారు ప్రజలకు ఏమీ చేయలేదని, రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శనమని మండిపడ్డారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూసీ నదిపై తాము నిర్మించిన వంతెనను నిన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారని, కేవలం రిబ్బన్ కటింగ్‌లు చేస్తూ బీఆర్ఎస్ పనులను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నం చేస్తున్నారని వేముల ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.అభివృద్ధి గురించి మాట్లాడకుండా అక్కడ కూడా మూసి కంటే కంపు నోరుతో కేసీఆర్‌పై విషం కక్కేందుకే సమయం కేటాయించారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి నాయకత్వంలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తున్నామని వేముల స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ గారు 100% సంపూర్ణ బాధ్యతతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ గారి మేధోమథనం, వ్యూహాత్మక దిశానిర్దేశం ప్రకారమే పార్టీ నేతలు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ ఎండగడుతోందని వేముల అన్నారు..ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యుల అవినీతి, భూ ఆక్రమణలపై నిరంతరం పోరాటం సాగిస్తున్నాం. 'హైడ్రా' పేరుతో సాగిస్తున్న అరాచకాలు, మూసీ ప్రక్షాళన పేరుతో జరుగుతున్న భారీ అవినీతిని ప్రశ్నిస్తున్నాం. లగచర్లలో రైతుల భూములను అన్యాయంగా లాక్కోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ప్రతిష్టాత్మక ఫార్మాసిటీని రద్దు చేసి, 'ఫ్యూచర్ సిటీ' పేరుతో 14,000 ఎకరాల విలువైన భూములను అమ్ముకునేందుకు జరుగుతున్న కుట్రలను ప్రజల ముందు ఉంచుతున్నాం..మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మిత వెల్లడించిన రూ.200 కోట్ల భూ ఆక్రమణల ఉదంతంతో సహా కాంగ్రెస్ నాయకుల అక్రమాలను నిలదీస్తున్నాం. నిరుద్యోగులు, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై అండగా నిలబడి పోరాడుతున్నాం. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ప్రతిపక్షాలపై నిరాధార ఆరోపణలు, దూషణలు మాని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపాలని డిమాండ్ చేశారు.
నిత్యం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుంటే, ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పి మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని బలపరుస్తారని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు



## నూతన పెన్షన్ విధానం రద్దు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- **భోజన విరామంలో నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన - మేనిఫెస్టో హామీని అమలు చేయాలని డిమాండ్**

**నాగర్ కర్నూల్ (సెప్టెంబర్ 01):**

నూతన పెన్షన్ విధానం అమలుపరచబడిన తేదీ అయిన సెప్టెంబర్ 1ను పురస్కరించుకొని మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ముందు ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ ఉద్యోగుల రాజ్యాంగబద్ధ హక్కు అని, CPS రద్దు OPS ముద్దు అందుకే OPS అమలు చేయాలని నినాదాలు చేశారు. టీజీవో పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా నేడు "పెన్షన్ విద్రోహ దినం" పాటిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని వెంటనే CPS రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు.దేశంలో 1 జనవరి 2004 నుంచి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో 1 సెప్టెంబర్ 2004 నుంచి నూతన పెన్షన్ విధానం అమలులోకి వచ్చిందని, ప్రభుత్వ ఉత్తర్వులు 653, 654 తేదీ 22.09.2004 ద్వారా మార్గదర్శకాలు విడుదల చేశారని గుర్తు చేశారు. నూతన పెన్షన్ వల్ల ఉద్యోగ విరమణ తర్వాత తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి ప్రకాష్, టీజీవో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి యూనుస్, పబ్లిసిటీ కార్యదర్శి రాజేశ్వర్, ఎస్కే షఫీ, నరేందర్ గౌడ్, తస్లిన్, హిఫ్జా, ఖుర్షిద్, శిరీష, సత్యం, మంజుల, రాజయ్య, శుకారం, కిరణ్, కృష్ణయ్య, బాలేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలి





- **ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఫౌండేషన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి**
- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 01:-వుదయం:**

పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు కష్టపడి చదువుతూ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాలను తప్పకుండా సాధించగలరని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, స్టడీ మెటీరియల్, ఇతర సదుపాయాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్లో గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్4, ఆర్ఆర్బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించి ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పోటీ పరీక్షకు పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారని, అందువల్ల పోటీని చూసి నిరుత్సాహ పడకుండా పూర్తి ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాలెడ్జ్‌ను పెంపొందించుకోవడంతో పాటు ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని కేటాయించి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అన్నారు.జీవితంలో ప్రతి రంగంలోనూ సమస్యలు, సవాళ్లు ఉంటాయని, వాటిని అధిగమించే మన దృక్పథంపైనే వాటి ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. సమస్యలను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించే వరకు నిరంతరంగా కృషి చేయాలని, విజయం సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని అన్నారు.అనంతరం కలెక్టర్ బీసీ స్టడీ సర్కిల్‌లోని క్లాస్‌రూమ్‌లు, స్టడీ మెటీరియల్, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, అధ్యయన వాతావరణాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందేలా చూడాలని, అవసరమైన స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని, స్టడీ సర్కిల్‌లో సదుపాయాలను మరింత మెరుగుపరచాలని నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.ఈ ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్షల విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన మరియు అంశాల్లో అవసరమైన మార్గదర్శకత్వం లభించనుందని బీసీ సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

### చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని

## కరపత్రాలతో ఇంటింటి ప్రచారం

**నారాయణపేట సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా చేనేత సొసైటీలో జరుగుతున్న అక్రమాలను బయటికి తీసేందుకు అఖిలపక్షం నాయకులు మంగళవారం కరపత్రాలతో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సొసైటీలో జరిగిన 51కోట్ల అక్రమ లావాదేవీలపై విచారణ చేపట్టాలని ఈ నెల 9న జిల్లా కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని వారు ఇంటింటి ప్రచారంలో కోరుతున్నారు.చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సొసైటీలో జరిగిన 51 కోట్ల అక్రమ లావాదేవీలపై విచారణ చేపట్టాలని, సొసైటీలో అర్హులైన చేనేత కార్మికులందరికీ సభ్యత్వం కల్పించాలని కోరుతూ సెప్టెంబర్ 9న అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరుగనున్నా కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం, చేనేత కార్మిక సంఘం సీనియర్ నాయకులు కెంచె నారాయణ, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు దాసరి అశోక్, తెలుగుదేశం పాలమూరు పార్లమెంటరీ నియోజకవర్గం నాయకులు రాఘవరావు చౌదరి ఉన్నారు.రాజ్యాధికారా పార్టీ రాష్ట్ర కార్యదర్శి శివవీరారెడ్డి,పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు డాక్టర్ క్యాతన్ రఘు, శకుంతాలి పట్టణ అధ్యక్షులు జ్వారం జగన్ రమేష్, పట్కార్ పట్టణ అధ్యక్షులు నాగేందర్ రావు మిస్సెన్ తదితరులు ఉన్నారు.చేనేత కార్మికుల సంక్షేమం కోసం జరుగుతున్న ఈ ధర్నాకు ప్రజలందరి మద్దతు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాజ్యాధికారపార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు కృష్ణ మదివాలు, సిపిఎం జిల్లా నాయకులు కే కాశప్ప, పట్టణ నాయకులు సోఫే మజార్ హుస్సేన్ తెలుగు దేశం సీనియర్ నాయకులు యాజన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- **అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి**
- **మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి**
- **అధికారులతో సమన్వయ సమావేశంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు**

**గద్వాల, సెప్టెంబర్ 01 (వుదయం బ్యూరో)**



గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు, పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో గణేష్ ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. డివిజన్, మండల స్థాయిలో ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి నిబంధనలు, భద్రతా చర్యలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు విద్యుత్ శాఖ నుంచి సేఫ్టీ సర్టిఫికేషన్ పొందేలా చూడాలన్నారు. నిమజ్జనానికి విగ్రహాలను తరలించే సమయంలో రహదారులపై వేలాడుతున్న విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తా నుంచి నది అగ్రహారం వెళ్లే మార్గంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలన్నారు. జిల్లాలోని బీచుపల్లి, నది అగ్రహారం వద్ద కృష్ణానదిలో పెద్ద సంఖ్యలో విగ్రహాల నిమజ్జనం జరగనున్నందున ముఖ్యమైన రోజుల్లో క్రేన్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవసరమైన లైటింగ్, భారీ కేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారుల్లో గుంతలు, గతుకులు లేకుండా మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.నిమజ్జనం రోజుల్లో నిర్దేశిత సమయాల్లో మద్యం దుకాణాలు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి గొడవలకు అవకాశం లేకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత మైక్ శబ్దాలు ఉండకూడదని, ముఖ్యంగా ఆసుపత్రులు, విద్యాసంస్థల సమీపంలో డీజే సౌండ్స్‌కు అనుమతి లేకుండా చూడాలని స్పష్టం చేశారు.మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు తదితర సౌకర్యాలను సమకూర్చాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు.

**కట్టుదిట్టమైన భద్రతా చర్యలు: ఎస్పీ**

ఎస్పీ శ్రీనివాసరావుమాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. బీచుపల్లిలోని కృష్ణానది వద్ద నిమజ్జనం కోసం జిల్లా నుంచే కాకుండా వనపర్తి, కర్నూలు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలు తరలివస్తాయని, అందుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ రహదారిపై పలుచోట్ల రోడ్డు పనులు జరుగుతున్నందున ప్రమాదాల నివారణకు సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూపుల ద్వారా ఉత్సవాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట అభివృద్ధి పనులపై కలెక్టర్ కె. హైమావతి సమీక్ష



**సిద్దిపేట, సెప్టెంబర్ 1 (వుదయం ప్రతినిధి)**

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, వివిధ భవన నిర్మాణాలు మరియు చేయూత పెన్షన్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా నిర్దేశించుకున్న q17.60 లక్షల మొక్కల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 14.63 లక్షల (83%) ప్లాంటేషన్ పూర్తయిందని, మిగిలిన 100% ప్లాంటేషన్‌తో పాటు నాటిన ప్రతి మొక్కకూ జియో టాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. జలసిరి కార్యక్రమంలో పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో ఫామ్‌పాండ్స్ ఏర్పాటుకు రైతులను గుర్తించి పనులు వెంటనే ప్రారంభించాలని, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ ప్రాముఖ్యతను రైతులకు వివరించాలని తెలిపారు. పంచాయతీ, స్కూళ్లు, తహసిల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాలకు ఎస్టిమేట్లు వేసి తక్షణమే ఏర్పాటు చేయాలని ఏపీఓలను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మొదటి విడతలో మంజూరై రూఫ్ లెవెల్ పనుల్లో ఉన్న నిర్మాణాలను ఈ నెల 15 నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని, మార్కౌట్ కాని పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓలకు సూచించారు. నిర్మాణాలు ఆలస్యమవుతుంటే స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి పూర్తి చేయించాలని, రెండో విడత లబ్ధిదారుల క్షేత్రస్థాయి గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్‌ను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, ఎస్హెచ్‌జీ భవనాల పనులను సర్పంచ్‌లు, పాలకవర్గంతో సమావేశమై వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చేయూత పెన్షన్లకు సంబంధించి డెత్ మార్కింగ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి క్లోజ్ చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ/ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ రమేష్, డీపీఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పీడీ భగవంత్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట అభివృద్ధి పనులపై కలెక్టర్ కె. హైమావతి సమీక్ష

**సిద్దిపేట, సెప్టెంబర్ 1 (వుదయం బ్యూరో)**

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుండి వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, వివిధ భవన నిర్మాణాలు మరియు చేయూత పెన్షన్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా నిర్దేశించుకున్న q17.60 లక్షల మొక్కల లక్ష్యానికి గాను ఇప్పటివరకు 14.63 లక్షల (83%) ప్లాంటేషన్ పూర్తయిందని, మిగిలిన 100% ప్లాంటేషన్‌తో పాటు నాటిన ప్రతి మొక్కకూ జియో టాగింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని ఎంపీడీఓలను ఆదేశించారు. జలసిరి కార్యక్రమంలో పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో ఫామ్‌పాండ్స్ ఏర్పాటుకు రైతులను గుర్తించి పనులు వెంటనే ప్రారంభించాలని, బోర్‌వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ ప్రాముఖ్యతను రైతులకు వివరించాలని తెలిపారు. పంచాయతీ, స్కూళ్లు, తహసిల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాల్లో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, ఇంకుడు గుంతల నిర్మాణాలకు ఎస్టిమేట్లు వేసి తక్షణమే ఏర్పాటు చేయాలని ఏపీఓలను ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మొదటి విడతలో మంజూరై రూఫ్ లెవెల్ పనుల్లో ఉన్న నిర్మాణాలను ఈ నెల 15 నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని, మార్కౌట్ కాని పనులను వెంటనే ప్రారంభించాలని ఎంపీడీఓలకు సూచించారు. నిర్మాణాలు ఆలస్యమవుతుంటే స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి పూర్తి చేయించాలని, రెండో విడత లబ్ధిదారుల క్షేత్రస్థాయి గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్‌ను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. అలాగే అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, ఎస్హెచ్‌జీ భవనాల పనులను సర్పంచ్‌లు, పాలకవర్గంతో సమావేశమై వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చేయూత పెన్షన్లకు సంబంధించి డెత్ మార్కింగ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి క్లోజ్ చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ/ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ రమేష్, డీపీఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పీడీ భగవంత్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా వైద్యాధికారి

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 01(వుదయం ప్రతినిధి)**



జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు ప్రతి నెల మొదటి మంగళ వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో నిర్వహించే ఆశ డే కార్యక్రమంప్రాథమిక ఆరోగ్య కేంద్రం నవాబ్ పేట ను సందర్శించి మంగళవారం సమీక్షించారు. ఈ నెలలో చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాల అంశము పై డా. ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ చిన్నపిల్లలో ప్రణాంతక వ్యాధుల నివారణ, దీని ద్వారా శిశు మరణాలను తగ్గించి ఆరోగ్య కరమైన బాల్యమును అందించుటకు పిల్లలకు పుట్టినప్పటి నుంచి 16సం వత్సరాల వరకు నిర్దేశించిన సమయాలలో టీకాలు వంద శాతం ఇవ్వాలని ఆదేశించారు.అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, పొగాకు, డ్రగ్స్ మొదలగు వ్యసనాలవలన అధిక రక్త పోటు, మధుమేహం, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వయికల్ క్యాన్సర్ లు 30సం. ల పై బడిన వారికి ఎక్కువగా వస్తున్నాయి. కావున ముందుగానే పరీక్షించి, చికిత్సపొందేవిధంగా అందరు కలిసి పనిచేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నివారణకై పరిసరాల పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అంతకు ముందు ప్రాథమిక ఆరోగ్య కేంద్రములోని ల్యాబ్ ను, ఫార్మసీని, వాక్సిన్ నిల్వలను, రికార్డులను పరిశీలించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రములో సాధారణ ప్రసవాలు పెంచాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డా. శ్రావణ్ కుమార్,హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహా డీపీవో సీతరామ్ గౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- **అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి**
- **ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్, ఎస్పీ**

**గద్వాల, సెప్టెంబర్ 01 (వుదయం కరస్పాండెంట్)**

గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

నిమజ్జనం రోజుల్లో నిర్దేశిత సమయాల్లో మద్యం దుకాణాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి గొడవలకు అవకాశం లేకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత మైక్ శబ్దాలు ఉండకూడదని, ముఖ్యంగా ఆసుపత్రులు, విద్యాసంస్థల సమీపంలో డీజే సౌండ్స్‌కు అనుమతి లేకుండా చూడాలని స్పష్టం చేశారు.శానిటేషన్, తాగునీరు, అత్యవసర వైద్య సేవలు తదితర ఏర్పాట్లను సంబంధిత శాఖలు పకడ్బందీగా చేపట్టాలని, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

**భద్రతకు ప్రత్యేక చర్యలు: ఎస్పీ**

జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. బీచుపల్లిలోని కృష్ణానది వద్ద నిమజ్జనానికి జిల్లా నుంచే కాకుండా వనపర్తి, కర్నూలు, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలు తరలివస్తాయని, అందుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై పలుచోట్ల రోడ్డు పనులు కొనసాగుతున్నందున ప్రమాదాలు జరగకుండా సూచికలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. వివిధ శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూపుల ద్వారా ఉత్సవాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లు, హెల్ప్‌లైన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావుతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెద్దదగడ గ్రామంలో అంగరంగ వైభవంగా పోచమ్మ బోనాల మహోత్సవం

- **భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ**
- **పెద్దదగడ గ్రామ సర్పంచ్ ఉడతల భాస్కర్**

**చిన్నంబావి మండలం 01 ( వుదయం ప్రతినిధి )**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో గ్రామ దేవత శ్రీ పోచమ్మ తల్లి బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా గ్రామం మొత్తం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ, వేపాకులు, పూలతో బోనాలను సుందరంగా అలంకరించారు. అనంతరం మహిళలు బోనాలను తలపై ఎత్తుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకున్నారు. డప్పుల దరువులు, వాయిద్యాలు, భక్తుల కీర్తనలు, యువత కేరింతలతో పెద్దదగడ పురవీధులు మార్మోగాయి. బోనాల ఊరేగింపులో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఆలయానికి చేరుకున్న భక్తులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉండాలని, గ్రామంలో శాంతి నెలకొనాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. తమ మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఉడతల భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సంప్రదాయ బద్ధంగా నిర్వహించే పోచమ్మ బోనాల మహోత్సవం గ్రామ ప్రజల ఐక్యతకు, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.







భక్తి సంప్రదాయం సంబరాల కలయిక పెద్దదగడ గ్రామంలో జరిగిన పోచమ్మ బోనాల మహోత్సవం భక్తి, సంప్రదాయం, గ్రామీణ సంస్కృతుల సమ్మేళనంగా నిలిచింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. మహిళల బోనాల ఊరేగింపు, దప్పుల దరువులు, ప్రత్యేక పూజలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. "అమ్మా పోచమ్మ తల్లీ మా గ్రామాన్ని చల్లగా చూడు" అంటూ భక్తులు చేసిన ప్రార్థనలతో పెద్దదగడ గ్రామం మార్మోగింది.

## ఎస్ఆర్ఐ నోటీసులపై విచారణ.. ఓటర్ల వివరాల సేకరణ

- **నోటీసులు అందుకున్న వారికి ఇయరింగ్ నిర్వాహన కార్యక్రమంలో పాల్గొన్న తాండూరు తహసీల్దార్ తారా సింగ్,**
- **గ్రామ సర్పంచ్ జన్నే సృజన మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**తాండూర్ నవంబరు 01 వుదయం ప్రతినిధి**

తాండూరు: తాండూరు మండల పరిధిలోని గౌతాపూర్, ఎల్మాకన్య, శనిగేశ్‌పూర్, గోనూర్, వీరిశెట్టిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎస్ఆర్ఐ సర్వేకు సంబంధించి నోటీసులు అందుకున్న వారికి తహసీల్దార్ తారా సింగ్ ఆధ్వర్యంలో ఇయరింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఇయరింగ్‌కు హాజరై తమకు సంబంధించిన పేరు, చిరునామా, ఓటరు వివరాలు, నివాసానికి సంబంధించిన సమాచారం, అభ్యంతరాలు, ఆధారాలు తదితర వివరాలను అధికారులకు అందజేశారు. అధికారులు ఓటర్ల నుంచి వివరాలను స్వీకరించి, వారి అభ్యంతరాలు మరియు సమర్పించిన ఆధారాలను పరిశీలించారు.

ఎస్ఆర్ఐ సర్వేలో భాగంగా నోటీసులు జారీ చేసిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హతకు సంబంధించిన అంశాలను నిబంధనల ప్రకారం నిర్ధారించేందుకు ఇయరింగ్ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్లు తమకు సంబంధించిన సరైన వివరాలు, అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు.

ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, వివరణలను నమోదు చేసి తదుపరి ప్రక్రియను నిబంధనల ప్రకారం కొనసాగించనున్నట్లు తహసీల్దార్ తారా సింగ్ తెలిపారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి నోటీసులు అందుకున్న ఓటర్లు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో గౌతాపూర్ గ్రామ సర్పంచ్ జన్ను సుజనా పాల్గొని ఇయరింగ్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఓటర్లకు అవసరమైన సహకారం అందించారు. మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు జన్న నాగప్ప, గ్రామ వార్డు సభ్యులు ప్రజలు పాల్గొన్నారు



## ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

**బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**భద్రాచలం, సెప్టెంబర్ 1: (వుదయం ప్రతినిధి)**

భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ తెల్లం వెంకట్రావుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అనుచిత, అసత్య, నిరాధార వ్యాఖ్యలను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ నల్లపు దుర్గాప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్మాణాత్మక విమర్శలకు స్థానం ఉందని, అయితే వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామల సీత, సీనియర్ నాయకులు చీమలపాటి మురళీకృష్ణ, ఆవుల పుల్లారావు, రాము, పొగాకు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

**పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, గణేష్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఐటీసీ, సింగరేణి, ఎక్సైజ్, విద్యుత్, నీటిపారుదల, మున్సిపల్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గణేష్ మండపాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. గణేష్ మండలి నిర్వాహకులు మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను ముందుగానే అధికారులకు అందించాలని, తద్వారా వివిధ శాఖల మధ్య సమన్వయంతో ఉత్సవాలను సజావుగా నిర్వహించేందుకు వీలవుతుందని తెలిపారు.

**ఉత్సవ కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు**

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల పరిధిలో గణేష్ ఉత్సవాల నిర్వాహణపై పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా కోసం విద్యుత్ శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాదాలకు తావులేకుండా విద్యుత్ అధికారులు మండపాల్లో భద్రతా ఆడిట్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగలకుండా తగిన ఎత్తులో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని, మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, అధికార యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించి, విగ్రహాల తరలింపునకు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. నిమజ్జన మార్గాల్లో అవసరమైన రోడ్డు మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు ముందస్తుగా రవాణా శాఖ నుంచి ధ్రువీకరణ పొందాలని తెలిపారు.



ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేరకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, నిమజ్జనం సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా భక్తి గీతాలు మాత్రమే వినిపించాలని, అన్ని మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడకుండా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మేయర్ బుర్రి చైతన్య పుట్టినరోజు వేడుకలు



- **మంత్రి క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్**
- **ఎమ్మెల్సీ శంకర్ నాయక్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**

**నల్గొండ జిల్లా**
**వుదయం వార్త ప్రతినిధి సెప్టెంబర్ 1**

నల్లగొండ పట్టణ కేంద్రంలో నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తొలి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం శ్రీనగర్ కాలనీలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేయగా ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు మేయర్ కు పూలబొకే అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి వారి కుటుంబమంతా ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్,నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ జెడ్పిటిసిలు గుమ్మల మోహన్ రెడ్డి, వంగూరి లక్ష్మయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి, మారగోని నవీన్ గౌడ్, సమద్, అల్లి మల్లికార్జున్ యాదవ్, ఖయ్యూం బేగ్, ఆలకుంట్ల నాగరాజు, ఇంతియాజ్, పాలకుంట్ల నాగరత్నం రాజు, రేగట్టే లింగస్వామి గౌడ్, ఇబ్రహీం, గుండెబోయిన పుష్పలత వెంకన్న యాదవ్, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్, మామిడి కార్తీక్, ఇర్ఫాన్, వజ్జ రమేష్ యాదవ్, అల్లి మల్లికార్జున్ యాదవ్, పాలకూరి సుమలత సంతోష్, ప్రదీప్ నాయక్, చిన్నాల జానయ్య, నంద్యాల వీర బ్రహ్మానందరెడ్డి, సంకు ధనలక్ష్మి , పాదం అనిల్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, వంగాల అనిల్ రెడ్డి, కంచర్ల ఆనంద్ రెడ్డి, పెరిక చిట్టి తో పాటు పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ, యువజన యువ నాయకులు కార్యకర్తలు అభిమానులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అబ్కారి శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం



**ఈత మొక్కలు నాటి వాటి ప్రాధాన్యత పై అవగాహన కల్పించిన ఎక్సైజ్ అధికారులు**

**దమ్మపేట, సెప్టెంబర్ 01 (వుదయం ప్రతినిధి)**

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కోమల చెరువు కట్టపై మంగళవారం మొక్కలను నాటిన దమ్మపేట గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు మరియు ఉపాధి హామీ కూలీలు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ హలవత్ బిచా నాయక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక గీత కార్మికుల జీవనోపాధిని పెంపొందించే ఉద్దేశ్యంతో ప్రతీ సంవత్సరం తాటి, ఈత, ఖర్జూరం మొక్కలను వర్షకాలంలో నాటే కార్యక్రమం చేపడుతామని తెలియజేశారు. సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు మాట్లాడుతూ గీత కార్మికుల జీవన వృత్తి అయిన కల్లు తీసే చెట్లను పెంచి భవిష్యత్తులో గౌడ కుల వృత్తి నమ్ముకున్న వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా చెరువు కట్టలపై ఈత, తాటి చెట్ల వేళ్లు బలంగా పాతుకు పోవడం వలన చెరువు కట్టలు కోతకు గురికాకుండా బలంగా ఉంటాయి అన్నారు. వన మహోత్సవం లో భాగంగా పచ్చదనాన్ని పెంచే మొక్కలను సంరక్షించడం మన పర్యావరణానికి మరియు మన మనుగడకు ఎంతో అవసరం అన్నారు. గ్రామస్తులు చిన్నశెట్టి యుగంధర్ మాట్లాడుతూ మొక్కలను నాటడం తో పాటు వాటిని సక్రమంగా సంరక్షించి, పెద్దవిగా పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలి అన్నారు, చెరువు కట్ట పై మొక్కలు పెరగడానికి పొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలి అని పంచాయతీ సిబ్బందికి, అధికారులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, కార్యదర్శి బండి అనంత్ కుమార్, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, రూపా రాంబాబు, బత్తుల సాయి, పసుమర్తి కుసుమాంబ, రామభద్రం, చిన్నశెట్టి నాగలక్ష్మి ముక్తేశ్వరరావు, మధు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, ధర్మసోతు నరేష్, , పర్సా రామేశ్వరరావు, ఆబ్కారీ సిబ్బంది రాణా, పంచాయతీ సిబ్బంది వెంకటేష్, సింగ్, సాయి పాల్గొన్నారు.



## 8 వ వార్డ్ అభివృద్ధికి కృషి చేస్తా

**యాదాద్రి భువనగిరి, వుదయం**

ఈరోజు 8 వార్డ్ లోని ఓల్డ్ రామ్ నగర్ మరియు సీతానగర్ వచ్చే ఆదివారం బోనాల కార్యక్రమం విజయవంతం కావాలని శానిటేషన్ మరియు విధి దీపాలు మరియు వివిధ కార్యక్రమాలు గౌరవ ఎమ్మెల్యే గారి ఆదేశాలను సార్ మరియు గౌరవ చైర్ పర్సన్ అన్ని ఏర్పాట్లు ఘనంగా చేయాలని మున్సిపల్ మరియు ఉన్నత అధికారులు మరియు బస్తీలో పర్యటించి వివిధ సమస్యల మీద అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది ఈ కార్యక్రమంలో 8వ వార్డ్ కౌన్సిలర్ మున్సిపల్ ఏఈ మరియు శానిటరీ ఇన్స్పెక్టర్ జాఫర్ గారు రజిత గారు ఎలక్ట్రికల్ ఇన్స్పెక్టర్ సమీ గారు ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ లైన్ మెన్ శ్రీనివాస్ అందరూ పాల్గొని బోనాల కార్యక్రమం విజయవంతం కావాలని అధికారులను ఆదేశాలు ఇవ్వడం జరిగింది.

## పది రోజుల్లో పందుల సంచారాన్ని కట్టడి చేయాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత, కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇజ్రాయిల్ పాల్**

**మధిర, సెప్టెంబర్ 1:**



మధిర మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇళ్ల మధ్య, ప్రధాన రహదారులపై పందులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్పందించిన మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత గారు, మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇజ్రాయిల్ పాల్ గారు మంగళవారం చర్యలకు శ్రీకారం చుట్టారు.మున్సిపల్ కార్యాలయంలో పందుల పెంపకందారులు, యజమానులను పిలిపించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పందులను ఇళ్ల మధ్య, రోడ్లపై విచ్చలవిడిగా వదిలేయడం వల్ల ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారులు, చైర్ పర్సన్ వారికి వివరించారు.పది రోజుల్లోగా పందుల సంచారాన్ని పూర్తిగా కట్టడి చేయాలని, లేనిపక్షంలో మున్సిపల్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని చైర్ పర్సన్ సామినేని సుజాత, కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇజ్రాయిల్ పాల్ హెచ్చరించారు.దీంతో పందుల యజమానులు స్పందిస్తూ, పది రోజుల్లో పందులను కట్టడి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని రాతపూర్వకంగా హామీ పత్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత గారికి, కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇజ్రాయిల్ పాల్ గారికి అందజేశారు.ప్రజల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, రహదారులపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా మున్సిపాలిటీ పరిధిలో పందుల సంచారాన్ని నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## కట్టకోమ్ముగూడెం జంక్షన్.. ప్రాణాలతో చెలగాటం!

- **అండర్‌పాస్,సర్వీస్ రోడ్డు కోసం ప్రజల ఆక్రందన**
- **ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్**

**చిలుకూరు, సెప్టెంబర్ 01:( వుదయం )**



మండలం లోని రామాపురం కట్టకోమ్ము గూడెం జంక్షన్ ప్రజలకు యమదారిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిని దాటాలంటే ప్రతి క్షణం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందని వారు వాపోతున్నారు. ఈ ప్రమాదకర పరిస్థితుల కారణంగా ఇప్పటికే పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణనష్టం, గాయాలు సంభవించాయని స్థానికులు పేర్కొంటున్నారు.

కట్టకోమ్ముగూడెం జంక్షన్‌ను ఆనుకుని ఉన్న ఈశ్వరరావు వెంచర్ సమీపం నుంచి అండర్‌పాస్ వరకు సుమారు 250 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే హైవేను నేరుగా దాటాల్సిన అవసరం లేకుండా పరిసర గ్రామాల ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించవచ్చని స్థానికులు కోరుతున్నారు.

బాబు నగర్, కట్టకోమ్ముగూడెం (రామాపురం), నరసింహపురం, ఆర్లెగూడెం, కొత్త కొండాపురం, పాత కొండాపురం, చేన్నారిగూడెం, ఆచార్యగూడెం తదితర గ్రామాల నుంచి ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థులు ఆటోల్లో హైవే దాటుతున్న దృశ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయని ప్రజలు అంటున్నారు. జాతీయ రహదారిపై కార్లు, లారీలు, ఇతర భారీ వాహనాలు వేగంగా దూసుకెళ్తుండటంతో రహదారి దాటడం సాహసంగా మారిందని వారు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేకపోవడంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ సమస్యను గతంలో పలుమార్లు ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు తెలిపారు. అండర్‌పాస్ నిర్మాణం కోసం పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం హుజూర్‌నగర్ వైపు ఉన్న అండర్‌పాస్ వరకు వాహనాలు సుమారు ఒక కిలోమీటర్ రాంగ్ రూట్‌లో వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా, ఈశ్వరరావు వెంచర్ సమీపం నుంచి అండర్‌పాస్ వరకు సుమారు 250 మీటర్ల సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన కట్టకోమ్ముగూడెం జంక్షన్ సమస్యపై ప్రజాప్రతినిధులు, జాతీయ రహదారుల అధికారులు, సంబంధిత శాఖలు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకముందే అండర్‌పాస్ నిర్మాణం లేదా తాత్కాలికంగా సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మిర్యాలగూడలో కేటీఆర్ రైతు సభ పక్కా



- **ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆపలేరు: జగదీశ్ రెడ్డి**
- **నీటి సమస్యలపై సర్కార్ నిర్లక్ష్యం పాలమూరు, నల్లగొండకు తీవ్ర అన్యాయం**

**సూర్యాపేట సెప్టెంబర్ 1: వుదయం ప్రతినిధి**

రాష్ట్రంలో నీటి సమస్యలు తీవ్రంగా మారుతున్నా ప్రభుత్వ పెద్దలు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా అవినీతి సొమ్మును లెక్కించే పనిలో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఆరోపించారు. సూర్యాపేటలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం:**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతున్నాయని జగదీశ్ రెడ్డి అన్నారు. కేసీఆర్ అంటే అనుక్షణం భయంతోనే రేవంత్ రెడ్డి రోత మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్‌ను ఎక్కువగా గుర్తు చేసుకునే వారిలో రేవంత్ రెడ్డిదే ప్రథమ స్థానమని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రేవంత్ రెడ్డి సచివాలయానికి ఎన్నిసార్లు వచ్చారో లెక్కలు తీయడానికి సిద్ధమా? అని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. వెలిగొండ ప్రాజెక్టుపై మాట్లాడే దమ్ము ముఖ్యమంత్రికి ఎందుకు లేదని ప్రశ్నించారు. కళ్లముందే నీరు కనిపిస్తున్నా ఆ నీటిని ఆంధ్రా ప్రాంతానికి తరలిస్తుంటే అడ్డుకోలేని పరిస్థితికి ప్రభుత్వ అసమర్థత, అవినీతే కారణమని ఆరోపించారు. తనకు రాజకీయంగా ఎదగడానికి అవకాశం కల్పించిన మహబూబ్‌నగర్ జిల్లాకు రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. పాలమూరు ప్రాంతంలో వలసలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే కారణమవుతున్నాయని ఆరోపించారు. నల్ల గొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా జిల్లా మంత్రులు నోరు మెదపడం లేదని మండిపడ్డారు.

**రేపటి నుంచి పోరుబాట – మిర్యాలగూడలో రైతు సభ పక్కా:**

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై రేపటి నుంచి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట ప్రారంభమవుతుందని ప్రకటించారు. రైతాంగ సమస్యలు, వ్యవసాయ సంక్షోభంపై కేటీఆర్ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో భారీ రైతు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా సభను నిర్వహించి తీరుతామని, రైతుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## కొయ్యూర్ పీహెచ్‌సీలో ఆశా డే కార్యక్రమం



**చర్ల, సెప్టెంబర్ 1: (వుదయం ప్రతినిధి)**

చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆశా ఆరోగ్య కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈ వారం పోషకాహార లోపంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, సమతుల్య ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు అందుతాయని ప్రజలకు వివరించాలన్నారు. అధికంగా మాంసాహారం తీసుకోవడం కంటే సమతుల్య ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 20 నుంచి సెప్టెంబర్ 5 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నేత్రదానం ద్వారా పలువురికి చూపును అందించే అవకాశం ఉంటుందని, ప్రజలను స్వచ్ఛంద నేత్రదానానికి ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప పీహెచ్‌సీలో టీబీ పరీక్షలు చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వం టీబీ రోగులకు ఉచితంగా మందులు అందిస్తోందని, వైద్యుల సూచనల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే టీబీని పూర్తిగా నయం చేసుకోవచ్చని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ, డీఐఓ డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని టీకాలను నిర్ణీత సమయంలో వేయించాలని సూచించారు. ఒక్క టీకా కూడా మిస్ కాకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. పోలియో వంటి తీవ్రమైన వ్యాధుల నియంత్రణలో టీకాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు.



## ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు తెలంగాణ జలసిరి

**చిలుకూరు సెప్టెంబర్ 01:( వుదయం )**

ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృతంగా అమలు చేయాలని. అధికారుల ఆధ్వర్యంలో, మంగళవారం మండల కేంద్రంలో గ్రామంలోని రైతులతో గ్రామ ప్రజలతో భారీ ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ సీఈవో శిరీష, ఎంపీడీవో ముక్కపాటి నరసింహారావు, పాల్గొని, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ . ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొవాలని, ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వీబీ జీ–రామ్ జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడు గుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలు విస్తృతంగా చేపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య, ఏ పీ ఓ నిర్మల, పంచాయతీ కార్యదర్శి షరీపుద్దిన్, యడవల్లి పుల్లారావు,గ్రామ వార్డు సభ్యులు, గ్రామ పంచాయితీ సిబ్బంది వివిధ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు,

## గోపాలపురంలో తాగునీటి సమస్యకు పరిష్కారం



- **నూతన బోరుబావితో పుష్కలంగా ఉబికివచ్చిన జలాలు**
- **సర్పంచ్ నాగభూషణ్, కార్యదర్శి ముక్తేశ్వరరావు, పాలకవర్గం ప్రత్యేక చొరవ**

**దమ్మపేట సెప్టెంబర్ 1 (వుదయం ప్రతినిధి):**

దమ్మపేట మండలం జమేదార్ బంజార్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోపాలపురం గ్రామంలో పదిహేనేళ్లుగా వేధిస్తున్న తాగునీటి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఏళ్ల తరబడి గుక్కెడు నీటి కోసం అల్లాడిన ఆ గ్రామ ప్రజల కష్టాలను పంచాయతీ పాలకవర్గం తమ సంయుక్త కృషితో దూరం చేసింది. యువ సర్పంచ్ ఈశ్వరప్రగడ నాగభూషణ్, పంచాయతీ కార్యదర్శి పాముల ముక్తేశ్వరరావుల పర్యవేక్షణలో, పాలకవర్గ సభ్యుల పూర్తి సహకారంతో చేపట్టిన నూతన బోరు డ్రిల్లింగ్ పనులు విజయవంతం కావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.గోపాలపురం గ్రామంలో తాగునీటి సమస్య దాదాపు 15 సంవత్సరాలుగా ఉంది. గతంలో మూడు పర్యాయాలు బోర్లు వేయించినప్పటికీ చుక్క నీరు రాక విఫలమయ్యాయి. ఊరంతటికీ ఒకే ఒక్క వాటర్ ట్యాంక్ ఉండటం, బోరుల్లో నీరు పడకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిషన్ భగీరథ నీరు అందని సమయాల్లో సమీపంలోని పామాయిల్ తోటల్లోకి వెళ్లి బిందెలతో నీరు తెచ్చుకోవాల్సి వచ్చేది. చాలా సందర్భాల్లో వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడి కాలం వెళ్లదీశారు. ఈ దీర్ఘకాలిక సమస్యను గుర్తించిన సర్పంచ్ ఈశ్వరప్రగడ నాగభూషణ్, కార్యదర్శి ముక్తేశ్వరరావు, పంచాయతీ పాలకవర్గం పక్కా ప్రణాళికతో అడుగులు వేశారు.పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి సరైన పాయింట్‌ను ఎంపిక చేయించి నూతనంగా బోరు బావి వేయించారు. భూగర్భం నుంచి పుష్కలంగా జలాలు ఉబికి రావడంతో అక్కడున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



## వైభవంగా ముత్యాలమ్మ తల్లి విగ్రహాల ఊరేగింపు

**చిలుకూరు సెప్టెంబర్ 01:( వుదయం )**

మండలంలోని నారాయణపురం పాలే అన్నారం గ్రామంలో భక్తి సందడి నెలకొంది, నూతనంగా ప్రతిష్ఠించనున్న శ్రీ ముత్యాలమ్మ తల్లి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో పూర వీధుల్లో మంగళవారం ఊరేగించారు, మంగళ వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ అమ్మవారి విగ్రహాల ఊరేగింపు వైభవంగా సాగింది, ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్న చంద్రశేఖర్, మండవ వెంకటేశ్వర్లు, బుర్ర నరసింహారావు తో పాటు గ్రామ ప్రజలు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను సందర్శించిన జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి



**చర్ల, సెప్టెంబర్ 1: (వుదయం ప్రతినిధి)**

చర్ల మండలం సత్యనారాయణపురం గ్రామపంచాయతీలో జరుగుతున్న ఫారం పాండ్ పనులను జిల్లా పరిషత్ సీఈఓ నాగలక్ష్మి మంగళవారం సందర్శించి పరిశీలించారు. పనుల పురోగతి, నాణ్యతను పరిశీలించి సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు.ఫారం పాండ్ అనేది వ్యవసాయ భూముల్లో వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు ఏర్పాటు చేసే చిన్న నీటి కుంట. వర్షాకాలంలో పొలాల నుంచి వచ్చే నీటిని ఇందులో నిల్వ చేసి, అవసరమైన సమయంలో పంటలకు సాగునీటిగా వినియోగించుకోవచ్చు నని తెలిపారు . భూగర్భ జలాల పెంపునకు, నేలలో తేమను నిల్వ చేసుకోవడానికి ఉపయోగిస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ చిక్కాల గౌతమి, ఎంపీడీవో కె. ఈదయ్య, ఎంపీవో మూర్తి, ఏపీవో సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి హర్షిణితో పాటు ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. ఫారం పాండ్లు ఉపయోగపడతాయి. దీంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు కొంతవరకు తగ్గే అవకాశం ఉంటుందని తెలిపారు.

## ఉత్తమ్ దంపతులను విమర్శించే నైతిక హక్కు బొల్లం మల్లయ్యకు లేదు

- **డబ్బాకొట్టు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలు చేస్తే సహించం**
- **కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే సామేలు ఘాటు వ్యాఖ్యలు**



**మునగాల, సెప్టెంబర్ 01 (వుదయం):**

కోదాడలో ఇటీవల చోటుచేసుకున్న కనకమ్మ డబ్బాకొట్టు వ్యవహారాన్ని అడ్డుపెట్టుకుని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య చేస్తున్న రాజకీయ విమర్శలు, అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మునగాల మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాలే సామేలు ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలే సామేలు మాట్లాడుతూ.. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి దంపతులను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యకు లేదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజలు ఇప్పటికే తిరస్కరించిన రాజకీయాలను మళ్లీ తెరపైకి తీసుకొచ్చి, ఒక చిన్న వివాదాన్ని అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలు చేయడం మల్లయ్యకు తగదన్నారు. అభివృద్ధి పనులు జరుగుతుండటాన్ని చూసి ఓర్వలేకే ప్రభుత్వంపై, ప్రజా ప్రతినిధులపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఇచ్చిన తీర్పు నుంచి కూడా గుణపాఠం నేర్చుకోకుండా మళ్లీ అదే తరహా రాజకీయాలకు పాల్పడటం మల్లయ్య రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. కోదాడ నియోజకవర్గంలో ఇకపై ఇలాంటి వెకిలి రాజకీయాలు, వ్యక్తిగత విమర్శలు కొనసాగిస్తే కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు గ్రామగ్రామాన నిలదీస్తారని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై మాట్లాడాల్సింది పోయి వ్యక్తిగత విమర్శలకు దిగితే ప్రజాక్షేత్రంలోనే తగిన సమాధానం చెబుతామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాసర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిపై మల్లయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రతినిధిని గౌరవించకుండా వ్యక్తిగత దూషణలకు దిగితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రజలు ఎన్నుకున్న నాయకురాలిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. మల్లయ్య తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే మండల కేంద్రం నుంచి డివిజన్ కేంద్రాల వరకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని కాసర్ల కోటేశ్వరరావు హెచ్చరించారు.

# చక్కని ఆరోగ్యం

## సలాడ్‌లను ఒకేసారి పెద్ద మొత్తంలో తీసుకుంటున్నారా.. అయితే జాగ్రత్త..



సలాడ్ అంటే ఆరోగ్యకరమైన ఆహారం అనే అభిప్రాయం చాలామందిలో బలంగా ఉంది. బర్గర్, పాస్తా వంటి ఆహారాలను పక్కన పెట్టి, కూరగాయలతో నిండిన సలాడ్‌ను ఎంచుకోవడం ఆరోగ్యానికి మంచి నిర్ణయమే అనిపిస్తుంది. అయితే కొందరిలో మాత్రం సలాడ్ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, భారంగా అనిపించడం, అసౌకర్యం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. దీనికి కూరగాయలే కారణమని భావించడం సహజం. కానీ అసలు సమస్య సలాడ్‌లోని పదార్థాల కలయిక, అధిక మొత్తంలో పచ్చి ఆహారం తీసుకోవడం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఒక సమతుల్య భోజనంలో శరీరం సులభంగా జీర్ణించుకోగలిగే మోతాదులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, ఫైబర్ ఉండాలి. అయితే సాధారణంగా తీసుకునే చాలా సలాడ్లలో ఫైబర్ ఎక్కువగా, ప్రోటీన్, కేలరీలు తక్కువగా ఉంటాయి. అలాగే ఒకేసారి పెద్ద మొత్తంలో పచ్చి పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ వాటిని జీర్ణం చేసుకోవడానికి ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుంది.

సలాడ్‌లో ఉండే ప్రతి పదార్థం విడివిడిగా చూస్తే ఆరోగ్యకరమైనదే అవుతుంది. కానీ వాటిని ఒకేసారి ఎక్కువ మొత్తంలో కలిపి తినడం వల్ల కొందరిలో కడుపు ఉబ్బరం, గ్యాస్, పొత్తికడుపులో అసౌకర్యం వంటి సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లుగా పిలిచే ఫాడ్‌మాప్‌లు అధికం గా ఉండే కొన్ని ఆహారాలు సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ లక్షణాలను ప్రేరేపిస్తాయి. ఉదాహరణకు పచ్చి ఉల్లిపాయల్లో ఫ్రక్టాన్స్, శనగలు, కిడ్నీ బీన్స్‌లో గ్యాలాక్టో-ఒలిగోశాకరైడ్లు ఉంటాయి. కాలీఫ్లవర్, పుట్టగొడుగుల్లో మన్నిటాల్, యాపిల్స్, డ్రై ఫ్రూట్స్‌లో ఫ్రక్టోజ్, సార్బి టాల్ వంటి పదార్థాలు ఉంటాయి. వీటిలో ఒక్కోటి తక్కువ మోతాదులో ఉన్నప్పటికీ, అన్నింటినీ ఒకే గిన్నెలో కలిపి పెద్ద మొత్తం లో తినడం వల్ల జీర్ణవ్యవస్థపై భారం పెరిగి ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఫైబర్ కడుపులో పేరుకుపోయి కుళ్లిపోతుందనే అభిప్రాయం సరైంది కాదు. అన్ని రకాల ఫైబర్‌లు ఒకే విధంగా జీర్ణవ్యవస్థపై పనిచేయవు. సాధారణంగా సమస్య కేవలం పాలకూర లేదా లెట్యూస్ వల్ల రావడం కాదు. ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు, అధిక మొత్తంలో పచ్చి ఆహారం, ఇప్పటికే సున్నితంగా ఉన్న జీర్ణవ్యవస్థ.. ఇవన్నీ కలిసి ఉబ్బరానికి కారణమయ్యే అవకాశం ఉంటుంది. వారంలో ఎక్కువగా ఫైబర్ తీసుకోని వారు ఒక్కసారిగా పెద్ద గిన్నె నిండా పచ్చి కూరగాయలను తినడం ప్రారంభిస్తే కూడా ఇబ్బంది కలుగుతుంది. ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచడం వల్ల తాత్కాలికంగా కడుపు ఉబ్బరం, అసౌకర్యం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఫైబర్ తీసుకునే అలవాటుకు గట్ మైక్రోబయోమ్ అలవాటు పడటానికి కొంత సమయం అవసరం. అందువల్ల కూరగాయలను పూర్తిగా మానేయడం కంటే, ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని క్రమంగా పెంచడం మంచిది. సలాడ్‌లో ఉపయోగించే డ్రెస్సింగ్‌ను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. మార్కెట్‌లో లభించే కొన్ని బాటిల్ డ్రెస్సింగ్స్‌లో ఉల్లిపాయ పొడి, వెల్లుల్లి పొడి, చికోరి రూట్, ఎమల్సిఫైయర్లు, ప్రిజర్వేటివ్‌లు, షుగర్ ఆల్కహాల్స్ వంటి పదార్థాలు ఉంటాయి. సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఇవి ఉబ్బరం వంటి సమస్యలను కలిగించే అవకాశం ఉంటుంది. డ్రెస్సింగ్‌లో ఉండే కొవ్వు కూడా కడుపు ఖాళీ అయ్యే ప్రక్రియను నెమ్మదింపజేసి, ఎక్కువసేపు కడుపు నిండినట్లు లేదా భారంగా అనిపించేలా చేసే అవకాశం ఉంటుంది.

## 'గులాబీ' లాంటి అందానికి..!




రంగు రంగుల గులాబీలను చూస్తే మనసుకు ఆహ్లాదంగా అనిపిస్తుంది. అయితే సౌందర్య పరిరక్షణలోనూ గులాబీల పాత్ర ఎంతో ఉందంటున్నారు నిపుణులు. అదెలాగో తెలుసుకుందామా?

కళ్ల కింద నల్లటి వలయాల్ని తగ్గించుకోవడానికి గులాబీలను ఉపయోగించవచ్చంటున్నారు నిపుణులు. కొద్దిగా రోజ్‌వాటర్‌ని తీసుకొని అందులో కాటన్‌ను ముంచి కళ్ల కింద మృదువుగా మర్దన చేయాలి. ఇలా కనీసం రెండు రోజులకోసారి చేస్తే మంచి ఫలితం ఉంటుందట. గులాబీ రేకల్లో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు చర్మంపై వచ్చే దురద, మంటను తగ్గిస్తాయంటున్నారు.

గులాబీ మంచి క్లెన్సర్‌గా కూడా పని చేస్తుందట. రోజ్‌వాటర్ మన ముఖంపై ఉన్న జిడ్డుని, పేరుకుపోయిన మురికిని తొలగించి చర్మాన్ని తాజాగా మార్చుతుందట. అంతేకాదు.. గులాబీ రేకల్లోని సహజసిద్ధమైన నూనెలు చర్మాన్ని తేమగా ఉంచేందుకు సహకరిస్తాయని చెబుతున్నారు నిపుణులు. స్నానం చేసే నీటిలో కొద్దిగా రోజ్‌వాటర్ లేదా కొన్ని గులాబీ రేకలను వేసుకుంటే మంచి ఫలితం ఉంటుందంటున్నారు.

గులాబీల్లో ఉండే సహజసిద్ధమైన కండిషనింగ్ గుణాలు జుట్టు ఆరోగ్యానికి మేలు చేస్తాయట. దీనికోసం వాడే షాంపూ లేదా కండిషనర్‌లో కొన్ని చుక్కల రోజ్ వాటర్ కలుపుకొంటే సరి. లేదా గులాబీ రేకల పేస్ట్‌ను జుట్టుకు, కుదుళ్లకు పట్టించి కాసేపయ్యాక తలస్నానం చేస్తే జుట్టు ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాలు సహజసిద్ధమైనవే అయినప్పటికీ.. వాడేముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కిచెన్‌లో వాడే టవల్స్‌ను ఇలా శుభ్రం చేయండి..



కిచెన్ లో వాడే టవల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయడం చాలా ముఖ్యం. డిటర్జెంట్ పౌడర్, బేకింగ్ సోడా, డిష్ సోప్, నిమ్మకాయ, వెనిగర్, ఉప్పు వంటి వాటితో జిడ్డు, మరకలు, దుర్వాసనను సులభంగా తొలగించవచ్చు. ఇంట్లో అత్యంత శుభ్రంగా ఉండాల్సిన ప్రదేశాల్లో వంటగది ఒకటి. అయితే వంటగదిలో మనం తరచూ ఉపయోగించే కిచెన్ టవల్స్‌పై మాత్రం పెద్దగా దృష్టి పెట్టం. చేతులు తుడుచుకోవడం, పాత్రలు ఆరబెట్టడం, కౌంటర్‌పై పడిన నీరు లేదా ఆహార పదార్థాలను తుడవడం వంటి పనులకు వీటిని ఉపయోగిస్తుంటాం. దీంతో టవల్స్ త్వరగా జిడ్డుగా మారడంతో పాటు మరకలు పడతాయి. తేమ కారణంగా దుర్వాసన కూడా వస్తుంది. అందుకే ఇతర కిచెన్ వస్తువుల మాదిరిగానే కిచెన్ టవల్స్‌ను కూడా క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. ఇంట్లోనే సులభంగా ప్రయత్నించగలిగే కొన్ని క్లీనింగ్ పద్ధతుల గురించి నిపుణులు వివరిస్తున్నారు. కిచెన్ టవల్స్‌ను శుభ్రం చేయడానికి సులభమైన మార్గాల్లో డిటర్జెంట్ పౌడర్ ఒకటి. ఒక బేసిన్‌లో వేడి నీటిని తీసుకుని కొద్దిగా డిటర్జెంట్ పౌడర్ కలపాలి. మురికిగా ఉన్న టవల్స్‌ను అందులో సుమారు 30 నిమిషాల పాటు నానబెట్టాలి. ఆ తర్వాత టవల్‌ను చేతులతో సున్నితంగా రుద్ది, గోరువెచ్చని నీటితో బాగా కడగాలి. వీలైతే నేరుగా సూర్యరశ్మి తగిలేలా ఆరబెట్టాలి. ఇక జిడ్డు, మరకలు, దుర్వాసనతో ఉన్న కిచెన్ టవల్స్‌ను శుభ్రం చేయడంలో బేకింగ్ సోడా కూడా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా మసాలా మరకలను తొలగించడానికి కొద్దిగా బేకింగ్ సోడాలో వేడి నీటిని కలిపి మందమైన పేస్ట్‌లా తయారు చేసుకోవాలి. ఈ పేస్ట్‌ను మరక ఉన్న ప్రదేశంలో రాసి సుమారు 20 నిమిషాల పాటు ఉంచాలి. ఆ తర్వాత సబ్బు, నీటితో టవల్‌ను బాగా కడగాలి. టవల్స్‌కు తాజా వాసన రావాలంటే కొన్ని నిమ్మ తొక్కలను నీటిలో మరిగించి, ఆ నీటిలో టవల్స్‌ను కొంతసేపు నానబెట్టి తర్వాత కడగాలి. అలాగే డిష్ సోప్ నూనె, జిడ్డును తొలగించడానికి ప్రత్యేకంగా పనిచేస్తుంది. కాబట్టి జిడ్డుగా మారిన కిచెన్ టవల్స్‌ను శుభ్రం చేయడంలో ఇది ఉపయోగపడుతుంది. మరకలు లేదా జిడ్డు ఉన్న ప్రాంతాల్లో కొద్దిగా లిక్విడ్ డిష్ సోప్‌ను నేరుగా రాసి కొన్ని నిమిషాలు ఉంచాలి. తర్వాత టవల్స్‌ను గోరువెచ్చని నీటిలో సుమారు 20 నిమిషాలు నానబెట్టాలి. అనంతరం బాగా ఉతికి, సోప్ అవశేషాలు లేకుండా శుభ్రంగా కడగాలి. అలాగే నిమ్మకాయ, వెనిగర్ రెండూ ఇంట్లో సహజంగా ఉపయోగించే క్లీనింగ్ పదార్థాలు. వెనిగర్ దుస్తులపై పేరుకున్న మురికి, దుర్వాసనను తొలగించడంలో సహాయపడుతుంది. నిమ్మరసం మొండి మరకలను తొలగించడానికి ఉపయోగపడుతుంది. గోరువెచ్చని నీటిలో డిటర్జెంట్ పౌడర్, నిమ్మరసం, కొద్దిగా వెనిగర్ కలపాలి. అందులో కిచెన్ టవల్స్‌ను సుమారు 20 నిమిషాలు నానబెట్టాలి. ఆ తర్వాత శుభ్రమైన నీటితో బాగా కడిగి ఆరబెట్టాలి. అలాగే కిచెన్ టవల్స్‌లోని జిడ్డు, దుర్వాసనను తగ్గించడానికి ఉప్పును కూడా ఉపయోగించవచ్చు. ఒక పాత్ర లేదా బేసిన్‌లో వేడి నీటిని తీసుకుని అందులో రెండు టేబుల్‌స్పూన్ల ఉప్పు కలపాలి. టవల్స్‌ను సుమారు 30 నిమిషాలు అందులో నానబెట్టాలి. ఆ తర్వాత కొద్దిగా లిక్విడ్ సోప్ వేసి టవల్స్‌ను సున్నితంగా రుద్దాలి. చివరగా శుభ్రమైన నీటితో బాగా కడగాలి. వీటితోపాటు కిచెన్ టవల్స్‌ను క్రమం తప్పకుండా ఉతకాలి. కిచెన్ టవల్స్‌ను ప్రతి రెండు లేదా మూడు రోజులకు ఒకసారి ఉతకడం మంచిది. ఇలా చేయడం వల్ల జిడ్డు, మరకలు, బ్యాక్టీరియా పేరుకుపోకుండా చూసుకోవచ్చు.

## ఇరవైల నుంచే మొదలు..



ప్రస్తుతం అమ్మాయిలు ఎదుర్కొంటోన్న అనారోగ్య సమస్యల్లో హార్మోన్ల అసమతౌల్యత ఒకటి. ఇదివరకు మధ్యవయస్కులైన మహిళల్నే ఇది ప్రభావితం చేసేది. కానీ ఇప్పుడో 20-25 సంవత్సరాల అమ్మాయిలూ దీని బారినపడుతున్నారట. ఇదంతా ఆధునిక జీవనశైలి ప్రభావమే అంటున్నారు నిపుణులు. పైగా, జీవనశైలి సంబంధిత వ్యాధులు యువతలోనే ఎక్కువగా పెరుగుతున్నాయని చెబుతున్నాయి చాలా అధ్యయనాలు. పీసీఓఎస్ కూడా అందులో భాగమే. 'పీసీఓఎస్ సొసైటీ ఆఫ్ ఇండియా' అధ్యయనాల ప్రకారం ప్రతి ఐదుగురు భారతీయ మహిళల్లో ఒకరు ఈ సమస్యతో బాధపడుతున్నారు. భోజన వేళలు పాటించకపోవడం. ప్రొటీన్ల లోపం, దీర్ఘకాలిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, నిద్రలేమి... వంటివి దీనికి కారణాలు. ఇవన్నీ చాలవన్నట్లు సామాజిక మాధ్యమాల ప్రభావమూ దీనికి తోడవుతోంది. ఇప్పటికైనా మించి పోయింది లేదు. పిల్లల ఆహారం, నిద్ర, జీవనశైలి అలవాట్లమీద కాస్త దృష్టి సారించమని హెచ్చరిస్తున్నారు నిపుణులు. పాటిస్తారుగా మరి!

## మొటిమలు తగ్గాలంటే..!

చర్మ ఆరోగ్యం మనం తీసుకునే ఆహారం పైన కూడా ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా ఈ ప్రభావం ముఖం పైన ఎక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. దీనికి ఉదాహరణే మొటిమల సమస్య. ఎంత అందమైన ముఖానికైనా వన్నె తగ్గించే సమస్య ఇది. అందుకే వీటిని తగ్గించేందుకు ఆహారం విషయంలోనూ జాగ్రత్తగా ఉండాలంటున్నారు నిపుణులు.

ముఖంపై మొటిమలు రావడానికి కారణమయ్యే సీబమ్ ఉత్పత్తిని అరికట్టే సామర్థ్యం ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాల్లో ఉంటుందట. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికే కాదు, మొటిమలను తగ్గించడంలోనూ ఈ ఆమ్లాలు సమర్థంగా పనిచేస్తాయట. చేపలు, ఆకుకూరలు, వాల్‌నట్స్, ఆలివ్‌నూనె, బీన్స్, గుడ్లు, అవిసెగింజలు.. మొదలైన వాటిలో ఇవి పుష్కలంగా లభిస్తాయి. అందుకే వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గ్రీన్ టీతో చర్మానికి ఎంతో మేలు కలుగుతుందని చాలాసార్లు వినే ఉంటాం. చర్మ కాంతిని మెరుగుపరచడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందట. ఈ క్రమంలో మొటిమల సమస్య ఎక్కువగా బాధిస్తున్నవారు రోజూ రెండు కప్పుల గ్రీన్ టీ తీసుకోవడం వల్ల మంచి ఫలితం పొందచ్చంటున్నారు నిపుణులు. దీనికి ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలే కారణమట. సరిపడినన్ని నీళ్లు తాగితే ఆరోగ్యానికి మంచిదనే విషయం తెలిసిందే. కానీ ఈ సులభమైన చిట్కాను పాటించేవారు మాత్రం తక్కువే అని చెబుతున్నారు నిపుణులు. అయితే చర్మ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలంటే అన్నిటికంటే కీలకమైంది నీరే. అందుకే మొటిమల సమస్య దరిచేరకుండా ఉండేందుకు, వచ్చిన సమస్యను తగ్గించుకోవడానికి రోజూ సరిపడినన్ని నీళ్లు తాగమని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే కొబ్బరినీళ్లు.. మొదలైనవి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుందంటున్నారు.



## పాత దుపట్టాలతో రిబ్బను పువ్వులు!

ఎంతో ఇష్టంగా కొన్న కుర్తీలు-ప్యాంట్లు పాతవైపోతాయి కానీ, వాటికి జతగా వచ్చిన దుపట్టాలు మాత్రం వన్నె తగ్గవు. దాంతో ఆ చున్నీలను పారేయ బుద్ధికాదు... అలాంటప్పుడు ఇలా చేసి చూడండి. అందమైన ఎంబ్రాయిడరీ, డిజైనర్ బోర్డర్లు, మిర్రర్ వర్క్, ప్రింటెడ్ చున్నీలను తీసి పక్కనపెట్టండి. ముఖ్యంగా వాటిల్లో హెవీ వర్క్ దుపట్టాలతో స్టైలిష్ జాకెట్లు, షర్ట్ స్టైల్ బ్లౌజులు లేదా ఇండో-వెస్ట్రన్ క్రాప్ టాప్స్ కుట్టించుకోవచ్చు. వీటిని దుస్తుల కోసమే కాదు... ఇంటి అవసరాలకూ వాడొచ్చు. వాటి డిజైన్‌ను బట్టి అందమైన కుషన్ కవర్లు, డైనింగ్ టేబుల్ రన్నర్లు, విండో కర్టెన్లు, మిక్సీ, గ్రైండర్ కవర్లూ వంటివి కుట్టుకోవచ్చు. పూల డిజైన్లు ఉన్న బోర్డర్లతో ప్రత్యేకమైన ఫొటో ఫ్రేమ్‌లను కూడా తయారు చేసుకోవచ్చు. నెట్ లేదా షిఫాన్ రకపు చున్నీలతో ట్రెండీ హెడ్‌బ్యాండ్‌లు, రిబ్బన్ ఫ్లవర్స్... వంటివి సులభంగా తయారు చేసుకోవచ్చు. దీనివల్ల అదనపు ఖర్చు తగ్గడమే కాకుండా పర్యావరణానికి మేలు చేసినట్లు అవుతుంది అలాగే మన సృజనాత్మకతకు పదును పెట్టినట్లు ఉంటుంది.




## రింగుల జుట్టా?

ఈ హడావుడి జీవనశైలిలో అమ్మాయిల జుట్టు కష్టాలు మామూలుగా ఉండవు. ఇక రింగుల జుట్టు వాళ్ల పరిస్థితి వేరే చెప్పాలా? కాస్త వాతావరణం మారితే చాలు జుట్టు గడ్డిలా మారుతుంది. వచ్చీ పోయే వర్షాలతో నిర్వహణా కష్టమే. మృదువుగా కనిపించాలా... ఇలా చేస్తే సరి.

పొడిగా, ఎండిపోయినట్లుగా కనిపిస్తోందని అస్తమానూ షాంపూ చేయొద్దు. అతిగా తలస్నానం చేసినా కురులలోని సహజ నూనెలు పోయి సమస్య మరింత పెరుగుతుంది. కావాలంటే నీటితో కానీ, కర్ల్ రిఫ్రెషర్‌ని కానీ స్ప్రే చేయండి. ఇవి కురులను తాజాగా కనిపించేలా చేస్తాయి. రింగుల జుట్టు సహజంగానే త్వరగా తేమని కోల్పోతుంది. కాబట్టే, పొడిబారి కనిపించడం, చిట్లడం వగైరా! అరకప్పు కలబంద గుజ్జులో పావుకప్పు కొబ్బరినూనె కలిపి కాసేపు వదిలేయండి. ఆ మిశ్రమాన్ని తరవాత మాడు నుంచి చివర్ల వరకూ పట్టించండి. అరగంటయ్యాక గాఢత లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. పావుకప్పు పెరుగులో మూడు స్పూన్ల తేనె కలిపి పట్టించినా మంచిదే. మిగలపండిన అరటి పండు, కలబంద గుజ్జు... సమపాళ్లలో తీసుకునీ బాగా మెత్తగా మెదిపి తలకు పట్టించొచ్చు. ఇవి కురులకు తేమను అందిస్తాయి. వారానికోసారి వీటిల్లో నచ్చింది ప్రయత్నిస్తే సరి.

తల త్వరగా ఆరదు. అందుకని మరీ రుద్దేయొద్దు. మృదువుగా నీళ్లన్నీ పిండేయండి. ఆపై కాటన్ టీషర్టుతోనో మెత్తని టవల్‌తోనే అద్దితే తడి త్వరగా పోతుంది. ఇంటి చిట్కాల పేరుతో నిమ్మ, బేకింగ్‌సోడా, యాపిల్ సిడార్ వినెగర్ వంటివి మీరు వాడొద్దు. పొడిబారే సమస్య మరింత పెరుగుతుంది. జుట్టు త్వరగా లేస్తుందని గట్టిగా అల్లడం చేయొద్దు. కండిషనర్‌నీ తప్పనిసరి చేసుకోండి. నిర్దిష్ట హెయిర్ కేర్ రొటీన్‌ని పాటిస్తూ వెళ్లండి. మృదువైన మీ రింగులు మిమ్మల్నే కాదు... చూపరులనూ ఆకర్షించడం ఖాయం.



### ఇంటర్నెట్ లేకున్నా ఫోన్‌పేలో యూపీఐ సేవలు

ఫీచర్ ఫోన్ వినియోగదార్లకోసం ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ ఫోన్‌పే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటర్నెట్ లేకపోయినా వారు యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా 'యూపీఐ 123పే' సర్వీసును ఆవిష్కరించింది. దీంతో 20కోట్ల మందికి పైగా ఫీచర్‌ఫోన్ వినియోగదార్లు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలగనుంది. 2జీ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నమ్మకమైన లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఈ యూపీఐ123పే ఉపయోగించుకుంటుంది.

# బిజినెస్

## 'యాపిల్'కు టాప్ గేర్.. టిమ్ కుక్ ప్రస్థానమిదీ!



హాయిగా సాగిపోతున్న ఉద్యోగం.. అప్పటికే దివాలా అంచున ఉన్న కంపెనీ నుంచి జాబ్ ఆఫర్. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని వదులుకునే సాహసం ఎవరూ చేయరు. కానీ, ఒక్క భేటీ ఆ ఉద్యోగి నిర్ణయాన్ని మార్చింది. తర్వాతి కాలంలో ఆయన్ను కంపెనీకి సీఈఓను చేసింది. కంపెనీని సైతం ప్రపంచంలోనే అత్యంత విలువైన వాటిల్లో ఒకటిగా నిలిపింది. ఆ ఉద్యోగే టిమ్ కుక్. ఆయనతో భేటీ అయిన వ్యక్తే యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్. యాపిల్‌కు సుదీర్ఘకాలం పాటు సీఈఓగా వ్యవహరించిన టిమ్ కుక్ ఆ బాధ్యతల నుంచి వైదొలిగిన వేళ.. ఆ సంస్థలోకి ఆయన రాక ఎలా సాగిందనేది చూద్దాం. అది 1998. టిమ్ కుక్.. కాంపాక్ అనే కంపెనీలో మంచి హోదాలో పనిచేస్తున్నారు. ఆ సమయంలో కాంపాక్ విలువ 30 బిలియన్ డాలర్లు. యాపిల్ కంపెనీ విలువ 3 బిలియన్ డాలర్లు మాత్ర మే. పైగా దివాలా అంచున ఉంది. ఆ సమయంలో యాపిల్ నుంచి వచ్చిన జాబ్ ఆఫర్‌ను కుక్ తిరస్కరించారు. తాను పనిచేస్తున్న ఉద్యోగంలోనే తనకు ఆనందం ఉందని తెగేసి చెప్పారు. 2014లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో టిమ్ కుక్ ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు. జాబ్ ఆఫర్‌ను తిరస్కరించినా యాపిల్ నుంచి కుక్‌కు కాల్స్ వస్తూనే ఉన్నాయి. స్టీవ్ జాబ్స్‌తో భేటీ అని చెప్పగానే టిమ్ కుక్ కూడా కాస్త మెత్తబడ్డారు. దీంతో ఆయనపై ఉన్న గౌరవంతో సమావేశానికి అంగీకరించారు. వాస్తవానికి యాపిల్‌లో చేరాలనే ఉద్దేశమేదీ అప్పటి వరకు టిమ్‌కుక్‌కు లేదు. భేటీ ప్రారంభమైన కాసేపటికే జాబ్స్ తన ఆలోచనలను కుక్‌తో పంచుకోవడం ప్రారంభించారు. కంపెనీని ఎలా ముందుకు నడిపించాలి? వినియోగదారులను ఎలా ఆకట్టుకోవాలి? అనే అంశాలపై మాట్లాడడం మొదలుపెట్టారు. జాబ్స్ విజన్ కుక్‌ను అమితంగా ఆకట్టుకుంది. దీంతో కాంపాక్‌ను వీడి యాపిల్‌లో చేరాలని కుక్ నిర్ణయించుకున్నారు. స్నేహితులు, సలహాదారులు వారించినా యాపిల్‌లో చేరేందుకే మొగ్గు చూపారు. అలా 1998లో యాపిల్‌లో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా చేరారు. యాపిల్‌లో టిమ్‌కుక్‌ది మూడు దశాబ్దాల ప్రస్థానం. వివిధ హోదాల్లో పనిచేశారు. 2011లో స్టీవ్ జాబ్స్ నుంచి నాయత్వ బాధ్యతలు చేపట్టారు. 15 ఏళ్లపాటు ఆ బాధ్యతల్లో కొనసాగారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. స్టీవ్ అప్పగించిన కంపెనీని అంతే బాధ్యతాయుతంగా ముందుకు నడిపించే వ్యక్తి కోసం ఏళ్ల పాటు అన్వేషించి.. టిమ్‌కుక్ తర్వాత ఆ బాధ్యతల్లో జాన్ టెర్నస్‌ను ఎంపిక చేశారు. కొత్త సీఈఓకు బాధ్యతలు అప్పగించి.. ఇకపై కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా కుక్ కొనసాగనున్నారు. టిమ్ కుక్ హయాంలో యాపిల్ కంపెనీ రికార్డు వృద్ధి సాధించింది. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి కంపెనీ విలువ దాదాపు 350 బిలియన్ డాలర్లు ఉండగా.. ఆయన నాయకత్వంలో ఏకంగా 4.5 ట్రిలియన్ డాలర్లను దాటింది.

## ఆగస్టులో జీఎస్టీ, యూపీఐ లావాదేవీలు భేష్




దేశంలో ఆర్థిక కార్యకలాపాలకు సూచికగా నిలిచే వస్తు, సేవల పన్ను (GST), యూపీఐ (UPI) లావాదేవీలు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఆగస్టు నెలలో ఈ రెండూ మెరుగైన వృద్ధిని సాధించాయి. గడిచిన నెలలో జీఎస్టీ వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు దాటగా.. యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరువగా నమోదయ్యాయి.

ఆగస్టు నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 14.8 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. ఈ మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల నుంచి రూ.1.37 లక్షల కోట్లు రాగా.. దిగుమతుల ద్వారా రూ.62,604 కోట్లు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సెంట్రల్ జీఎస్టీ (CGST) వసూళ్లు రూ.38,413 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ (SGST) వసూళ్లు రూ.46,316 కోట్లుగా నిలిచాయి. సమీకృత జీఎస్టీ (IGST) వసూళ్లు రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) ద్వారా ఆగస్టు నెలలో రూ.29.8 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (NPCI) వెల్లడించింది. గతేడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.24.85 లక్షల కోట్లుగా ఉంది. అంటే 20 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే, జులై నెలల్లో రూ.29.9 లక్షల కోట్లు చొప్పున రికార్డు స్థాయిలో యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఆగస్టులోనూ రికార్డు స్థాయికి చేరువ కావడం గమనార్హం. సంఖ్యాపరంగా చూస్తే జులైలో 23.66 బిలియన్ లావాదేవీలు జరగ్గా.. ఆగస్టులో ఆ సంఖ్య పెరిగి 24.51 బిలియన్‌లకు చేరింది.

## సీఎన్‌జీ, జెట్ ఇంధన ధరలు పెంపు




పశ్చిమాసియా ఘర్షణలు ఎప్పుడు ముగుస్తాయో తెలియని అనిశ్చితి నెలకొంది. దాంతో ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి సీఎన్‌జీ ధరలు పెరిగాయి. విమానాల్లో ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలో కూడా వరుసగా రెండోనెలలో పెంపు నమోదైంది. మంగళవారం మహానగర్ గ్యాస్ లిమిటెడ్ సీఎన్‌జీ ధరను కేజీకి రూ.2 చొప్పున పెంచింది. దీంతో ముంబయి, పరిసర ప్రాంతాల్లో కేజీ గ్యాస్ ధర రూ.88కి ఎగబాకింది. డొమెస్టిక్ పైప్డ్ నేచురల్ గ్యాస్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు ఒక రూపాయి చొప్పున పెరిగింది. ఈ ధరలు నేటినుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో అంతర్జాతీయ విపణిలో ధరలకు అనుగుణంగా ఈ ఇంధనాల రేట్లను సవరించినట్లు ఎంజీఎల్ వెల్లడించింది. రెండురోజుల క్రితం ఇంద్రప్రస్థ గ్యాస్ లిమిటెడ్ కూడా సీఎన్‌జీ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. దాంతో దిల్లీ పరిసర ప్రాంతాల్లో ఆ గ్యాస్ ధర రూ.83.09 నుంచి రూ.86.98కి చేరింది. సీఎన్‌జీ ధరలు పెరగడంతో ఆటో, ట్యాక్సీ సంఘాలు ప్రయాణ ఛార్జీల పెంపునకు డిమాండ్ చేస్తున్నాయి. దేశీయ విమానాలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధర లీటర్‌కు రూ.6.28 (5.46 శాతం) మేర పెరిగింది. దీంతో లీటర్ ధర రూ.115 నుంచి రూ.121.28 కి పెరిగింది. ఈ మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వర్గాలు వెల్లడించాయి. ఈ పెంపు దేశీయ విమానయాన సంస్థలకు భారంగా మారనుంది. దాంతో ఆ ప్రభావం ప్రయాణికులపై పడనుంది. ఆగస్టు ఒకటిన ఏటీఎఫ్ లీటర్ ధర రూ.110 నుంచి 115కు పెరిగిన సంగతి తెలిసిందే. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధర మరోసారి పెరిగింది. ఒక్క సిలిండర్‌పై దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో రూ.9.50 నుంచి రూ.11.50 వరకు పెరిగింది.

### నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు..



దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ముడిచమురు ధరల పెరుగుదల, బ్యాంక్, ఆటో షేర్లలో అమ్మకాలు వంటి కారణాలతో సూచీలు నష్టపోయాయి. క్రితం సెషన్‌లో 76,957 వద్ద సెన్సెక్స్ ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో 76,994 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,231 వరకు ఎగబాకింది. చివరకు 12 పాయింట్ల నష్టంతో 76,944.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,055 వద్ద క్లోజ్ అయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి, 94.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీలో ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ షేర్లు రాణించాయి. శ్రీరామ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, నెస్లే, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టపోయాయి.


## సుభాష్‌చంద్ర వ్యవహారం.. రూ.6.25 కోట్ల చెల్లింపు ఆదేశాలు నిలిపివేత



ఎస్సెల్ గ్రూప్ వ్యవస్థాపకులు సుభాష్‌చంద్ర వ్యక్తిగత దివాలా ప్రక్రియపై వివాదం కొనసాగుతోంది. రూ.22,006 కోట్ల క్లెయిమ్‌నకు గానూ రూ.6.25 కోట్లు మాత్రమే చెల్లించేందుకు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ అనుమతించడంపై రుణాలు ఇచ్చిన బ్యాంకులు ఆగ్రహంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. చెల్లింపు విషయంలో ద్విసభ్య బెంచ్ ఇచ్చిన తీర్పును ఐదుగురు సభ్యులతో కూడిన ఎన్‌సీఎల్‌టీ ధర్మాసనం నిలిపివేసింది. సుభాష్ చంద్రపై దాఖలైన వ్యక్తిగత దివాలా ప్రక్రియలో భాగంగా క్రెడిటర్లంతా కలిసి రూ.22,006.57 కోట్లు క్లెయిమ్ చేయగా.. కేవలం రూ.6.25 కోట్లు చెల్లించే పరిష్కార ప్రణాళికకు ఇటీవల ఎన్‌సీఎల్‌టీ ఆమోదం తెలిపింది. ఈ ప్రణాళికకు 80.81 శాతం క్రెడిటర్ల నుంచి ఆమోదం లభించడం గమనార్హం. ఈ కేసు విషయంలో డివిజన్ బెంచ్‌లోని ఇద్దరు సభ్యులు భిన్నాభిప్రాయాలతో వేర్వేరు తీర్పులు ఇవ్వడంతో మూడో సభ్యుడిని నియమించగా.. కేవలం రూ.6.5 కోట్లు చెల్లించే ప్రణాళికకే ఆయన ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. అయితే, ఇందులో సుభాష్ చంద్ర కుటుంబంతో సంబంధం ఉన్న 5 సంస్థలు రుణదాతల కమిటీలో 61.78 శాతం ఓటింగ్ వాటాను కలిగి ఉన్నాయని, ఈ ప్రణాళిక ఆమోదించడంలో కీలక పాత్ర పోషించాయని బ్యాంకులు ఆరోపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో చంద్ర వ్యక్తిగత దివాలా పరిష్కార ప్రక్రియలో భాగంగా రుణ చెల్లింపు ప్రణాళికపై నిర్ణయం తీసుకోవడానికి అయిదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనాన్ని ఎన్‌సీఎల్‌టీ ఏర్పాటు చేసింది. ఇలా ఐదుగురు సభ్యులతో ధర్మాసనం ఏర్పాటు చేయడం ఎన్‌సీఎల్‌టీ చరిత్రలో తొలిసారి. దీనిపై ఈ ధర్మాసనం నేడు విచారణ చేపట్టింది. ఈ క్రమంలో ద్విసభ్య తీర్పును నిలిపివేయడంతో పాటు ఆయన వ్యక్తిగత హామీదారుగా ఉన్న ఆస్తులను ఎవరికీ బదిలీ చేయకూడదని ఆదేశించింది. అన్ని పక్షాలకు నోటీసులు జారీ చేసింది.

# క్రీడలు

### హార్దిక్ పాండ్యకు మళ్లీ గాయం! అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు దూరం




గాయం నుంచి కోలుకుని తిరిగి భారత జట్టులోకి రావాలని చూస్తోన్న హార్దిక్ పాండ్యకు షాక్ తగిలింది. అతడు మళ్లీ గాయపడినట్లు తెలుస్తోంది. దీంతో సెప్టెంబరు 13 నుంచి అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్‌కు పాండ్య దూరమయ్యే అవకాశముంది. తొడ కండరాల గాయంతో బాధపడిన హార్దిక్ కొన్ని నెలలుగా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఉంటున్నాడు. అతడు ఫిట్‌నెస్ సాధించాడని ఇటీవల సీవోఈ వర్గాలు చెప్పగా.. అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌తో రీ ఎంట్రీ ఇస్తాడని అంతా భావించారు. అయితే, తాజాగా శిక్షణ సమయంలో హార్దిక్ కాలికి గాయమైనట్లు సమాచారం. దీంతో అఫ్గాన్‌తో సిరీస్‌కు పాండ్య అందుబాటులో ఉండటం కష్టమే. ఈ సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ ఈ వారంలో జట్టును ప్రకటించనుంది. దిల్లీ వేదికగా ఈ నెల 13, 15, 17 తేదీల్లో అఫ్గాన్, టీమ్‌ఇండియా మూడు టీ20లు జరగనున్నాయి.

## ముంబయితోనే హార్దిక్.. కెప్టెన్‌గా తిలక్ వర్మ!




ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ (MI) సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మ కీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం. 'హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు'' అని ఫ్రాంఛైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపోయినప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకునేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది. ''అవును.. గత సీజన్‌లో సూర్యకుమార్ బాగా ఆడలేదు. కానీ, అంతకు ముందు సీజన్ల సంగతేంటి? కేవలం ఒక ఏడాది ప్రదర్శన ఆధారంగా ముంబయి ఇండియన్స్ ఒక ఆటగాడిని పక్కనపెట్టదు. వారు ఆ విధంగా వ్యవహరించరు. వాళ్లు 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌ను గర్వంగా భావిస్తారు. దానికే కట్టుబడి ఉంటారు'' అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలన్నదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్




సీనియర్ పేసర్లు బుమ్రా, సిరాజ్‌లతో కలిసి బౌలింగ్ చేయడం వల్ల బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించానని భారత ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ అన్నాడు. ఎక్కువ పని భారాన్ని మోయగల అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నానని గుర్నూర్ పేర్కొన్నాడు. ఇప్పటివరకు ఆరు వన్డేలు ఆడిన ఇతను 6.96 ఎకానమీతో 11 వికెట్లు తీసి అంతర్జాతీయ కెరీర్‌ను అద్భుతంగా ఆరంభించాడు. ''రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరపున నేను కనబరిచిన ప్రతిభ కారణంగానే భారత జట్టుకు ఎంపికయ్యా. అయితే, బౌలింగ్‌లో 'లెంగ్త్' విషయంలో స్థిరత్వాన్ని ఎలా సాధించాలి, అలాగే పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఏ బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలి అనే విషయాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. మొదటి నుంచీ నాకు ఒకే ఒక లక్ష్యం ఉంది. ఎన్ని ఓవర్లు వేసినా ఎలాంటి ప్రభావం పడనంతగా శరీరాన్ని దృఢంగా తీర్చిదిద్దుకోవాలి. మోర్నీ (మోర్కెల్), గంభీర్ సర్‌ల సలహాలతో నా బౌలింగ్‌లో చాలా మార్పు కనిపించింది. బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలను కలిసి వారి బౌలింగ్‌ను నిశితంగా పరిశీలించా. నేను కూడా వారిలా అన్ని ఫార్మాట్ల బౌలర్‌గా మారడానికి ప్రయత్నిస్తున్నా''నని గుర్నూర్ బ్రార్ పేర్కొన్నాడు. గుర్నూర్ ప్రస్తుతం నార్త్‌జోన్ తరఫున దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఆడుతున్నాడు. సౌత్‌జోన్‌తో జరుగుతున్న సెమీస్‌లో తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు.

## ఆ ఇద్దరి వల్లే పాక్ క్రికెట్ పతనం..




ఇంగ్లాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శన చేస్తోంది. తొలి రెండు టెస్టుల్లో ఓటమిపాలైన పాక్.. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఒక్కసారి కూడా 200కుపైచిలుకు స్కోరు చేయలేదు. ఆ జట్టు పరిస్థితి ఎంత దారుణంగా ఉందో దీన్ని బట్టి చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై, ఆటగాళ్లపై మాజీలు మండిపడుతున్నారు. 70 ఏళ్లలో అత్యంత చెత్త బోర్డు ఇదేనని మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. ''ప్రతి ఒక్కరూ మన క్రికెట్ టీమ్ గురించే మాట్లాడుతున్నారు. అత్యంత చెత్త టీమ్ ఇదే. ఇక్కడ మనం బోర్డు గురించి కూడా చర్చించాలి. ఎందుకంటే, ఆటగాళ్లను ఎంపిక చేసే సెలక్షన్ కమిటీ, కోచ్‌లను నియమించేది బోర్డే కదా. జట్టు నాశనం కావడానికి ప్రధాన కారణం ఆ బోర్డే' అని లతీఫ్ ఆరోపించాడు. షాహీన్ షా అఫ్రిది, బాబర్ అజామ్ మధ్య ఏర్పడిన విభేదాలే పాక్ క్రికెట్ పతనానికి కారణమని ఆ దేశ మాజీ బ్యాటర్ బాసిత్ అలీ విమర్శించాడు. కెప్టెన్సీ విషయంలో వీరిద్దరి మధ్య తలెత్తిన వివాదం జాతీయ జట్టు పరిస్థితి దిగజారడానికి నాంది పలికిందన్నాడు. ''బాబర్ అజామ్ (Babar Azam) బలమైన కెప్టెన్ కాదు. ఇంగ్లాండ్‌లో ప్రదర్శన ఆధారంగా నేను ఈ మాట అనడం లేదు. అతను అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాడు. కెప్టెన్సీ విషయంలో షాహీన్, బాబర్ మధ్య విభేదాలు తలెత్తిన రోజు నుంచే పాకిస్థాన్ క్రికెట్ పతనం మొదలైంది'' అని బాసిత్ అలీ ఆరోపించాడు.

## ధోని, రోహిత్‌కు దక్కని చోటు



భారత మాజీ బ్యాటర్ ఛెతేశ్వర్ పుజారా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. తన బెస్ట్ టీమ్‌ను ఎంచుకోవాలని పుజారాను కోరారు. అయితే, వారందరూ తన మాజీ సహచరులే అయి ఉండాలనే షరతు విధించారు. ఈ జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఐదుగురు ఆటగాళ్లు.. రిటైర్ అయిన ఆరుగురిని పుజారా ఎంచుకున్నాడు. మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మలకు చోటు కల్పించకపోవడం గమనార్హం. అలాగే కెరీర్‌లో ఎంతోకాలం కలిసి ఆడిన అజింక్య రహానేను కూడా ఛెతేశ్వర్ తన అత్యుత్తమ జట్టులోకి తీసుకోలేదు.

పుజారా తన అత్యుత్తమ జట్టులో మాజీ బ్యాటర్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌లను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడో స్థానాన్ని తనకే ఇచ్చుకున్నాడు. నాలుగో స్థానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను తీసుకున్నాడు. ఐదో స్థానం లో విరాట్ కోహ్లిని ఎంచుకున్న పుజారా.. ఆ తర్వాతి ప్లేస్‌ను మాజీ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు ఇచ్చాడు. వికెట్‌కీపర్‌గా ధోనికి బదులు రిషభ్ పంత్ వైపే మొగ్గుచూపాడు. చివరి నాలుగు స్థానాల్లో ఇద్దరు స్పిన్నర్లుగా రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లను తీసుకున్నాడు. మిగిలిన రెండు స్థానాల్లో పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమిలకు అవకాశం కల్పించాడు. 12వ ఆటగాడిగా మాజీ పేసర్ ఇషాంత్ శర్మను తీసుకున్న పుజారా.. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యకు ఛాన్స్ ఇచ్చాడు.


వుదయం సినిమా

# నవంబర్ 27న 'మైసా' గ్రాండ్ రిలీజ్



**వుదయం సినిమా:** నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన కెరీర్‌లో ప్రతిష్టాత్మక పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో గోండ్ గిరిజన మహిళ పాత్ర పోషిస్తున్న రష్మిక , ఆ పాత్రలో ఒదిగిపోవడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న 'మైసా' ఆకట్టుకునే ఫస్ట్ గ్లింప్స్‌తో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తించింది.తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్‌ను అధికారికంగా ప్రకటించారు. నవంబర్ 27, 2026న 'మైసా' ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది. పోస్టర్‌లో రష్మిక ఒక పెద్ద ఈటె పట్టుకుని నిలబడి ఉండగా, ఆమె ముఖంపై యుద్ధ గాయాలు కనిపిస్తాయి. ఆమె వెనుక భారీ జనసమూహం, మండుతున్న పరిసరాలు ఇంటెన్స్ గా ఉన్నాయి. ఈ పోస్టర్‌కు స్ట్రాంగ్ పీరియడ్-యాక్షన్ లుక్ ఇస్తుంది.భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'మైసా' కొత్త బెంచ్‌మార్క్‌లను క్రియేట్ చేసేలా హై-ఆక్టేన్ స్టంట్ కొరియోగ్రఫీతో రూపొందుతోంది. ఫియర్స్, అడ్రినలిన్-పంపింగ్ అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నారు. ఫిమేల్ లీడ్ సినిమాలకే కాకుండా భారతీయ యాక్షన్ జానర్ కి కొత్త స్థాయికి తీసుకెళ్లేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.ఇటీవల సెట్స్‌లో ఓ హై-ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ చేస్తుండగా గాయపడిన రష్మిక మందన్న.. పాత్ర కోసం తన అంకితభావం, పట్టుదలను చూపించారు. కోలుకున్న తర్వాత త్వరలోనే ఆమె తిరిగి షూటింగ్‌లో పాల్గొని చివరి దశ షూటింగ్‌ను పూర్తి చేయనున్నారు. ప్రస్తుతం ఇంకా 12 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది.పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అద్భుతమైన విజువల్ స్పెక్టకిల్‌ను అందించేందుకు అడ్వాన్స్‌డ్ వీఎఫ్‌ఎక్స్ పనులు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయి. దీనికి పవర్‌ఫుల్, పల్స్-పౌండింగ్ ఒరిజినల్ స్కోర్ మరింత బలాన్ని చేకూర్చనుంది.

# 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' నాలుగో పాట విడుదల



**వుదయం సినిమా:** ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్' నుంచి నాలుగో పాట 'సబ్‌కో' నేడు విడుదలైంది. ఇప్పటికే సినిమాపై, ఆల్బమ్‌లోని పాటలపై మంచి ఆసక్తి నెలకొన్న నేపథ్యంలో విడుదలైన ఈ పాట మరింత ఉత్సాహభరితమైన మ్యూజికల్ ఫ్లేవర్‌ను అందిస్తోంది.అత్యంత ప్రతిభావంతుడైన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన 'సబ్‌కో' పాటను సంజిత్ హెగ్డే, సితార కృష్ణకుమార్ ఆలపించారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన ఆకట్టుకునే స్వరకల్పన పాటకు ప్రత్యేకమైన, ఆహ్లాదకరమైన వైబ్‌ను తీసుకొచ్చింది. ఈ పాటకు శ్రీ హర్ష ఇమాని సాహిత్యం అందించారు.గుంటూరులోని VVIT కాలేజీలో విద్యార్థుల ఉత్సాహభరిత సమక్షంలో 'సబ్‌కో' పాటను విడుదల చేశారు. విద్యార్థుల సందడి, ఉత్సాహంతో పాట లాంచ్ కార్యక్రమం ఎంతో జోష్‌గా, ప్రత్యేకంగా జరిగింది. ఇప్పటికే 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'కు సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ సోషల్ మీడియాలో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తుండగా, తాజాగా విడుదలైన 'సబ్‌కో' పాట ఆ క్రేజ్‌ను మరింత పెంచుతోంది. ప్రస్తుతం చిత్ర బృందం విస్తృత స్థాయిలో ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు కాలేజీలు, నగరాలను సందర్శిస్తూ విద్యార్థులతో ప్రత్యేకంగా మమేకమవుతున్నారు. మరోవైపు వరుసగా ప్రమోషనల్ ఇంటర్వ్యూల్లో పాల్గొంటూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నారు. చిత్ర బృందం చేస్తున్న ఈ విస్తృత ప్రచారం సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానున్న 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'పై మరింత ఆసక్తిని పెంచుతోంది. డెబ్యూ డైరెక్టర్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు.

# 'మిర్జాపూర్ ది మూవీ' ప్రెస్ మీట్




**వుదయం సినిమా:** బాలీవుడ్ స్టార్స్ పంకజ్ త్రిపాఠి, దివ్యేందు, అలీ ఫజల్ ప్రధాన పాత్రల్లో నటించిన క్రైమ్ యాక్షన్ డ్రామా 'మిర్జాపూర్ ది మూవీ'. టాప్ వెబ్ సిరీస్ 'మిర్జాపూర్'కు కొనసాగింపుగా తెరకెక్కిన ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. గుర్మీత్ సింగ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను రితేష్ సిధ్వాని, ఫర్హాన్ అక్తర్ నిర్మించారు. 'మిర్జాపూర్ ది మూవీ' సెప్టెంబర్ 4న హిందీ, తెలుగు భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా 'మిర్జాపూర్ ది మూవీ' చిత్ర బృందం హైదరాబాద్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించింది.ప్రెస్ మీట్ లో పంకజ్ త్రిపాఠి మాట్లాడుతూ.. 'అందరికీ నమస్కారం. మిర్జాపూర్ వెబ్ సిరీస్‌కు ప్రపంచవ్యాప్తంగా చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు మేము దీన్ని పెద్ద స్క్రీన్‌పై చూసేలా ఈ సినిమాగా తీసుకొచ్చాం. మీ అందరితో పాటు తెలుగు ట్రైలర్‌ను ఇక్కడ చూడడం మాకు చాలా ఆనందంగా అనిపించింది. నేను చేసిన కాలీన్ భయ్యా క్యారెక్టర్‌కు ప్రేక్షకులు ఎంతగానో అభిమానం చూపించారు. తెలుగు ఆడియన్స్ కాలీన్ భయ్యా అని పిలిచారు. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమకు హృదయపూర్వక కృతజ్ఞతలు. తప్పకుండా ఈ సినిమా మీ అందరినీ అలరిస్తుంది.దివ్యేందు శర్మ మాట్లాడుతూ.. 'అందరికీ నమస్కారం. మిర్జాపూర్ సిరీస్ పెద్ద విజయం సాధించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ సిరీస్‌కు ఫ్యాన్స్ ఉన్నారు. తెలుగు ప్రేక్షకులు కూడా ఎంతగానో అభిమానించారు. ఇది చాలా రియలిస్టిక్‌గా సాగే కథ. సినిమాలో కూడా అదే రియలిస్టిక్‌నెస్ ఉంటుంది. ఈ రోజుల్లో ప్రేక్షకులు చాలా పరిణతి చెందారు. వాళ్లు ఎలాంటి సినిమా చూడబోతున్నారో వారికి ముందే ఒక అవగాహన ఉంటుంది. ఇది స్టాండలోన్ ఫిల్మ్. సిరీస్‌లో ఒక్క ఎపిసోడ్ చూడకపోయినా సరే థియేటర్‌లో ఎంజాయ్ చేయొచ్చు.

# 'మారెమ్మ' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్-డ్రామా 'మారెమ్మ'తో హీరోగా పరిచయం అవుతున్నారు. మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, మోక్ష ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మయూర్ రెడ్డి బండారు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు కు మంచి రెస్పాన్స్ వచ్చింది. సెప్టెంబర్ 10 ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకు వస్తోంది. తాజాగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకకు దర్శకుడు శివ నిర్వాణ హాజరయ్యారు. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని ట్రైలర్ ని డిజిటల్ గా లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. మాధవ్ తో రవితేజ గారి 'ఇరుముడి' జర్నీ మొదలైనప్పటి నుంచే పరిచయం అయింది. షూటింగ్ సమయంలో అల్యూమినియం ఫ్యాక్టరీలో మాధవ్‌ను కలిశాను. నాకు అప్పుడు 'మారెమ్మ' సినిమా చేస్తున్నానని చెప్పాడు. తను చెప్పినప్పుడు మేము 'ఇరుముడి' కోసం లొకేషన్స్ చూస్తున్నాం. మొదటి చూసిన లోకేషన్ 'మారెమ్మ' గుడి. 'ఇరుముడి'లో 'కట్టు కట్టు' సాంగ్ ఆ టెంపుల్ బ్యాక్‌గ్రౌండ్‌లోనే చేశాం. 'మారెమ్మ' టీజర్‌ను చూపించాడు. చాలా ఇంటెన్సిటీ ఉంది. నిజానికి ఒక డెబ్యూ హీరో తొలి సినిమా చేస్తున్నప్పుడు పాటలు, ఫైట్లు అన్నీ ప్రూవ్ చేసుకోవాలని ఉంటుంది. ఒక ప్రేమకథతో రావాలి అనుకుంటారు. కానీ అవన్నీ కాకుండా ఒక మంచి కంటెంట్ బేస్డ్ సినిమాని తను ఎంపిక చేసుకోవడం పట్ల నేను తనని అభినందిస్తున్నాను.

# అక్టోబర్ 2న 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'



**వుదయం సినిమా:** వైవిధ్యమైన పాత్రల్లో నటించి విలక్షణ నటుడిగా పేరు పొందిన స్టార్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్, ఇండస్ట్రీ హిట్ బాహుబలి మూవీని నిర్మించిన మేకర్స్‌తో పాటు సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి కలయికలో రూపొందుతోన్న చిత్రం 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. షోయింగ్ బిజినెస్ బ్యానర్‌పై తొలిసారి డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రేమలు చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ఎస్.ఎస్. కార్తికేయ.. ఇప్పుడీ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను ఇండియన్ సినిమాకు గర్వకారణంగా నిలిచిన బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాతలైన ఆర్కా మీడియాతో కలిసి రూపొందిస్తున్నారు.'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రానికి శశాంక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాసిల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ కలసి ఈ ఆసక్తికరమైన, కంటెంట్ రిచ్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే వినోదాన్ని పంచుతూ ఆసక్తిని రేకెత్తించిన టీజర్ తర్వాత మేకర్స్ 'కేకు వాకు' అనే వీడియో సాంగ్‌కు ఆడియెన్స్ నుంచి అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది.ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమాను వరల్డ్ వైడ్‌గా అక్టోబర్ 2న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు అనౌన్స్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌ను గమనిస్తే ఫహాద్ ఫాజిల్ మెట్లపై కూర్చుని ఉన్నారు. తన పక్కనే చిన్న పాప స్పారా కూర్చుని ఉంది. ఆమె ఓ కలర్ స్టిక్‌ను పట్టుకుని ఇంద్రజాలం చేస్తోంది. డబ్బు వర్షంలా కురుస్తుంది. దాన్ని చూసిన ఫహాద్ ఆనందంతో ఆశ్చర్యపోతున్నారు. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మూవీ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం అక్టోబర్2, 2026న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

## "రోమాంచకం" యూత్, ఫ్యామిలీ ఎంటర్ టైనింగ్ మూవీ



ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా

**వుదయం సినిమా:** బ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా ఈ నెల 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర విశేషాలను జరిగిన ఇంటర్వ్యూలో తెలిపారు. ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా – సినిమా ప్రొడక్షన్ సీరియస్ గా చేయాలని టీమ్స్ ను పెట్టుకుని చేసే మైండ్ సెట్ లో మేము లేము. గతంలో కొన్ని కథలు విన్నాము. అవి మా సెన్సిబిలిటీస్ కు దగ్గరగా లేవని వదిలేశాం. ఈ కథలో హ్యూమర్ ఉంది, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి. ఫ్రెండ్స్ మధ్యలో జరిగే సరదా సీన్స్ ఉన్నాయి. ఇది బాగుంటుందని అనిపించి టేకప్ చేశాం. డైరెక్టర్ వేణుగోపాల్ మాతో మూడు నాలుగేళ్లుగా ట్రావెల్ చేస్తున్నారు. ఆయన స్క్రిప్ట్ నెరేషన్ కూడా మమ్మల్ని ఆకట్టుకుంది.– డైరెక్టర్స్ గా సందీప్ కు, వేణుగోపాల్ కు నార్త్ సౌత్ పోల్స్ అంత డిఫరెన్స్ ఉంది.

# 'సర్దార్ 2' స్పై మిస్టరీ హై వోల్టేజ్ యాక్షన్ ట్రైలర్



**వుదయం సినిమా:** హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్' మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2'తో సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. సర్దార్ తో ఏర్పడిన స్పై యూనివర్స్‌ను మరింత పెద్ద కాన్వాస్‌పైకి తీసుకెళ్లిన ఈ సీక్వెల్‌లో డేంజర్, కాన్ఫ్లిక్ట్, యాక్షన్ నెక్స్ట్ లెవల్ కి వెళ్ళిందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. గతంలో జరిగిన సంఘటనలను, ప్రస్తుతం ఎదురవుతున్న ప్రమాదాన్ని కలిపి కథను ప్రజెంట్ చేయడం అద్భుతంగా ఉంది. మురుగన్ స్వామికి పరమ భక్తుడైన సర్దార్‌ను జపాన్‌లో జరిగే ఒక సీక్రెట్ బ్లాక్-ఆప్స్ మిషన్ కోసం రిక్రూట్ చేస్తారు. ఒక సాధారణ సీక్రెట్ ఆపరేషన్‌గా మొదలైన మిషన్ ఊహించని పరిస్థితుల్లోకి వెళ్లడంతో సర్దార్‌పై ప్రభావం పడుతుంది. ఎంతోమంది ప్రాణాలను కాపాడినప్పటికీ అతడిని ఏదో వెంటాడుతూనే ఉంటుంది. అక్కడి నుంచి కథ ప్రస్తుత కాలానికి వస్తుంది. దేశానికి ఎదురయ్యే ఒక తీవ్రమైన ముప్పు సర్దార్, అతని కొడుకు విజయ్‌ను మరో ప్రమాదకరమైన మిషన్‌లోకి తీసుకెళ్తుంది. తండ్రీకొడుకులు కలిసి ఈ ఆపరేషన్‌లోకి దిగిన తర్వాత.. వారి ముందుకు ఒక మిస్టీరియస్ విలన్ వస్తాడు. అతడి అసలు లక్ష్యం ఏమిటనేది మాత్రం ఇంకా సీక్రెట్‌గానే ఉంచారు.కార్తీ మరోసారి రెండు విభిన్న పాత్రలతో అదరగొట్టారు. తండ్రి, కొడుకులను లుక్స్, మేనరిజమ్స్, బాడీ లాంగ్వేజ్‌తో చాలా డిఫరెంట్‌గా చూపించారు. ముఖ్యంగా యంగ్ సర్దార్‌గా కార్తీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆకట్టుకుంటోంది. విజయ్ పాత్రలో మరో డిఫరెంట్ ఎనర్జీ కనిపిస్తోంది. ఎస్.జే. సూర్య విలన్‌గా ఇంటెన్స్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయన అనూహ్యమైన బిహేవియర్ కథలో టెన్షన్‌ను మరింత పెంచుతోంది.మాళవిక మోహనన్, ఆశికా రంగనాథ్, రజిషా విజయన్, అచ్యుత్ కుమార్, యోగిబాబు పాత్రలకు సంబంధించిన విజువల్స్ ట్రైలర్‌లో ఆసక్తికరంగా ఉన్నాయి.విజువల్‌గా 'సర్దార్ 2' మొదటి భాగం కంటే మరింత భారీగా కనిపిస్తోంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.